PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 152 | విజయవాడ, ఆదివారం 4 జనవరి 2026 | 8 +8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 4 January 2026 | Rs

పాలనలో తెలుగుకు ప్రాధాన్యత

- తెలుగులోనే జిల్లా కోర్టుల్లో కార్యకలాపాలు
- తెలుగు ఉపాధ్యాయులను గౌరవించాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ

2

సావిత్రిభాయి పూలే స్ఫూర్తితో పాలన

- మంత్రి సవిత

2

అగ్ర రాజ్యం ఉగ్ర దాడి

- వెనిజులాపై సాయుధ దురాక్రమణ • రాజధాని కారకస్ సహా పలు ప్రాంతాల్లో భీకర దాడులు
- అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను బంధించి న్యూయార్క్‌కు తరలింపు
- చమురు కోసం బరితెగింపు • ట్రంప్ నేరపూరిత చర్యకు పలు దేశాల ఖండన

వెనిజులాపై అమెరికా భీకరదాడులు చేస్తున్న దృశ్యం

కారకస్ : అగ్ర రాజ్యం మరో ఉగ్రదాడికి తెగబడింది. లాటిన్ అమెరికా దేశమైన వెనిజులాపై నిర్లజ్జగా సాయుధ దురాక్రమణకు పాల్పడింది. వెనిజులాలో సుసంపన్నమైన చమురు వనరులను కొల్లగొట్టేందుకు మదురో ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు పదే పదే కుట్రలు పన్నుతున్న అమెరికా శనివారం తెల్లవారు జామున రాజధాని కారకస్‌పైన, మిరాండా, అరగువా, లా గుయిరా రాష్ట్రాలపైన భీకర దాడులకు దిగింది. కారకస్‌లోని లా కార్లోటా ఎయిర్ ఫీల్డ్, ఫ్యూర్టే లియునా మిలట్రీ బేస్, లాగ్వైరా నౌకాశ్రయం మొదలైన కీలక సైనిక స్థావరాలపైన, పౌర కేంద్రాలపైన దాడులకు పూనుకుంది. అధ్యక్షుడు మదురోను, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను బంధించి న్యూయార్క్‌కు తరలించింది. అమెరికాకు చెందిన 150కిపైగా యుద్ధ విమానాలు గగనతలంలో చక్కర్లు కొడుతూ కురిపించిన బాంబుల వర్షానికి వెనిజులా ప్రజలు భయాందోళనలతో పరుగులు తీశారు. అమెరికా దురాక్రమణ పూరిత దాడిని రష్యా, చైనా, బ్రెజిల్, క్యూబా, కొలంబియాతో సహ పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. అమెరికా చర్యకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి.



మీడియాతో మాట్లాడుతున్న ట్రంప్ , కళ్ళకు గంతలు కట్టి చేతులకు బేడీలు వేసి యుద్ధనౌకలో మదురోను తరలిస్తున్న దృశ్యం

ఇరాక్‌పై దురాక్రమణ దాడికి ముందు అప్పటి జార్జి బుష్ ప్రభుత్వం వల్లించిన అబద్ధాలనే ఇప్పుడు వెనిజులా విషయంలో ట్రంప్ వల్లిస్తున్నాడు. ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ సామూహిక మారణాయుధాలు కలిగివున్నారన్న ఆరోపించి, ఆయనను పట్టుకుని చంపేసిన అగ్రరాజ్యం నేడు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాతో సంబంధముందన్న సాకుతో వెనిజులా అధ్యక్షుడు మదురోను బంధించింది. అమెరికా సైన్యంలోని అత్యంత కిరాతకమైన విభాగం డెల్టా ఫోర్స్ ఈ దాడికి పాల్పడినట్లు పేరు తెలపడానికి ఇష్టపడని అమెరికన్ మిలిటరీ అధికారి ఒకరు తెలిపారు. ఈ డెల్టా ఫోర్స్ గతంలో 1989లో పనామా నేత మాన్యుయెల్ నోరిగాను బంధించి జైలులో పెట్టింది. అమెరికా సాయుధ దాడులకు దిగడంతో వెనిజులాలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని ప్రకటించారు.

అధికార బదిలీ అయ్యేదాకా అక్కడ మేమే ఉంటాం : ట్రంప్

అధికార బదిలీ సాఫీగా జరిగేదాకా అక్కడ తామే ఉంటామని ట్రంప్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున నిర్వహించిన ఆపరేషన్ మిడ్ నైట్ అద్భుతంగా విజయవంతమైందని ఆయన ప్రకటించారు. మరోవైపు మదురో స్థానంలో అధ్యక్ష బాధ్యతలను ఉపాధ్యక్షులు డెల్సీ రొడ్రిగజ్ తాత్కాలికంగా నిర్వహిస్తారన్న ప్రచారం జరుగుతోంది. వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు , ట్రంప్ స్పాన్సర్డ్ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మరియా కొరినా మచాడో దేశానికి స్వేచ్ఛాఘడియలు సమీపించాయని వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి గిడియాన్ సార్ ఎక్స్‌లో ట్వీట్ చేస్తూ మదురోను నియంత అని పేర్కొన్నారు.

ఇదొక ప్రమాదకర సాంప్రదాయం : ఐరాస చీఫ్

వెనిజులాపై అమెరికా సాయుధ దాడి ఒక ప్రమాదకరమైన సాంప్రదాయాన్ని సృష్టించిందని ఐరాస చీఫ్ ఆంటోని గుటెరస్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ చట్టాన్ని అమెరికా ఉల్లంఘించడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గుటెరస్ ప్రతినిధి ఒక ప్రకటన విడుదల జేశారు. చర్చల ద్వారా సమస్య పరిష్కరించు కోవాలని, అంతర్జాతీయ చట్టాన్ని గౌరవించాలని ఆయన కోరారు.

అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే : చైనా

వెనిజులాపై అమెరికా దాడిని చైనా తీవ్రంగా ఖండించింది. ఒక సార్వభౌమత్వ దేశాధ్యక్షుడిని బల ప్రయోగం ద్వారా తొలగించడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని చైనా విదేశాంగ శాఖ మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా చర్య వెనిజులా సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘించడమేగాక, లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంతంలో శాంతికి , భద్రతకు ముప్పు అని పేర్కొంది. ఐరాస నియమావళికి అమెరికా కట్టుబడి ఉండాలని, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని, భద్రతను ఉల్లంఘించే చర్యలను అమెరికా వెంటనే విరమించుకోవాలని కోరింది.

దురాక్రమణ దాడి ఆపండి

మదురో దంపతుల ఆచూకీపై ఆధారాలివ్వండి

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ • నిరసనలకు పిలుపు

న్యూఢిల్లీ : వెనిజులా రాజధాని కారకస్ నగరంతోసహా ఆ దేశంలోని పలు ప్రాంతాల్లో బాంబు దాడులకు పాల్పడడం ద్వారా వెనిజులాపై అమెరికా పాల్పడిన దురాక్రమణ దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ పొలిట్‌బ్యూరో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. వెనిజులాలో మదురో ప్రభుత్వాన్ని కూల్చేయాలన్న లక్ష్యంతో గత కొద్ది వారాలుగా ఆ దేశం చుట్టూ అమెరికా తన సైనిక, నావికా బలగాలను మోహరిస్తూ వచ్చిందని, డిసెంబరు మొదటి వారంలో ప్రకటించిన అమెరికా జాతీయ భద్రతా వ్యూహం- 2025 అసలు రంగు ఇప్పుడు బయటపడిందని సిపిఎం పేర్కొంది. పశ్చిమార్ధగోళంలో అమెరికా బలగాలను కేంద్రీకరించడం, మొత్తంగా ఆ ప్రాంతాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవాలన్న ఉద్దేశాన్ని బహిరంగంగా ప్రకటించడం మన్రో సిద్ధాంతంతో ట్రంప్‌కు గల సంబంధాన్ని సూచిస్తుంది. తక్షణమే ఈ దురాక్రమణకు స్వస్తి చెప్పాలని, కరేబియన్ సముద్ర జలాల నుండి తన బలగాలన్నింటినీ ఉపసంహరించుకోవాలని పొలిట్ బ్యూరో డిమాండ్ చేసింది. లాటిన్ అమెరికాను శాంతి మండలంగా ప్రకటించాలని కోరింది. సార్వభౌమాధికార దేశాల అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోరాదని స్పష్టం చేసింది.

అమెరికా దురాక్రమణ చర్యను ఖండిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి మిగతా 5లో

తెలంగాణ తరహాలో 'ఉపాధి' పై కేబినెట్ తీర్మానం చేయాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం వల్ల ఉపాధి హామీ చట్టం నీరుగారిపోవడంతో పాటు రాష్ట్రం ఎక్కువగా నష్టపోతుందని తెలిపారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం దీనికి మద్దతు తెలపడం, 125 రోజులకు పెంచుతున్నట్లు గ్రామీణ పేదల్లో భ్రమలు పెట్టేందుకు ప్రచార కార్యక్రమం నిర్వహించ డాన్ని ఖండించారు. గ్రామీణ పేదలు ఎక్కడికక్కడ దీన్ని ఎదుర్కొని పాతచట్టం పునరుద్ధరణకు అధికారులకు వినతిపత్రాలు అందించాలని శ్రీనివాసరావు కోరారు.

2013 భూసేకరణ చట్టానికి చేసిన సవరణ రద్దు చేయాలి

2013 భూసేరణ చట్టాన్ని మార్చే ఉద్దేశం కానీ, సవరించే ఆలోచనకానీ కేంద్ర ప్రభుత్వానికి లేదని కేంద్ర కేబినెట్ సెక్రటరీ టివి సోమనాథన్ ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టానికి గతంలో చేసిన సవరణలు ఉపసంహరించుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అభివృద్ధి పథకాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు లోబడి ఉంటాయని, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని భూసేకరణ జరగాలని అధికారయుతంగా కేంద్ర కేబినెట్ సెక్రకరీ ప్రకటించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సవరణ ప్రజాభిప్రాయాన్ని తుంగలో తొక్కిందని తెలిపారు. ఆచరణలో బలవంతపు భూసేకరణగా మారిందని, అందువల్ల కేంద్ర చట్టానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన సవరణలు ఉపసంహరించుకోవాలని కోరారు.

విభజన హామీల అమలు కమిటీని నియమించాలి

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు నిండినప్పటికీ ఇంతవరకు ప్రత్యేక హోదా సహా విభజన చట్టంలో అనేక అంశాలు అమలు కాలేదని శ్రీనివాసరావు విమర్శించారు. కృష్ణా, గోదావరి జలాల వివాదాన్ని పరిష్కరించేందుకు కేంద్ర కమిటీ నియమించిన నేపథ్యంలో రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ అమలును సమీక్షించి నిధులు కేటాయించేందుకు తక్షణం కేంద్రం ఉన్నతస్థాయి సమీక్ష కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ రక్తపాతం

- రెండు ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మృతి
- సుక్మాలో 12 మంది, బీజాపూర్‌లో ఇద్దరు

5

గుజరాత్‌లో టైఫాయిడ్ కలకలం

- చిన్నారులతో సహా వందమంది ఆసుపత్రి పాలు

'విబి జి ఆర్‌ఎం జి'తో

ఉపాధికి హామీ లేదు

- రాష్ట్రంపై ఏటా రూ.3,470 కోట్ల ఆర్థిక భారం
- వ్యవసాయ పనుల పేరుతో 60 రోజుల నిషేధం
- వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, ఆదివాసీలు, అణగారిన వర్గాలపై ఎక్కువగా ప్రభావం : లిబ్‌టెక్ నివేదిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్‌ఆర్ఇజిఎ) స్థానంలో నూతనంగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ – గ్రామీణ్ (విబి జి ఆర్‌ఎం జి) పథకంలో వేతనదారులకు చట్టబద్ధమైన గ్యారంటీకి కేంద్రం స్వస్తి పలికింది. వేతనదారులకు ఇక ఉపాధికి హామీ లభించే అవకాశం కనిపించడం లేదు. రాష్ట్రంపై విబి జి ఆర్‌ఎం జి పథకం ప్రభావాన్ని అంచనా వేసిన లిబ్ టెక్ సంస్థ ఈ విషయాలను వెల్లడించింది. ఇందుకు సంబంధించిన నివేదికను శనివారం విడుదల చేసింది. కొత్త పథకంతో గ్రామీణ వేతనదారులకు ఉపాధి ఇకపై డిమాండ్ ఆధారిత హక్కుగా కాకుండా, ప్రభుత్వ బడ్జెట్, నోటిఫికేషన్లు, టెక్నాలజీ, కాలానుగుణ ఆంక్షలపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. గ్రామీణ ఉపాధి ఒక చట్టబద్ధమైన హక్కుగా ప్రస్తుతం ఉండగా, అది పరిపాలనా, నిర్వాహణ ఆధారిత విధానానికి మారుతుందని వెల్లడించింది. తాజాగా పెంచిన 125 రోజుల పని దినాల హామీ ఉపాధి హక్కుతో ఎట్టిపరిస్థితుల్లోనూ సమానం కాదని తెలిపింది. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు సగటున కల్పిస్తున్న పని దినాలు 51.6 రోజులు మాత్రమేని, ఇక 100 రోజుల పని దినాలను పూర్తి చేసుకున్న కుటుంబాలు కేవలం 11 శాతమే ఉన్నట్లు పేర్కొంది. ఇందుకు కారణం ఆర్థిక, పరిపాలనా పరిమితులేనని స్పష్టం చేసింది.

ప్రస్తుతం ఉన్న ఎంజిఎన్ఆర్ఇజిఎ రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతుంది. విబి జి ఆర్‌ఎం జితో ఈ పరిస్థితి ఉండదని తెల్పింది. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రాంతాలకు మాత్రమే ఇది పరిమితం అవుతుందని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నప్పటికీ భవిష్యత్తులో అన్ని ప్రాంతాల్లో ఈ పథకం అమలవుతుందనే విషయంపై స్పష్టత లేదని వెల్లడించింది. ఈ విధానం వల్ల తక్కువ సంఖ్యలో ఉండి వివిధ ప్రాంతాల్లో విస్తరించిన ఆదివాసీ సమూహాలు ఉపాధికి దూరమయ్యే ప్రమాదం నెలకొందని తెలిపింది.

రాష్ట్రంపై ఆర్థిక ప్రభావం

విబి జి ఆర్‌ఎం జితో ఉపాధి పథకం వ్యయ భారం రాష్ట్రాలపైకి మారనుందని పేర్కొంది. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వాటా అమలులోకి వస్తుందని తెలిపింది. కేంద్రం తన వాటాను పూర్తి స్థాయిలో, సకాలంలో చెల్లిస్తుందనే చట్టబద్ధమైన హామీ లేదని వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వ అప్పులు సుమారు రూ.10 లక్షల కోట్లకు చేరుకున్నాయని అంచనా. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరం వ్యయం మేరకు అంచనా వేస్తే ఉపాధికి విబి జి ఆర్‌ఎం జిలో రూ.3,470 కోట్లను మిగతా 5లో

నేడు మహా ప్రదర్శన, బహిరంగ సభ

- ప్రత్యేక ఆకర్షణగా రెడ్‌డ్రస్ వలంటీర్ల కవాతు
- 2 గంటలకు ప్రదర్శన

ముస్తాబవుతున్న బహిరంగ సభ వేదిక

అనతలవట్టమ్ ఆనందన్ నగర్- గ్రేటర్ విశాఖ బ్యూరో

సిఐటియు పద్దెనిమిదో అఖిల భారత మహాసభ ముగింపు సందర్భంగా ఆదివారం విశాఖ నగరంలో జరిగే మహా ప్రదర్శన, బహిరంగ సభకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని ఎల్ఐసి బిల్డింగ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం నుంచి బయల్దేరి డాబాగార్డెన్స్, పెన్‌స్కూల్, జగదాంబ, పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు మీదుగా సభాస్థలి అయిన ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంకు చేరుకుంటుంది. అనంతరం బహిరంగ సభ జరుగుతుంది. ఈ సభలో సిఐటియు అగ్ర నాయకులు డాక్టర్ కె.హేమలత, తపన్‌సేన్, నూతన రథసారథులు, అలాగే అఖిల భారత కార్యదర్శి, మాజీ ఎంపీ కరీం, కోశాధికారి ఎం.సాయిబాబు ఎపి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి గఫూర్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్.నర్సింగరావు తదితరులు ప్రసంగించనున్నారు. రెడ్‌డ్రస్ వాలంటీర్ల కవాతు మహా ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

ర్యాలీకి వచ్చేవారికి సూచనలు

మహా ప్రదర్శనకు వచ్చినవారు కింది సూచనలు పాటించాలని మహాసభల నిర్వహణ సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనతో కోరారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా వారు హనుమంతువాక, మద్దిలపాలెం, రామాటాకీస్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలుమెట్ట జంక్షన్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలి.

అనకాపల్లి జిల్లా, అనకాపల్లి మీదుగా వచ్చే ఇతర జిల్లాల వాహనాలు కూర్మన్నపాలెం, గాజువాక, ఎన్ఎడి, ఊర్వశి జంక్షన్, తాటిచెట్లపాలెం, గురుద్వార్, ఆర్‌టిసి కాంప్లెక్స్, ఎల్ఐసి బిల్డింగ్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలి. పెందుర్తి మీదుగా వచ్చే వాహనాలు వేపగుంట, సింహాచలం, అడవివరం, మిగతా 5లో

ఉద్యోగులకు కొత్త పెన్షన్ పథకం

- తమిళనాడు సిఎం స్టాలిన్

చెన్నై : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం తమిళనాడు అష్యూర్డ్ పెన్షన్ స్కీమ్ (టిఎపిఎస్)ను అమలు చేయనున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చివరిగా తీసుకున్న మూలవేతనంలో 50శాతానికి సమానమైన పెన్షన్‌ను అందించనున్నట్లు తెలిపారు. అధికారిక ప్రకటన ప్రకారం.. టిఎపిఎస్ కింద ఉద్యోగులు తమ మూలవేతనంలో 10శాతం పెన్షన్ నిధికి జమ చేయాల్సి వుంటుంది. హామీ ఇచ్చిన పెన్షన్‌ను అందించడానికి అవసరమైన అదనపు నిధిని రాష్ట్రప్రభుత్వం విడుదల చేయనుంది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షనర్లకు సంవత్సరానికి రెండుసార్లు డిఎ పెంపు ఉండనుంది. పెన్షనర్ మరణిస్తే.. పెన్షనర్ పొందుతున్న పెన్షన్‌లో 60శాతం నామినేట్ చేయబడిన లబ్ధిదారునికి కుటుంబ పెన్షన్‌గా చెల్లించబడుతుంది.

డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు చిక్కిన బిజెపి ఎమ్మెల్యే కుమారుడు

- హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- డీ అడిక్షన్ సెంటర్‌కు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్ తీసుకుంటూ వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు చదిపిరాళ్ల సుధీర్ రెడ్డి హైదరాబాద్‌లో తెలంగాణ పోలీసులకు చిక్కారు. దీంతో, ఆయనను అరెస్టు చేశారు. హైదరాబాద్ శివారులోని నార్సింగ్ పరిసర ప్రాంతాల్లో యువత డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు ఈగల్ టీంకు సమాచారం అందడంతో గత కొంతకాలంగా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో ఈగల్ టీం, నార్సింగ్ పోలీసులు శనివారం సంయుక్తంగా నార్సింగ్‌లోని సుధీర్ రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న సుధీర్ రెడ్డిని, ఆయన ఇద్దరు స్నేహితులను అదుపులోకి తీసుకొని విచారించారు. డ్రగ్స్ పరీక్ష చేయగా సుధీర్ రెడ్డికి పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో, ఆయనను అరెస్ట్ చేసి ప్రశ్నించగా డ్రగ్స్ సరఫరాకు సంబంధించి కీలక సమాచారం పోలీసులకు లభించినట్లు సమాచారం. అరెస్టు విషయమై తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన పోలీసులు సుధీర్ రెడ్డిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. గతంలో కూడా ఆయన ఇటువంటి కేసులో పోలీసులకు రెండుసార్లు పట్టుబడినట్లు సమాచారం. సుధీర్ రెడ్డి డ్రగ్స్ తీసుకోవడం మాత్రమే చేస్తున్నారా? డ్రగ్స్ సరఫరా కూడా చేస్తున్నారా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉంది. సుధీర్ రెడ్డి హైదరాబాద్, బెంగళూరుల్లో ఉంటూ కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు.



సుధీర్ రెడ్డి (ఫైల్)

సమావేశంలో మాట్లాడుతున్న రాయపాటి శైలజ

అన్ని రంగాల్లో మహిళల కీలక పాత్ర

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుతూ కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆర్ట్స్ కళాశాలలో శనివారం నిర్వహించిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మహిళలు ఒక వైపు కుటుంబ బాధ్యతలు, మరో వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందని, ఇందుకు కుటుంబ సభ్యులు, కార్యాలయాల్లో తోటి ఉద్యోగులు వారికి పూర్తి సహకారం అందించాలని అన్నారు. మహిళలు వారికి రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ద్వారా వచ్చే ప్రయోజనాలను సమగ్రంగా తెలుసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు పాఠాలతో పాటు విద్యార్థినులకు నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో అవగాహన కల్పించాలన్నారు. సమాజంలో లింగ వివక్ష లేకుండా సమాన పని విభజన ఉండాలన్నారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని, విద్యతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి అధికారి కృష్ణవేణి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌కె.రామచంద్ర, ఐసిడిఎస్ పీడీ కె.శ్రీదేవి పాల్గొన్నారు.

టిటిడికి రూ.3 కోట్లు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

టిటిడికి చెందిన పలు ట్రస్టులకు రూ.మూడు కోట్లు విరాళాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిఎంఎస్ ప్రసాద్ ఇచ్చారు. ఈ మేరకు విరాళం డిడిని టిటిడి పరిపాలనా భవనంలోని ఇఒ ఛాంబర్‌లో ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్‌కు శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఇఒ అభినందించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

2 రోజుల్లో 1.21 లక్షల పాస్ పుస్తకాలు పంపిణీ

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రెండు రోజుల్లోనే 1.21 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేసినట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెలలోపు 22 లక్షల పాస్ పుస్తకాలు రైతుల చేతుల్లో ఉంటాయన్నారు. రైతులకు ఏమైనా అనుమానాలుంటే వాటిని గ్రామ సభల్లో అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవచ్చన్నారు. గ్రామ సభల్లో అన్ని రికార్డులు అందుబాటులో ఉంటాయన్నారు. ఎటువంటి తప్పులకూ ఆస్కారం లేకుండా పాస్ పుస్తకాలు ముద్రించినట్లు తెలిపారు. పాస్ పుస్తకాలను అత్యధికంగా కర్నూలు జిల్లాలో 19,730, శ్రీకాకుళంలో 10,839, విజయనగరంలో 10,768, అన్నమయ్య జిల్లాలో 5,937 పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

పెరిగిన ఎన్‌టిఆర్ వైద్య సేవ లబ్ధిదారులు

- సమీక్షలో మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్ వైద్య సేవ లబ్ధిదారుల సంఖ్య, వ్యయం భారీగా పెరిగిందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఎన్‌టిఆర్ వైద్యసేవలు, 108, 104 సేవలు అమలుపై శనివారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. 108 సేవలకు సంబంధించిన టెండర్‌లో ప్రభుత్వం గతానికి భిన్నంగా కఠిన నిబంధనలు విధించడంతో ఈ సేవలు మెరుగుపడ్డాయని మంత్రి వివరించారు. 2022-24 కాలంలో ఆరోగ్యశ్రీ కింద మొత్తం 23,08,930 మంది లబ్ధిపొందారని తెలిపారు. ఈ ప్రకారం 96,205 మందికి ఆరోగ్యశ్రీ సేవలందించారని పేర్కొన్నారు. కూటమి పాలనలో డిసెంబరు వరకు 24,49,117 మంది లబ్ధిదారులకు వైద్య సేవలు అందాయని వివరించారు. ఈ మేరకు సగటున నెలకు 1,16,624 మందికి నగదు రహిత వైద్య సేవలు అందడంతో లబ్ధిదారుల్లో 21 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం కింద నెలకు సగటున రూ.193 కోట్లు ఖర్చు నమోదుకాగా, ఈ ప్రభుత్వంలో నెలవారీ ఖర్చు రూ.310 కోట్లకు చేరి 60 శాతం పెరుగుదల నమోదైందని పేర్కొన్నారు.

పాలనలో తెలుగుకు ప్రాధాన్యత

- తెలుగులోనే జిల్లా కోర్టుల్లో కార్యకలాపాలు
- తెలుగు ఉపాధ్యాయులను గౌరవించాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ

మహాసభలో ప్రసంగిస్తున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అధికారిక వ్యవహారాల్లో తెలుగు భాషకు ప్రాధాన్యతనివ్వాలని, జిల్లా కోర్టుల్లో తీర్పులు, ప్రొసీడింగ్స్ తెలుగులో ఇవ్వడం వల్ల ధర్మం ప్రతి గడపకు అందించినట్లవుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ తెలిపారు. ఆంధ్రసారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన గుంటూరులో శనివారం మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీనరసింహ మాట్లాడుతూ.. కోర్టుల్లో జరిగే వాద ప్రతివాదనలు మాతృభాషలో జరిగితే రెండు వర్గాలకు ఏ అడ్వకేట్ ఏమి వాదనలు వినిపిస్తున్నారో అందరికీ అర్థమవుతుందన్నారు. మాతృభాషపై మమకారం పెరిగేలా, సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టడంలో భాష ఎంతో కీలకమన్నారు. భాష కేవలం భావ వ్యక్తీకరణకు మాత్రమే కాదని, ఒక ప్రపంచాన్ని సృష్టించే అంత బలం ఉందన్నారు. తెలుగు భాష వల్లే మనకు గుర్తింపు లభించిందని, మనమందరం భాషా బంధువులమన్నారు. తెలుగు ఉపాధ్యాయులకు సమాజంలో ఇవ్వాల్సినంత గౌరవం ఇవ్వడం లేదనేది తన భావన అని, తెలుగు బోధించే ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరూ గౌరవిస్తూనే, భాషను కూడా కాపాడు కోవాలన్నారు. రాజ్యాంగం రచించిన అనంతరం చివర్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి ఇంత పెద్ద మంచి రాజ్యాంగం రచించినా, దానిని నడిపించే మనుషులు సరైన వాళ్లు కాకపోతే రాజ్యాంగం వల్ల ఏమీ లాభం లేదన్నారు. మన దగ్గర మంచి ప్రవర్తన కలిగిన మనుషులు ఉంటే ఇంత పెద్ద రాజ్యాంగం అవసరం లేదని అన్నారు. మంచి క్యారెక్టర్ ఉంటే అంతకు మించినది లేదన్నారు.

తెలుగు భాష కోసం అవసరమైతే అసెంబ్లీలో తీర్మానం - స్పీకరు అయ్యన్నపాత్రుడు

తెలుగు భాష కాదని, అది మన జీవన విధానమని శాసనసభ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. విద్యార్థులకు ఇంగ్లీషు అవసరమే కాని మాతృభాషను మరువవద్దన్నారు. తెలుగు భాషను అధికారిక కార్యక్రమాల్లో ఉపయోగించడంతో పాటు తెలుగు భాషాభివృద్ధికి ఏమేం చేయాలో సభలో కార్యాచరణ తీర్మానం చేస్తే వాటిని అసెంబ్లీలో చర్చించి అమలు చేసేందుకు తీర్మానం చేయిస్తానన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి ప్రతిబింబించింది ఎన్‌టిఆర్ అని అన్నారు.

జస్టిస్ బి రఘురామ్ మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో సాంకేతికతలో భాషాభివృద్ధిని పెంచుకోవాలన్నారు. ఇంగ్లీషులో ఇచ్చే తీర్పులు తెలుగులో ఇవ్వడం ద్వారా సామాన్యులకు సైతం అందులో ఏముందో అర్థమవుతుందన్నారు. ఇందు కోసం ఇంగ్లీషు పదాలకు తెలుగులో పర్యాయపదాలు సృష్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ.. పిల్లలు తెలుగులో మాట్లాడలేకపోతే అందుకు ఆ విద్యార్థుల తల్లిదండ్రులు తలదించుకోవాలన్నారు. ప్రపంచంలో మనం ఎక్కడున్నా మాతృభాషను మరువకూడదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏ పెద్ద కంపెనీని తీసుకున్నా అందులోని సిఇఒల్లో అత్యధికంగా భారతీయులే ఉంటారని అందులోనూ తెలుగు వారే ఎక్కువగా ఉంటారన్నారు. సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాబోయే కాలమంతా సృజనాత్మకతపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రపంచంలో ఉన్నత స్థానాలకు ఎదిగిన ప్రతి ఒక్కరిని గమనించినా అందరూ మాతృభాషలో విద్యనభ్యసించినవారేనన్నారు. సభ ప్రారంభానికి ముందు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, స్పీకరు అయ్యన్నపాత్రుడు, గజల్ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేశారు. సభలో అవధానం ఆవశ్యకత గురించి మాశర్మ, కరిమెల్ల ప్రసాద్, సమన్వయకర్త పి రామచంద్రరాజు, విశ్వంజి మహారాజ్ తదితరులు ప్రసంగించారు.

ఎస్‌విఎస్ కెమికల్ ఇండస్ట్రీలో అగ్ని ప్రమాదం

- భయంతో కార్మికుల పరుగులు

ప్రజాశక్తి - యలమంచిలి టౌన్ (అనకాపల్లి జిల్లా)

అచ్యుతాపురం ఎస్ఇజడ్ పరిధి రాంబిల్లి మండలం లాలం కోడూరు వద్ద ఉన్న ఎస్‌విఎస్ ఫార్మా కంపెనీలో శనివారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కార్మికులు పరుగులు తీశారు. స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రాంబిల్లి తహశీల్దారు శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం... ఎపి ఎస్ఇజడ్‌లోని రాంబిల్లి మండలం లాలం కోడూరు వద్ద ఉన్న ఎస్‌విఎస్ కెమికల్ ఇండస్ట్రీస్ వద్ద శనివారం సాయంత్రం 4.25 గంటలకు అగ్ని ప్రమాదం సంభవించింది. కంపెనీ మిథైల్-2 నైనో బైఫినైల్ ఉత్పత్తి ప్రక్రియ పూర్తయిన తరువాత సెంట్రిఫ్యూజ్ వద్ద చివరి దశ ఆపరేషన్ సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఉత్పత్తి ప్రక్రియలో ఇంటర్మీడియట్ ద్రావణంలా ఉపయోగించే టోలున్ ద్రావకం ఉపయోగిస్తుండగా భారీగా మంటలు ఎగసిపడటంతో దీంతో కార్మికులు పరుగులు తీశారు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఎటువంటి ప్రాణనష్టం, గాయాలు సంభవించడం లేదు. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 14 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. అనకాపల్లి ఆర్‌డిఒ షేక్ అయేషా, అడ్డురోడ్డు ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వి.వి.రమణ, పరవాడ డిఎస్‌పి విష్ణు స్వరూప్, ఎపిఐఐసి డిప్యూటీ జెడ్ఎం సూర్యనారాయణ, తహశీల్దారు శ్రీనివాసరావు వచ్చి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం డిఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ భద్రతా సమ్మతి, లైసెన్స్ షరతులను ధ్రువీకరించేందుకు దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. ఈ ప్రమాదంపై అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. ఘటనపై విచారణకు ఆదేశించారు.

దట్టంగా వస్తున్న పొగ

సమగ్ర విచారణ జరిపించాలి : సిఐటియు

ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా కార్యదర్శులు ఆర్ రాము, జి దేముడునాయుడు, నాయకులు కె సోమునాయుడు, చందక రామకృష్ణ, ఎన్ నారాయణరావు, చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. సేఫ్టీ లేబర్ ఫ్యాక్టరీ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేకపోవడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

వెనిజులాపై దాడికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు

- సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెనుజులాపై అమెరికా దురహంకార, దురాక్రమణదారి దాడికి వ్యతిరేకంగా రాష్ట్రంలో ఎక్కడికక్కడ నిరసన ప్రదర్శనలు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. స్థానికంగా కలిసి వచ్చే ఇతర వామపక్ష, ప్రగతిశీల పార్టీలు, శక్తులను, శాంతికాముకులను కూడా కలుపుకొని వివిధ రూపాల్లో ఈ నిరసన వ్యక్తం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలూ ఈ దాడిని ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

మావోయిస్టు నేత దేవా లొంగుబాటు

- డిజిపి ఎదుట మరో 20 మంది మావోయిస్టులు సరెండర్
- మిగిలిన వారందరూ లొంగిపోండి..
- తెలంగాణ డిజిపి శివధర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టు కీలక నేత, పిఎల్‌జిఎ బెటాలియన్ కమాండెంట్ బడ్సే సూఖా ఎలియాస్ దేవా ఎలియాస్ దర్శన్ శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ డిజిపి బత్తుల శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు రాష్ట్ర కమిటీకి చెందిన కె రాజిరెడ్డి, ఆయన భార్య ఈశ్వరితో పాటు మరో 17 మంది పిఎల్‌జిఎ సభ్యులు భారీ ఆయుధాలతో సరెండర్ అయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిజిపి మాట్లాడారు. మావోయిస్టులకు వెన్నెముక అయిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) దాదాపుగా ఖాళీ అయిందని, త్వరలోనే మిగిలినవారిని కూడా కట్టడి చేస్తామన్నారు. మరోవైపు రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు 56 మందిలో ఇప్పుడు కేవలం 17 మంది మాత్రమే మిగిలారని తెలిపారు. 20 మంది మావోయిస్టులు 46 అతిపెద్ద ఆయుధాలతో తమ ఎదుట లొంగిపోవడం గొప్ప విజయమన్నారు. డిజిపి తెలిపిన వివరాల ప్రకారం..

హిడ్మాకు అతి సన్నిహితుడు దేవా

ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు అగ్రనేత హిడ్మాకు దేవా అతి సన్నిహితుడు. ఛత్తీస్‌గఢ్‌లోని హిడ్మా గ్రామానికే చెందిన దేవా... 2002లో మావోయిస్టుల్లో చేరి దండకారణ్యంలో పిఎల్‌జిఎ బెటాలియన్ బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చాడు. ఆయుధ సాంకేతిక పరిజ్ఞానం, కీలక ఆపరేషన్ నిర్వహణలో దేవా సిద్ధహస్తుడు భూపాలపల్లి, ములుగు, వరంగల్ ఏరియా కమిటీ కార్యదర్శిగా రాజిరెడ్డి పని చేస్తున్నారు. ఆయన భార్య ఈశ్వరి ఈ కమిటీ సభ్యులుగా ఉన్నారు. మిగతా 17 మంది పిఎల్‌జిఎలో వివిధ స్థాయిలలో కొనసాగుతున్నారు. దేవాపై రూ.70 లక్షల రివార్డు ఉంది. మిగతా లొంగిపోయిన వారందరు కలిపి వారిపై రూ.1,81,90,000ల నగదు రివార్డు ఉంది. వారి వద్ద నుంచి రెండు ఎల్ఎంజిలు, ఎనిమిది ఎకె 47లు, పది ఎస్ఎల్ఆర్‌లు, 11 ఇన్సాస్‌లు, ఒక అమెరికన్ బోల్ట్ ఆయుధం, మరో ఇజ్రాయిల్ ఆయుధం, హెలికాప్టర్లను కూల్చివేసే ఆయుధం కలిపి మొత్తం 46 ఆయుధాలతో పాటు బుల్లెట్లు, మందుగుండు సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మీడియా సమావేశంలో అదనపు డిజి మహేశ్‌భగవత్, ఎస్ఐబి ఐజి సుమతితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఆమోదంతోనే రెండోవిడత భూ సమీకరణ

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిలా)

మెజార్టీ రైతుల ఆమోదంతోనే రాజధాని నిర్మాణానికి రెండవ విడత భూ సమీకరణకు వెళుతున్నామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి నారాయణ అన్నారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ, న్యాయమూర్తులు, మంత్రుల నివాస భవనాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్చి 31 నాటికి 4026 భవనాలు, ప్లాట్‌లలో 500 మినహా మిగిలిన వాటిని పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. జిల్లా కలెక్టర్ భూ సమీకరణ కోసం కొన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారని, భూమిలిచ్చేందుకు మెజార్టీ రైతులు అంగీకరించారని తెలిపారు. రిటన్నబుల్ ప్లాట్‌లలో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరగాలని చెప్పడంతో ఆ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

సీడ్‌యాక్సస్ రోడ్డు కోసం

రాజధానిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం కోసం 4.5 ఎకరాలను భూ సేకరణ ద్వారా తీసుకుంటామని మంత్రి నారాయణ తెలిపారు. తొలి విడతలో సమీకరణలో రెండు వేల ఎకరాల భూముల్ని రైతులు ఇవ్వలేదని వాటిలో 1300 ఎకరాల భూములు వివిధ వివాదాల్లో ఉన్నాయన్నారు. అవి పోగా మిగిలిన 700 ఎకరాలను పలు దశల్లో భూ సమీకరణ ద్వారా తీసుకుంటామని మంత్రి వివరించారు.

భోగాపురంలో నేడు తొలి విమానం ల్యాండింగ్

- ట్రయల్ రన్ ప్రారంభించనున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఢిల్లీ నుండి నేరుగా భోగాపురానికి విమానంలో రాక

తుది మెరుగులు దిద్దుకుంటున్న ఎయిర్‌పోర్టు భవనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/భోగాపురం

విజయనగరం జిల్లాలో మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరిట రూపుదిద్దుకుంటున్న భోగాపురం గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమవుతోంది. ట్రైల్ రన్‌గా ఈ నెల 4న తొలి వాణిజ్య విమానం దిగనుంది. ఢిల్లీ నుంచి బయలుదేరే ఈ ఎయిర్ ఇండియా విమానం ఉదయం 10.15 గంటలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు ఇతర విమానయాన శాఖ అధికారులతో రానుంది. ఈ ట్రయల్ రన్ విజయవంతం అయిన తర్వాత, ఈ ఏడాది మే నెల నుంచి ఎయిర్‌పోర్ట్ నుంచి రాకపోకలు సాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇతర విమానయాన సంస్థలతో మంత్రిత్వ శాఖ చర్చలు జరపనుంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శరవేగంగా వాస్తవ రూపం దాల్చుతోంది. జిఎంఆర్ గ్రూప్ ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తోంది. దీనికి పౌర పనుల కాంట్రాక్టును ఎల్‌అండ్‌టి సంస్థ చేపట్టింది. వీరు 40 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చేపడతారు. సుమారు 3.8 కిలోమీటర్ల పొడవైన రన్‌వేను ఇక్కడ నిర్మిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద విమానాలైన ఎయిర్ బస్ ఎ 380, బోయింగ్ 47-8 వంటి భారీ విమానాలు వైడ్-బాడీ విమానాలు కూడా ఇక్కడ సులభంగా ల్యాండ్ అయ్యేలా నిర్మాణం చేయడం ఈ ఎయిర్‌పోర్టు ప్రత్యేకతగా ఉంటుందని జిఎంఆర్ గ్రూపు ప్రతినిధి ప్రభాకర్‌రావు, ఎయిర్‌పోర్టు సిఇఒ రణబీర్‌సింగ్ తెలిపారు. 3.8 కిలోమీటర్ల రన్‌వే, 300 విమానాలు దిగడానికి సదుపాయాలున్నాయని చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సుమారు 2,203.26 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఎయిర్‌పోర్టు టేకెన్ ఓవర్ ల్యాండింగ్ రెండు వైపులా వినియోగించుకోవచ్చని, ఇంటర్నేషనల్ బిడ్ ద్వారా అత్యంత అధునాతంగా విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.

రేపు అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వచ్ఛ సంక్రాంతి - స్వచ్ఛ గ్రామ పంచాయతీలు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5న రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. పంచాయతీల్లో శాస్త్రీయ విధానంలో ఘన వ్యర్థాల నిర్వహణను అమలు చేసి, గ్రామాలను వ్యర్థాల రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని స్పష్టం చేసింది. 5న నిర్వహించే గ్రామ సభల్లో వ్యర్థాల రహిత గ్రామ పంచాయతీ అంశాన్ని ప్రధాన ఎజెండాగా తీసుకోవాలని పేర్కొంది.

హెచ్‌ఎంలకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించుకోవాలి

- వైఎస్‌ఆర్ టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతిలో 100 రోజుల ప్రణాళిక మార్కులు నమోదు చేయలేదని ప్రధానోపాధ్యాయులకు ఇచ్చిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వైఎస్‌ఆర్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జాలిరెడ్డి, షేక్ జమీంద్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లాలో 46 మంది ప్రధానోపాధ్యాయులకు నోటీసులిచ్చారని తెలిపారు. ఈ నోటీసులు ద్వారా ఉపాధ్యాయులను ప్రభుత్వం మానసికంగా ఒత్తిడికి గురిచేస్తోందని పేర్కొన్నారు. 100 రోజుల ప్రణాళికలను సక్రమంగానే నిర్వహిస్తున్నప్పటికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల నమోదు కావడం లేదని తెలిపారు. ఇంటర్నెట్ సౌకర్యం లేక ఆన్‌లైన్ సమస్యల వల్ల నమోదు కాకపోవడాన్ని ప్రధానోపాధ్యాయుల తప్పుగా చూపించి నోటీసులు ఇచ్చి సంజాయిషీ కోరడం బాధాకరమని పేర్కొన్నారు.

సావిత్రిబాయి ఫూలే స్ఫూర్తితో పాలన

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిభాయి ఫూలే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. విజయవాడలోని బిసి భవన్‌లో సావిత్రిభాయి ఫూలే జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సావిత్రిభాయి గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక విప్లవకారిణి అని కొనియాడారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా స్త్రీ విద్య కోసం కృషి చేశారన్నారు. అంతకుముందు ఎపి బిసి ఉద్యోగుల ఫెడరేషన్ కేలండర్‌ను మంత్రి సవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, అదనపు డైరెక్టర్ చంద్రశేఖర్, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు వీరంకి గురుమూర్తి, నందం అబద్ధయ్య, పి ఈశ్వర్, శ్రీధర్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో..

మహిళాభ్యుదయం, సాధికారత సాధనలో సావిత్రిభాయి ఫూలే సేవలు చిరస్మరణీయమని పలువురు వైసిపి నాయకులు పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో సావిత్రిభాయి ఫూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, నాయకులు కనకారావు తదితరులు పాల్గొన్నారు.



కోడుమూరులో ఉల్లి రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న మంత్రి అచ్చెనాయుడు

ఉల్లి రైతుకు పరిహారం

- 37,752 మందికి రూ.128.33 కోట్లు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ /కోడుమూరు

రాష్ట్ర ప్రభుత్వం సంక్షోభంలో ఉన్నప్పటికీ ఉల్లి రైతులకు పరిహారం అందిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50,000 చొప్పున వారి ఖాతాల్లో శనివారం ఆయన జమచేశారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కోడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి మంత్రి అచ్చెన్నాయుడు బటన్ నొక్కి ఉల్లి రైతులకు పరిహారం విడుదల చేశారు. అక్కడే నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల కర్నూలు, కడప జిల్లాల్లో ఉల్లి రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. హెక్టారుకు రూ.50 వేల పరిహారంగా 128.33 కోట్ల రూపాయలను 37,752 మంది రైతుల ఖాతాల్లో జమ చేశామని, ఇచ్చిన మాటను నిలుపుకున్నామని తెలిపారు. మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే సంస్థలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసిపి విషప్రచారం చేస్తోందని విమర్శించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ రైతులు ఒకే పంట సాగు చేయకుండా అంతర్ పంటల సాగుకు సన్నద్ధం కావాలని సూచించారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, టిడిపి కర్నూలు, నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, గౌరు చరితారెడ్డి, ఎమ్మెల్యేలు జయనాగేశ్వర్ రెడ్డి, శ్యాంబాబు. కెడిసిసిబి చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరాట పటిమ, తెగింపు తెలంగాణే నేర్పింది

- కొండగట్టు అలయాన్ని సందర్శించిన పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెగువ, తెగింపు, పోరాట పటిమను తనకు తెలంగాణే నేర్పిందని, తన పోరాటం వ్యక్తులపై కాదని.. పాలసీలపైనే ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు అంజన్నను టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుతో కలిసి శనివారం ఆయన దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) నిధులతో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఓటమికి భయపడకుండా ప్రజల కోసం నిలబడే తత్వం తెలంగాణ ప్రజల స్ఫూర్తి నుంచే తనకు వచ్చిందన్నారు. రాజకీయాల్లో తనకు వ్యక్తిగతంగా ఎవరూ శత్రువులు లేరని స్పష్టం చేశారు.

అభివృద్ధిలో రెండు రాష్ట్రాల సహకారం

కొండగట్టు ఆలయ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను పవన్ కల్యాణ్ అభినందించారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు గిరిప్రదక్షిణ మార్గం సుగమం చేసేందుకు అవసరమైతే తాను స్వయంగా పాల్గొంటానని ప్రకటించారు. ఈ ఆలయానికి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం టిటిడి కేటాయించిన రూ.35.19 కోట్లతో పలు అభివృద్ధి పనులకు పవన్ కల్యాణ్ భూమిపూజ చేశారు. ఈ పర్యటనలో తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జిల్లాలో విద్యుత్ వాహనాల తయారీ

- ఎపిఐఐసి ద్వారా 70 ఎకరాల భూమి కేటాయింపు
- విశాఖ మిలీనియం టవర్స్‌లో టిసిఎస్‌కు చోటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సత్యసాయి జిల్లాలో విద్యుత్ వాహనాల పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. గుడిపల్లి గ్రామంలో ఈ కర్మాగారాన్ని ఏర్పాటుచేసేందుకు అజాద్ ఇండియా మొబిలిటీ లిమిటెడ్ సంస్థ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేయడంతో సంబంధిత కార్యాచరణ కూడా వేగవంతమైంది. ఈ సంస్థకు మూడు దశల్లో 70.71 ఎకరాల భూమిని అందించేందుకు పరిశ్రమలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంస్థ త్రిచక్ర వాహనాలతోపాటు విద్యుత్ ట్రక్కులు, విద్యుత్ బస్సులను కూడా తాయారు చేయనుంది. ఈ పరిశ్రమ మూడు దశల్లో రూ.1,046.20 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా మొత్తం 2,381 మందికి ఉపాధి లభించనుంది. ఈ సంస్థ ప్రతిపాదనలను 2024 డిసెంబర్‌లో జరిగిన పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో చర్చించి ప్రాథమిక అనుమతిని మంజూరు చేశారు. అలాగే విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్‌లోని ఎ, బి టవర్లలో డెలివరీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకుగాను టాటా కన్సల్టెన్సీ సర్వీసుకు అనుమతి ఇస్తూ ఇంకో ఉత్తర్వును జారీ చేశారు. వాస్తవానికి ఈ ప్రదేశాన్ని గతంలో డల్లాస్ టెక్నాలజీ కేంద్రానికి కేటాయించగా, సబ్ లీజ్ విధానంలో టిసిఎస్‌కు కేటాయించేందుకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు.

కార్పొరేట్లకు తాయిలాలు తగవు: సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్పొరేట్ సంస్థలకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇస్తున్న రూ.లక్షల కోట్లు తాయిలాలు ప్రజల పాలిట యమపాశాలుగా మారుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య తెలిపారు. ప్రైవేటు టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా సంస్థ.. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి రూ.87,695 కోట్లకు మారటోరియం కల్పిస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడాన్ని శనివారం ఒక ప్రకటనలో తప్పుబట్టారు. ఈ మొత్తాన్ని 2032 నుంచి 2041 మధ్య చెల్లించే వెసులుబాటు కల్పిస్తూ, వడ్డీని కూడా రద్దు చేసిందని పేర్కొన్నారు. 2014 నుంచి మోడీ ప్రభుత్వం రూ.25 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేసిందని సాక్షాత్తూ రిజర్వు బ్యాంకు ఇచ్చిన సమాచారంలో వెల్లడైందన్నారు.

పోలవరం ఖర్చు రూ.26,178 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కీలకమైన పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకూ రూ.26,178 కోట్లు ఖర్చు చేశారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టు అథారిటీకి సమర్పించిన నివేదికలో ఈ విషయాలను పొందుపరిచారు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు కేంద్ర కమిటీ వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఖర్చు చేసిన వివరాలను కేంద్రానికి సమర్పించారు. పోలవరం ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకూ రూ.26,178 కోట్లు ఖర్చు పెట్టారు. ఇందులో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించకముందే రూ.4,730.71 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది. ప్రకటించిన తరువాత రూ.21,448.01 కోట్లు ఖర్చు పెట్టారు. దీనిలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ నుండి రాష్ట్ర ప్రభుత్వానికి 2025 డిసెంబరు 30వ తేదీ వరకూ రూ.15,605.96 కోట్లు రీయింబర్స్ చేశారు. ఇందులో కేంద్రం రూ.5,052.71 కోట్లను అడ్వాన్స్ రూపంలో రాష్ట్రానికి ఇచ్చింది. దీనిలో నుండి ట్రెజరీ ద్వారా రూ.4,324.24 కోట్లను సర్దుబాట్లు చేయగా, ఇంకా రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ.728.47 కోట్లు మాత్రమే ఉంది.

జూన్ నాటికి కుడి ట్విన్ టన్నెల్స్ పూర్తి

పోలవరం ప్రాజెక్టులో కీలకమైన కుడికాలువ ట్విన్ టన్నెల్స్ పనిలో 26.31 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించాల్సి ఉండగా, 2025 డిసెంబర్ నాటికి 25.74 క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించారు. మట్టి తరలింపు ప్రక్రియను 2026 మార్చి నాటికి పూర్తి చేసి లైనింగ్ పనులను 2026 జూన్ నాటికి పూర్తిచేస్తామని పిపిఎకు ఇచ్చిన నివేదికలో పోలవరం ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. అలాగే ఎడమ కాలువకు సంబంధించిన పనులు కూడా జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఎర్త్‌కం రాక్ ఫిల్ డ్యామ్ (ఇసిఆర్ఎఫ్) నిర్మాణంలో భాగంగా డయాఫ్రం వాల్ పనులను 2026 ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. వైబ్రో కంప్రెషన్ పనులను 2026 ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేయనున్నట్లు నివేదికలో తెలిపారు. అలాగే ఇసిఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-2 మట్టి పనులను 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయనున్నట్లు వివరించారు.

ఎఫ్‌డిఐ పెంపు బీమా రంగంపై గొడ్డలి పెట్టు

- ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెకు మద్దతు
- ఎఐఐఇఎ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్ మిశ్రా

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

బీమా రంగంలో ఎఫ్‌డిఐని వంద శాతం పెంచడం పూర్తిగా ప్రజావ్యతిరేక చర్య అని, ఇది దేశీయ పొదుపు డబ్బును విదేశాలకు తరలించడానికి దారితీస్తుందని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా అన్నారు. భువనేశ్వర్‌లో ఇటీవల ఐదు రోజులపాటు జరిగిన ఎఐఐఇఎ ప్లాటినం జూబ్లీ జనరల్ కౌన్సిల్ నిర్ణయాలను తెలియజేయడం కోసం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ ఉద్యోగుల సమావేశం డివిజన్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఇందులో ముఖ్య వక్తగా పాల్గొన్న శ్రీకాంత్ మిశ్రా మాట్లాడుతూ ప్రభుత్వరంగ బీమా పరిశ్రమ, భారతదేశంలోని శ్రామిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను భువనేశ్వర్ సమావేశం సమీక్షించినట్లు చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరిచే లక్ష్యంతో ఉన్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై జనరల్ కౌన్సిల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. ప్రభుత్వ రంగ బీమా పరిశ్రమ రక్షణ, బలోపేతం కోసం దేశవ్యాప్తంగా ప్రచారాలను ముమ్మరం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కార్మిక వ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు తమ పూర్తి మద్దతు తెలిపామన్నారు.

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, పిఎస్‌జిఐ ఉద్యోగులు ఈ నెల 9న చేపట్టనున్న ప్రతిపాదిత సమ్మెకు బలమైన సంఘీభావం తెలియజేస్తున్నట్లు చెప్పారు. భువనేశ్వర్ కాన్ఫరెన్స్‌లో అధ్యక్షునిగా ధర్మరాజ్ మహాపాత్ర, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ మిశ్రా, కోశాధికారిగా బిఎస్ రవి ఎన్నికైనట్లు చెప్పారు.

ఐసిఇయు అధ్యక్షులు ఎం కామేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి వరప్రసాద్, మహిళా కన్వీనర్ జి సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిపై యుద్ధం

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

'అభ్యుదయం' సైకిల్ యాత్రలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోంమంత్రి అనిత

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, ఇచ్ఛాపురం

దేశంలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా దాని మూలాలు ఎపిలో ఉండేవని, ఆ పరిస్థితి మార్చడానికి డ్రగ్స్ మహమ్మారిపై యుద్ధం చేస్తున్నామని కేంద్రపౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు పోలీసుశాఖ చేపట్టిన అభ్యుదయం యాత్ర ముగింపు సందర్భంగా సురంగి రాజా మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎపి డ్రగ్స్‌కి క్యాపిటల్ ఉండేదని విమర్శించారు. జగన్ హయాంలో గిరిజనులను బలిపశువులను చేశారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను హోంమంత్రి వంగలపూడి వనిత ఆవిష్కరించి మాట్లాడుతూ గంజాయి మత్తులో విద్యార్థులు తమ కన్న తల్లిదండ్రులపైనే దాడులు చేయడం కలచి వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు అలవాటు పడి యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక పాలనలో యువత మత్తుకు బానిసలయ్యారని విమర్శించారు. ఐజి గోపీనాథ్‌జెట్టి మాట్లాడుతూ యాత్ర ద్వారా డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో మంచి అవగాహన కల్పించగలిగామని వివరించారు. కార్యక్రమంలో ఈగల్ ఐజి ఎ రవికృష్ణ, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కెవి మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, ఎన్ ఈశ్వరరావు, పోలీస్‌శాఖకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

'అనంత'లో గంజాయి విక్రేతలు అరెస్టు

- నిందితులను నడిరోడ్డుపై నడిపించుకుంటూ కోర్టుకు తీసుకెళ్లిన పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా కేంద్రంలో గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితులను నగరంలోని ప్రధాన వీధుల్లో నడిపించుకుని కోర్టు వరకు తీసుకెళ్లారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. అనంతపురం నగరంలోని గంజాయి నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆర్‌డిటి స్టేడియం వెనుక గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అక్కడ గంజాయి విక్రయిస్తున్న ఇమ్రాన్, షికారి జంపా, సాయిరాం, శివ, ఇమ్రాన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1.200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నలుగురిని ప్రభుత్వాస్పత్రి నుంచి కోర్టు వరకు పోలీసులు నడిపించుకుని తీసుకుని వెళ్లారు. నగరం, పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి అమ్మినా, సేవించినా కఠినంగా వ్యవహరిస్తామంటూ సిఐ హెచ్చరించారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాట్లాడుతున్న జివిఎంసి కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

పురుషాధిక్య సమాజాన్ని ఎదిరించిన సావిత్రిబాయి పూలే

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్

పురుషాధిత్య సమాజాన్ని ఎదిరించి మొట్టమొదటి మహిళా టీచర్‌గా ఖ్యాతి గడించిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. సావిత్రి బాయ్ పూలే 194వ జయంతి వేడుకలు ఎపి డప్పు కళాకారుల సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో శనివారం విశాఖ నగరంలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో నిర్వహించారు. కెవిపిఎస్ విశాఖ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుబ్బారావు మాట్లాడుతూ మహిళకు విద్య అవసరంలేదనే కాలంలో మహిళా చదువు ఆమె అభ్యున్నతికి తోడ్పడుతుందని సావిత్రిబాయి పూలే భావించారని తెలిపారు. జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు మాట్లాడుతూ ప్రత్యేకించి దళిత గిరిజన బలహీన వర్గాల మహిళలకు చదువు నేర్పించి చదువుల తల్లిగా అందరి మనసులలో సావిత్రిబాయి పూలే కలకాలం నిలిచిపోతారని కొనియాడారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ తన కర్తవ్య నిర్వహణలో, ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ భర్త జ్యోతిరావు పూలే సహకారంతో మహిళ అభ్యుదయానికి సావిత్రిబాయి కృషి చేశారని, ఆమె వీర వనిత అని శ్లాఘించారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ నల్లప్ప, ఎపి డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ సావిత్రిబాయి ఆశయ సాధనకు కృషి చేయడమే మనం ఆమెకిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు.

జిల్లా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలి

- అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చడంపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమంటూ అడ్వకేట్ బి వెంకట నారాయణరెడ్డి పిల్ వేశారు. ఇందులో ప్రతివాదులుగా రెవెన్యూ, సాధారణ పరిపాలన శాఖల ముఖ్యకార్యదర్శులు, భూ పరిపాలన ప్రధాన కమిషనరు, అన్నమయ్య జిల్లా కలెక్టరును చేర్చారు. 'జిల్లా కేంద్రాన్ని మార్చాలంటే తొలుత ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయాలి. ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలను తీసుకోవాలి. ఆ తర్వాత చట్ట నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకోవాలి. ఇలా చేయకపోవడం ఎపి జిల్లాల ఏర్పాటు చట్టం-1974లోని సెక్షన్ 3(5)కి నిబంధనకు వ్యతిరేకం. ఈ చట్ట నిబంధన ప్రకారం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయాలి. ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలి. జిల్లా కేంద్రం మార్పు చేస్తూ గత డిసెంబరు 30న రెవెన్యూ శాఖ జారీ చేసిన జిఓ, తుది గెజిట్ నోటిఫికేషన్లను రద్దు చేయాలి. 2022లో నోటిఫైకి అనుగుణంగా అన్నమయ్య జిల్లా పరిపాలన కేంద్రంగా రాయచోటిని కొనసాగించాలి. తుది తీర్పు వెలువరించేలోగా జిల్లా కేంద్ర మార్పునకు సంబంధించిన జిఓ, గెజిట్ నోటిఫికేన్‌లను నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలి. అన్నమయ్య జిల్లా పరిపాలన కేంద్రం రాయచోటిగా ఉన్న పూర్వ పరిస్థితిని కొనసాగించాలి. కార్యాలయాలు, రికార్డులను మదనపల్లెకు మార్చకుండా ఉత్తర్వులివ్వాలి' అని పిల్‌లో హైకోర్టును కోరారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : విజయవాడ
డోర్ నెం. 54-15-18/6, యలమంచిలి కాంప్లెక్స్ (స్పెన్సర్స్) ఎదురుగా, విజయవాడ-520008. ఫోన్: 0866-2468600

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1. **శ్రీమతి పడిడపు వెంకట లక్ష్మి, భర్త : ఎమ్. కిషోర్ బాబు,** ఫ్లాట్ నెం.310, ఫేజ్ 2, ప్రజయ్ నివాస్, మోహన్ నగర్, నాగోల్, సరూర్ నగర్, హైదరాబాద్-500035. **మరొక చిరునామా :** ఫ్లాట్ నెం.103, లక్ష్మి రెసిడెన్సీ, పెనమలూరు మండలం, కానూరు-520007.
2. **శ్రీ మాసిముక్కు కిషోర్ బాబు, తండ్రి : ఎమ్ ఎమ్ ఎమ్ రాజారావు,** 8-7-33-15, పి నెం.15, హస్తినాపురం సెంట్రల్, హయతానగర్, హైదరాబాద్-500070. **మరొక చిరునామా :** ఫ్లాట్ నెం. 103, లక్ష్మి రెసిడెన్సీ, పెనమలూరు మండలం, కానూరు-520007.

డియర్ సర్ / మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, విజయవాడ బకింగ్‌హమ్‌పేట బ్రాంచ్ నుండి **శ్రీమతి పడిడపు వెంకట లక్ష్మి మరియు శ్రీ మాసిముక్కు కిషోర్ బాబు గార్లు** పొందిన లోన్ వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేది నాటికి వడ్డీతో కలిపి బకాయి మొత్తం	వడ్డీ రేటు
హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 160000002580	రూ.20,00,000/- తేది. 01.01.2021	రూ. 17,56,870.17/-	10.45%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి/వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది.24.12.2025 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ)గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.17,56,870.17/- (అక్షరాల పదిహేడు లక్షల యాభై ఆరు వేల ఎనిమిది వందల డెబ్బై రూపాయల పదిహేడు పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

కృష్ణా జిల్లా, పటమట ఎస్ఆర్ఓ యొక్క పరిధి, పెనమలూరు మండలం, కానూరు గ్రామ పంచాయితీ, కానూరు గ్రామం వద్ద సమీప డోర్ నెం.18-129, ఆర్ ఎస్ నెం.2-8 నందు విస్తీర్ణం 344.66 చ॥గ॥లుకు సమానమైన 288.17 చ॥మీ॥లులోని అవిభాజ్యమైన వాటా 35 చ॥గ॥లుకు సమానమైన 29.26 చ॥మీ॥లు స్థలంతో పాటు లక్ష్మీ రెసిడెన్సీ మొదటి అంతస్తు నందు ప్లాట్ నెం.103 (960 చ॥అ॥ల ప్లింత్ ఏరియా & 70 చ॥అ॥ల పార్కింగ్ ఏరియా) **హద్దులు : 1వ ఐటమ్ : తూర్పు :** 33'0 వెడల్పు రోడ్డు - 34'9'', **దక్షిణం :** వి.వి.ఎస్. మల్లికార్జున రావు గారికి చెందిన ఆస్తి - 88'0'', **పడమర :** బొప్పన వెంకటేశ్వర రావు & ఇతరులకు చెందినన ఆస్తి - 35'9'', **ఉత్తరం :** వేల్పుల రత్తయ్య గారికి చెందిన ఆస్తి - 88'0''. **2వ ఐటమ్ : తూర్పు :** మెట్లు & కామన్ కారిడార్, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

టైటిల్ హోల్డర్ : శ్రీమతి పడిడపు వెంకట లక్ష్మి

తేది: 26.12.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

టిటిడి పాలనా వైఫల్యమే..

- గోవిందరాజస్వామి ఆలయ ఘటనపై విష్ణు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గోవిందరాజస్వామి ఆలయ ఘటన టిటిడి పాలనా వైఫల్యమేనని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైకుంఠ ఏకాదశి రోజున యాత్రికులకు దర్శనాలు ఆపడం దుర్మార్గమన్నారు. తిరుమలకు యాత్రికులను రావద్దనడం చరిత్రలో ఇదే ప్రథమమని పేర్కొన్నారు. లక్షలాది మంది వస్తారని తెలిసినా ఏర్పాట్లలో టిటిడి వైఫల్యం చెందిందని, గోవిందమాల స్వాములను అడ్డుకోవడం తీవ్ర అవమానమని పేర్కొన్నారు. విఐపిల సేవలో మునిగిన టిటిడి.. సామాన్యులను అవమాపరిచిందని విమర్శించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండూ ముఖ్యమే..

- మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వానికి, అభివృద్ధి, సంక్షేమం రెండూ ముఖ్యమేనని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. సంక్షేమాన్ని అమలు చేస్తూనే గత పాలకులు చేసిన అప్పులను తీర్చుకుంటూ అభివృద్ధి మార్గంలో రాష్ట్రం ముందుకు సాగుతోందని చెప్పారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తుందనే నమ్మకంతోనే పెట్టుబడులు రాష్ట్రం వైపు తరలివస్తున్నాయని పేర్కొన్నారు. కేవలం 18 నెలల్లోనే రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించడం ప్రభుత్వ కృషి, పట్టుదలకు నిదర్శనమని అభిప్రాయం వ్యక్తం చేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా సిఎంఐఇ నివేదికలో పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం దేశంలోనే తొలి స్థానంలో నిలవడం గర్వకారణమని చెప్పారు. రాబోయే దావోస్ పర్యటనలో కూడా మరిన్ని పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

సిఎం విదేశీ పర్యటనపై దుష్ప్రచారం : పిల్లి మాణిక్యరావు

సిఎం చంద్రబాబు విదేశీ పర్యటనపై వైసిపి దుష్ప్రచారం చేస్తోందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని లీడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణ్యికరావు పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయని వైసిపి నాయకులు అబద్ధాలు, వ్యక్తిగత ధూషణలు, కుటుంబాలపై నీచ వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ దిగజారుడు చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు విదేశాల్లో ఉన్నప్పటికీ రాష్ట్రంపై నిరంతర సమీక్ష చేస్తున్నారని తెలిపారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY
ANANTAPURAMU- 515002 (A.P.) INDIA

XV CONVOCATION NOTIFICATION

The XV Convocation of Jawaharlal Nehru Technological University Anantapur, Ananthapuramu is tentatively scheduled in the month of February/March, 2026. All UG, PG and Ph.D. Candidates who are qualified for the award of degree during the Academic year 2024-25 are hereby informed to submit the applications through Online only (https://jntuaebranchpayment.in/originaldegree)on or before 15.02.2026. Only Ph.D. Awardees and Gold Medalists will receive the degrees on the dais and others will receive their degrees through registered Post/Courier. Further details can be seen in the web site: www.jntua.ac.in under Examinations section.

Date: 04.01.2026 Sd/- REGISTRAR

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate

ప్రాంతీయ కార్యాలయం : విజయవాడ
డోర్ నెం. 54-15-18/6, యలమంచిలి కాంప్లెక్స్ (స్పెన్సర్స్) ఎదురుగా, విజయవాడ-520008. ఫోన్: 0866-2468600

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1. **శ్రీమతి లెల్లా కళ్యాణి, భర్త : కుమార్ బాబు,** డి నెం.4-100, మెయిన్ రోడ్, సీతనపల్లి, కృతివెన్ను, బంటుమిల్లి, కృష్ణా జిల్లా-521324. **మరొక చిరునామా :** పవన్ సాయి హోమ్స్, నాల్గవ అంతస్తు, ఫ్లాట్ నెం.ఎఫ్.టి.ఎఫ్-2, ప్రసాదంపాడు, విజయవాడ-521108.
2. **శ్రీ లెల్లా కుమార్ బాబు, C/o లెల్లా బాలసౌరి,** డి నెం.4-100, మెయిన్ రోడ్, సీతనపల్లి, కృతివెన్ను, బంటుమిల్లి, కృష్ణా జిల్లా-521324. **మరొక చిరునామా :** పవన్ సాయి హోమ్స్, నాల్గవ అంతస్తు, ఫ్లాట్ నెం.ఎఫ్.టి.ఎఫ్-2, ప్రసాదంపాడు, విజయవాడ-521108.

డియర్ సర్ / మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, విజయవాడ నిడమానూరు బ్రాంచ్ నుండి **శ్రీమతి లెల్లా కళ్యాణి మరియు శ్రీ లెల్లా కుమార్ బాబు గార్లు** పొందిన లోన్ వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేది నాటికి వడ్డీతో కలిపి బకాయి మొత్తం	వడ్డీ రేటు
హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 160001318782	రూ.35,00,000/- తేది. 23.12.2022	రూ. 38,72,894.20/-	10.00%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి/వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది.26.12.2025 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ)గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.38,72,894.20/- (అక్షరాల ముప్పై ఎనిమిది లక్షల డెబ్బై రెండు వేల ఎనిమిది వందల తొంభై నాలుగు రూపాయల ఇరవై పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

ఎ-షెడ్యూల్ : ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, గుణదల సబ్ రిజిష్ట్రీ యొక్క అధికార పరిధి, విజయవాడ రూరల్ మండలం, ప్రసాదంపాడు గ్రామం, ప్రసాదంపాడు, ఆర్ ఎస్ నెం.84/1, 84/3, సమీప డోర్ నెం.11-4B. **హద్దులు : తూర్పు :** నాగసాయి హోమ్స్ యొక్క ఆస్తి, **దక్షిణం :** పవన్‌సాయి హోమ్స్ యొక్క ఆస్తి, **పడమర :** రోడ్డు, **ఉత్తరం :** అన్నె టవర్స్ యొక్క ఆస్తి.

ఈ నాలుగు హద్దుల యందు విస్తీర్ణం 895.4 చ॥గ॥లు లేదా 748.64 చ॥మీ॥లులోని అవిభాజ్యమైన వాటా 50.0 చ॥గ॥లు లేదా 41.80 చ॥మీ॥లు.

బి-షెడ్యూల్ : పైన చెప్పబడిన ఎ-షెడ్యూల్ నందు మొత్తం విస్తీర్ణంలోని నిర్మించబడిన పవన్ సాయి హోమ్స్, నాల్గవ అంతస్తు నందు ఫ్లాట్ నెం.F.T.F-2 కలదు. **హద్దులు : తూర్పు :** లిఫ్ట్ మరియు ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** మెట్లు మరియు కామన్ కారిడార్, **ఉత్తరం :** కామన్ కారిడార్.

పై నాలుగు హద్దుల యందు పవన్ సాయి హోమ్స్, నాల్గవ అంతస్తు, ఫ్లాట్ నెం.F.T.F-2 విస్తీర్ణం బాల్కనీ ఏరియా 880.0 చ॥అ॥ల ప్లింత్ ఏరియా, 220.0 చ॥అ॥ల కామన్ ఏరియా, 100.0 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా మరియు నీరు, డ్రైనేజ్, మెట్లు మరియు లిఫ్ట్ నందు ఇతర యజమానులతో ఉమ్మడి హక్కులు మరియు అన్ని సాధారణ సదుపాయాలు మరియు అన్ని ఈజిమెంట్ హక్కులతో కలదు.

టైటిల్ హోల్డర్ : శ్రీమతి లెల్లా కళ్యాణి

తేది: 29.12.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

CHANGE OF NAME

GANGADHARA VARA PRASADA RAO TATINENI (OLD NAME) S/o Venkata Veeraraghavarao Chowdary Tatineni R/o D. No. 61-9-3/2 , Kalanagar,1st Road, Krishna lanka, Vijayawada, Andhra Pradesh - 520013. My name has been changed to **GANGADHARA VARA PRASAD TATINENI** (NEW NAME). Hereafter my name is known as **GANGADHARA VARA PRASAD TATINENI.**

IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM- CHIEF JUDGE CITY SMALL CAUSES COURT CITY CIVIL COURT AT: HYDERABAD
O.P. No. 605 OF 2025

Between:-
Samineni Purnima and Others.
...Petitioners
AND
Thuraka Venkateswaramma and Others.
...Respondents

To,
1.Thuraka Venkareswaramma ,W/o. Pullaiah,Occ:Business,/Owner Of Car Bearing No.AP 16 DG 2178 ,R/o. D.No.4-135/5,Near K S Takes , Bapula padu Post and Mandal ,Krishna Distrist
...R1

NOTICE

Please take notice that the above O P is filed against you and others for grant of compensation and the above case is posted for your appearance on 5-1-2026 at 10:30 a.m. in person or by an Advocate, failing which the case will be decided on merits in your absence.

// BY ORDER OF THE COURT //

P.CHANDRAMOULI
P.PANDU RANGA SWAMY,
Advocates
Bangaru Enclave, Kharman Ghatt, Hyderabad.

బిసి జనాభా మేరకు స్థానిక రిజర్వేషన్లు ఉండాలి

- హైకోర్టులో పిల్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో జనాభా ప్రాతిపదిక ఆధారంగా బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేలా ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. బిసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలంటూ ఆలిండియా బిసి ఫెడరేషన్ రాష్ట్ర విభాగం గౌరవాధ్యక్షులు ఆల వెంకటేశ్వర్లు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు సోమవారం విచారణ చేయనుంది.

ఆటో డ్రైవర్ నిజాయితీ..

- బాధితురాలికి రూ.4 లక్షల బంగారు నగల బ్యాగు అప్పగింత

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలో ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నారు. ఆటోలో ఓ ప్రయాణికురాలు మరిచిపోయి వెళ్లిన రూ.నాలుగు లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను తిరిగి అప్పగించి తన నిజాయితీని నిరూపించుకున్నారు.

కడప నగరంలోని ప్రకాష్ నగర్‌కు చెందిన కొమ్మునూరి మానస అనే మహిళ బద్వేలుకు వెళ్లి ఈ నెల 2న తిరిగి కడపకు వచ్చారు. కడప బస్టాండ్ వద్ద నుంచి తన పిల్లలతోపాటు ఆటోలో ఇంటికి చేరుకున్నారు. లగేజ్ బ్యాగులు తీసుకుని తన హ్యాండ్ బ్యాగ్‌ను మరిచిపోయారు. ఆమె చిన్నచౌక్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వెంటనే చిన్నచౌక్ పోలీసు స్పందించి సిసి కెమెరాలు చెక్ చేసి ఆటోను గుర్తించారు. వైవి స్ట్రీట్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఖాజామోహిద్దీన్‌ను స్టేషన్‌కు పిలిపించారు. ఆటోలో వెనుక వైపు అలాగే ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో 50 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి ఆభరణాలున్నాయి. వాటి విలువ సుమారు రూ. నాలుగు లక్షలు ఉంటుంది. చిన్నచౌక్ పోలీసుస్టేషన్ సిఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి, రవికుమార్ బాధితురాలికి అప్పగించారు. ఆటోడ్రైవర్ ఖాజా మొయిద్దీన్‌ను ప్రశంసించి, అతని నిజాయితీ గుర్తించి రూ.500 నగదు బహుమతి అందజేశారు.

ఇ-వేలం అమ్మకపు ప్రకటన

IBC, 2016 మరియు ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా (కార్పొరేట్ రుణగ్రహీతకు వ్యక్తిగత హామీదారుల కోసం దివాలా ప్రక్రియ) రెగ్యులేషన్స్, 2019 యొక్క రెగ్యులేషన్ 27 లోని షెడ్యూల్-2 యొక్క పార్ట్-ఎ క్రింద

శ్రీ తాడిశెట్టి నరసింహా రావు, శ్రీమతి తాడిశెట్టి వెంకట రమణ, శ్రీమతి తాడిశెట్టి అమల, శ్రీ జంజనం విద్యానాథ్ మరియు శ్రీ తాడిశెట్టి సుబ్బా రావు
M/s. ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ యొక్క (5 వ్యక్తిగత హామీదారుల కోసం దివాలా ప్రక్రియ)
బ్యాంక్రప్టసీ ట్రస్టీ శ్రీ కూరపాటి శింగరయ్య చౌదరి జారీ చేసిన వేలం నోటీసు
బ్యాంక్రప్టసీ ట్రస్టీ చిరునామా: ఫ్లాట్ నెం. 104, కావూరి సుప్రీమ్ ఎన్‌క్లేవ్, కావూరి హిల్స్, మాదాపూర్, హైదరాబాద్-500033, తెలంగాణ. ఇ-మెయిల్: pg.ethnictobacco@gmail.com

ఈ క్రింది ఆస్తులు పైన తెలిపిన వ్యక్తులకు చెందిన బ్యాంక్రప్టసీ ఎస్టేట్‌లో భాగమైన ఆస్తులు, బ్యాంక్రప్టసీ ట్రస్టీ ద్వారా **"ఎక్కడ ఎలా ఉన్నదో, "ఏది ఎలా ఉన్నదో" "ఏదైతే ఎలా ఉన్నదో అది అలానే" మరియు "ఎటువంటి రికోర్స్ లేని"** విధానంలో ఇ-వేలం ద్వారా దిగువ పట్టికలో పేర్కొన్న వివరాల ప్రకారం అమ్మకానికి ఉంచబడినవి.
ఆంధ్రప్రదేశ్, గుంటూరు నగరం మరియు చుట్టపక్కల ప్రాంతాలలో ఉన్న ఆస్తులు వాటి వివరాల కోసం దయచేసి వేలం ప్రక్రియ డాక్యుమెంట్‌ను చూడండి.

లాట్ నెం.	ఆస్తి వివరణ	రిజర్వు ధర (రూ.)	బయానా (రూ.)	బిడ్డు పెంపుదల మొత్తం (మల్టిపుల్స్‌లో) (రూ.)
1	గుంటూరు, అరుండల్‌పేట, కాకుమానివారితోట వద్ద 360 చ॥గ॥ల స్థలం మరియు 2700 చ॥అ॥ల విస్తీర్ణములో 2 బిహెచ్‌కె నివాస భవనము. సేల్ డీడ్ నెం. 1103/1986. ఎస్ఆర్ఓ గుంటూరు.	2,66,00,000	26,60,000	3,00,000
2	గుంటూరు, అరుండల్‌పేట, జయా టవర్స్‌లో 20 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా & 1008 చ॥అ॥ల బిల్టప్ ఏరియా విస్తీర్ణముతో కూడిన ఫ్లాట్ నెం. 303. సేల్ డీడ్ నెం. 96/2010. ఎస్ఆర్ఓ గుంటూరు.	51,00,000	5,10,000	50,000
3	గుంటూరు, అరుండల్‌పేట, జయా టవర్స్‌లో 16.72 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా & 1008 చ॥అ॥ల బిల్టప్ ఏరియా విస్తీర్ణముతో కూడిన ఫ్లాట్ నెం. 102. సేల్ డీడ్ నెం. 13893/2007. ఎస్ఆర్ఓ గుంటూరు.	51,00,000	5,10,000	50,000
4	గుంటూరు, అరుండల్‌పేట, జయా టవర్స్‌లో 20 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా & 1008 చ॥అ॥ల బిల్టప్ ఏరియా విస్తీర్ణముతో కూడిన ఫ్లాట్ నెం. 103. సేల్ డీడ్ నెం. 8291/2009. ఎస్ఆర్ఓ గుంటూరు.	51,00,000	5,10,000	50,000
5	గుంటూరు, అరుండల్‌పేట, జయా టవర్స్‌లో 24 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా & 1008 చ॥అ॥ల బిల్టప్ ఏరియా విస్తీర్ణముతో కూడిన ఫ్లాట్ నెం. 204. సేల్ డీడ్ నెం. 8328/2009. ఎస్ఆర్ఓ గుంటూరు.	51,00,000	5,10,000	50,000
6	గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మం॥, చౌడవరం వద్ద 2 ఎకరాల 63.5 సెంట్ల భూమి. సేల్ డీడ్ నెం. 656/2007 & 720/2008. ఎస్ఆర్ఓ ప్రత్తిపాడు.	2,74,37,000	27,43,700	3,00,000
7	గుంటూరు, అరుండల్‌పేట, జయా టవర్స్, 103 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా కలిగి సెల్లార్‌లో 1140 చ॥అ॥ల షాపులు & గ్రౌండ్ ఫ్లోర్‌లో 2400 చ॥అ॥ల బిల్టప్ ఏరియాలోని షాపులతో కూడిన వాణిజ్య షాపులు 1 నుండి 10 వరకు మరియు సెల్లార్. సేల్ డీడ్ నెం. 3058/2006. ఎస్ఆర్ఓ గుంటూరు.	2,28,41,000	22,84,100	2,00,000
8	గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మం॥, నడింపాలెం వద్ద 10 ఎకరాల 36 సెంట్ల భూమి. సేల్ డీడ్ నెంలు. 360/2008, 361/2008, 364/2008, 365/2008, 5828/2009, 5829/2009, 5830/2009, 5831/2009. ఎస్ఆర్ఓ ప్రత్తిపాడు.	7,22,34,000	72,23,400	7,00,000
9	గుంటూరు జిల్లా, నల్లపాడుమం॥, పోతూరు గ్రా॥ వద్ద 1 ఎకరా 91 సెంట్ల భూమి. సేల్‌డీడ్ నెంలు. 3466/2005, 3862/2005, 5523/2005, 5524/2005. ఎస్ఆర్ఓ నల్లపాడు.	1,54,20,000	15,42,000	2,00,000
10	గుంటూరు, సంగడిగుంట వద్ద 999 చ॥గ॥ల భూమి. సేల్ డీడ్ నెం. 8109/2007, 8110/2007. ఎస్ఆర్ఓ గుంటూరు.	3,55,74,000	35,57,400	4,00,000
11	గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మం॥, ఏదులపాలెం వద్ద 24200 చ॥గ॥లు (5 ఎకరాలలోని) వ్యవసాయేతర భూమి. సేల్ డీడ్ నెం. 1424/2015. ఎస్ఆర్ఓ ప్రత్తిపాడు.	1,98,46,000	19,84,600	2,00,000
12	గుంటూరు జిల్లా, తాడికొండ మం॥, లామ్ గ్రా॥ వద్ద 95 సెంట్ల భూమి. సేల్ డీడ్ నెం. 1234/2007. ఎస్ఆర్ఓ తాడికొండ.	1,47,45,000	14,74,500	1,00,000
13	గుంటూరు జిల్లా, నల్లపాడు మం॥, పోతూరు వద్ద 67 చ॥గ॥లలోని నివాస స్థలం. సేల్ డీడ్ నెం. 4880/2010. ఎస్ఆర్ఓ నల్లపాడు.	3,49,000	34,900	1,000

వేలం సమయ పట్టిక

ఆస్తి సందర్శన/ఆస్తి తనిఖీ	06.01.2026 నుండి 21.01.2026
అర్హత కలిగిన పత్రాల దాఖలు	23.01.2026
బయానా దాఖలు	23.01.2026
ఇ-వేలం తేది (బిడ్లు దాఖలు)	28.01.2026 న ఉ. 11.00 గం॥ల నుండి సా. 04.00 గం॥ల మధ్య

సంక్షిప్త వేలం నియమనిబంధనలు:
1. ఆసక్తి గల దరఖాస్తుదారులు ఆన్‌లైన్ ఇ-వేలం నియమ నిబంధనల వివరాలు, ఇ-వేలం బిడ్డు ఫారం, అర్హత ప్రమాణాలు, బిడ్డర్ల డిక్లరేషన్, బయానా అవశ్యకతలు మొదలైన వివరాలు కలిగిన పూర్తి ఇ-వేలం ప్రాసెస్ ఇన్ఫర్మేషన్ డాక్యుమెంట్‌ను రిఫర్ చేయవలెను. సదరు డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్: https://bankauctions.in లో చూడవచ్చును లేదా ఇ-మెయిల్: pg.ethnictobacco@gmail.com ద్వారా పొందవచ్చును. బిడ్ సంబంధిత పత్రాలను నిర్దేశించిన ఫార్మాట్లలో ఇ-మెయిల్ ద్వారా సమర్పించాలి, తరువాత ఒరిజినల్ పత్రాలను సమర్పించాలి.
2. బయానా డిపాజిట్ చేసిన ఆసక్తి గల దరఖాస్తుదారుడు లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను సృష్టించడంలో సహాయం కొరకు బ్యాంక్రప్టసీ ట్రస్టీ కార్యాలయాన్ని ఇ-మెయిల్ ద్వారా pg.ethnictobacco@gmail.com లేదా prakash@bankauctions.in మరియు ఫోన్ నెం. 8142000064 ను సంప్రదించవచ్చును.

కూరపాటి శింగరయ్య చౌదరి
బ్యాంక్రప్టసీ ట్రస్టీ
Reg. No. IBBI/IPA-003/IP-N000149/2017-2018/11728
pg.ethnictobacco@gmail.com

తేది: 4 జనవరి, 2026
ప్రదేశము: హైదరాబాద్

సంపాదకీయం

గరళ జలం!

ఆరు నెలల పసికందుకు పాలపొడిలో మున్సిపల్ ట్యాప్ నీళ్లు కలిపి పట్టించిన ఆ తల్లికి తెలీదు.. ఆ నీళ్లే విషంగా మారి, తన చిన్నారి ప్రాణాల్ని బలిగొంటుందని. పదేళ్ల నిరీక్షణ తర్వాత పుట్టిన బిడ్డను కోల్పోయిన ఆ తల్లి... సూటిగా ప్రశ్నిస్తోంది 'పరిహారం నా బిడ్డను తిరిగి ఇస్తుందా?' అని. ఆ తల్లి ప్రశ్నకు సమాధానం చెప్పలేని వ్యవస్థ నేడు మన ముందుంది. 'ఒక చిన్నారి మరణిస్తే అది కుటుంబ విషాదం కాదు, సమాజ వైఫల్యం' అంటారు రచయిత్రి మహాశ్వేతాదేవి. ఎనిమిదిసార్లు 'స్వచ్ఛనగరం'గా అవార్డులు అందుకున్న ఇండోర్‌లోని భగీరథపురాలో ఇళ్లన్నీ శోకగృహాలుగా మారాయి. కలుషిత నీరు తాగి తల్లిదండ్రులు తమ పిల్లలను, కుటుంబాలు తమ సభ్యులను కోల్పోయాయి. ఇదో కుటుంబ విషాదం కాదు... ఇది సామూహిక వైఫల్యం. తాగునీరు తల్లి ప్రేమలా స్వచ్ఛంగా వుండాలి. 'స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలు మానవహక్కుల్లో అంతర్భాగం'గా గుర్తించింది ఐరాస. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21లో జీవించే హక్కును హామీ ఇస్తుంది. శుద్ధమైన తాగునీరు ఆ హక్కులో భాగమేనని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది. జీవితం సజావుగా సాగాలంటే సంపదకంటే ముఖ్యమైనది ఆరోగ్యం. ఆరోగ్యం నిలకడగా వుండాలంటే, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలు తప్పనిసరి. 'స్వచ్ఛత లేకుండా ఆరోగ్యం లేదు' అంటారు గాంధీజీ.

గత పది రోజుల్లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలుషిత నీటితో 15 మంది మరణించారు. రెండు వేల మందికి పైగా అనారోగ్యానికి గురయ్యారు. తాగునీటి పైపులైన్లలో ఏర్పడిన పగుళ్ల కారణంగా బ్యాక్టీరియా కాలుష్యం జరిగిందని అధికారులు నిర్ధారించారు. స్థానిక ప్రజలు రెండు నెలల క్రితమే నీరు దుర్వాసన వస్తోందని అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎందుకు స్పందన లేదు? తాగునీటిలో మురుగు కలిసిందని తెలిసినా సరఫరా ఎందుకు ఆపలేదు? దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అవార్డులు పొందిన ఇండోర్‌లోనే పరిస్థితి ఇలా వుంటే, మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోన్న మన ప్రసిద్ధ నగరాల మాటేంటి? లేక ఆ అవార్డుకు ప్రాతిపదికలే అలాంటివా? దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటివల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. 15 లక్షల మంది పిల్లలు డయేరియాతో ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా నీటి నాణ్యత పరీక్షలు ఎందుకు కాగితాలకే పరిమితమౌతున్నాయి? 'డబుల్ ఇంజిన్ సర్కారు' పాలనలో కూడా ప్రజలకు శుద్ధమైన నీరు అందకపోతే ఆ అభివృద్ధి మోడల్ ఎవరి కోసం? రాజ్యాంగం హామీ ఇచ్చిన జీవించే హక్కు.. కేవలం నినాదమేనా? భారతీయ నగరాల్లో నీటి కాలుష్యం చాలా కాలంగా ఆందోళన కలిగిస్తోంది. 70 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లపైనే ఇప్పటికీ చాలా నగరాల్లోని నీటి సరఫరా ఆధారపడుతోంది. దీనికి అతిపెద్ద ఉదాహరణగా ఇండోర్ నీటి సరఫరా వ్యవస్థను పేర్కొనవచ్చు. ఇది 120 సంవత్సరాల పురాతనమైనది. దేశంలో పెద్ద నగరాలలో పెరుగుతున్న నీటి, వాయు కాలుష్య సంక్షోభాలకు స్థానిక నగరపాలక సంస్థలే బాధ్యత వహించాలి.

దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, పురపాలక సంస్థలు ఇప్పటికైనా మేల్కొని, శిథిలమైన పైపులైన్లను ఆధునీకరించాలి. మురుగు కాల్వలకు సమీపంలో వుండే తాగునీటి పైపులైన్లను మార్చాల్సిన అవసరం వుందని తరచుగా జరుగుతున్న ప్రమాదాలు హెచ్చరిస్తున్నాయి. ఈ దేశానికి కావాల్సింది ఇంకో అవార్డు కాదు... మరో పసికందు ప్రాణం పోకుండా చూడాల్సిన బాధ్యతాయుత పాలన. మెరిసే రోడ్లు, రంగుల గోడలు కాదు కావాల్సింది... నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందించే నమ్మకమైన వ్యవస్థ కావాలి. ప్రాణాలు పోయిన తర్వాత ఇచ్చే పరిహారం కంటే, ఆరోగ్యాలను కాపాడుకోగలిగే సంక్షేమం ముఖ్యం. చిన్నారి మరణం కూడా ఈ వ్యవస్థను కుదిపేయకపోతే, మనమంతా మౌన సహచరులమే. ఇండోర్ ఘటన ఒక హెచ్చరిక. ఇప్పటికైనా పాలకులు మేల్కొనకపోతే... రేపు మరో నగరం... మరో తల్లి కడుపుకోత, ఇంకో తల్లి ప్రశ్నకు సమాధానం ఇవ్వలేని రోజు... తరచూ ఎదురౌతూనే వుంటాయి. వేగంగా పట్టణీకరణ చెందుతున్న దేశానికి, ఇంతకన్నా బాధ్యతాయుతమైన పాలన అవసరమని ఇండోర్ దుర్ఘటన హెచ్చరిస్తోంది.

మహనీయుని మాట

చదువుకున్న పౌరులు లేకుండా
ఏ దేశమూ అభివృద్ధి చెందలేదు.
కట్లు తెంపుకోవడానికి
కత్తిలాంటి ఆయుధం
చదువొక్కటే.
- నెల్సన్ మండేలా

జాతి, మత విద్వేషపు మంటలు

ప్రస్తుతం



తెలకపల్లి రవి

నూతన సంవత్సరం ప్రాంగణంలో నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని స్నేహ సౌహార్ద్రతలతో ముందుకు సాగాల్సిన సమయంలో విద్వేష దాడులు, హత్యలు సంభవించడం భారతదేశ ప్రజాజీవితాన్ని కల్లోల పరచింది. భిన్నత్వంలో ఏకత్వానికి పేరుగాంచిన ఈ దేశ ప్రతిష్టకు మచ్చగా మారింది. వీటికి తోడు క్రిస్టమస్ వేడుకలపై దాడులు మరింత ఆందోళనకు కారణమైంది. ఊహించని రీతిలో ఒకచోటగాక, అనేక రాష్ట్రాలలో, ప్రాంతాలలో రకరకాల పేర్లతో జరిగిన ఈ దాడులన్నిటి వెనకా వున్నది మాత్రం విద్వేషం కావడం అన్నిటికన్నా కలవరం కలిగిస్తున్నది. ద్వేషం ద్వేషాన్ని పెంచుతుందన్నట్టు గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన ఆనవాళ్లు లేనిచోట్ల కూడా హిందూత్వ సంస్థలు బరితెగించి దాడులకు పాల్పడ్డాయి. కొన్ని చోట్ల మతం పేరిట, కొన్ని చోట్ల విదేశీ వ్యతిరేకత పేరిట, మరికొన్ని చోట్ల అభాగ్యులను హడలగొట్టడం కోసం ఈ దాడులు జరిగినా తీరుతెన్నులలో తేడా లేదు. ద్వేషం, దౌర్జన్యంలో మాత్రం అన్నిచోట్లా ఒకటే. బిజెపినే పాలించే రెండు రాష్ట్రాల మధ్య కూడా ఇలాంటి ఘటనలు జరగడం ఒకటైతే వాటికి బలైన కుటుంబాల పెద్దలు మేము మాత్రం భారతీయులం కాదా అని ఘోషించడం మనసు కలచివేస్తుంది. ఈ ఘటనలు అంతర్జాతీయ చర్చకు, అభిశంసనకు కూడా దారితీయడంలో ఆశ్చర్యం ఏముంది? అయినా వీటిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవలసింది పోయి కొన్ని చోట్ల సమర్థనలకు దిగడం, కేంద్ర హోంమంత్రి స్థాయిలో వున్న వారు వీటిని మరింత ఎగదోసేట్టు మాట్లాడ్డం చూస్తే ఇవి వ్యూహాత్మకమా అని సందేహం కలుగుతుంది.

ఈశాన్యంపై దాడి

త్రిపురకు చెందిన విద్యార్థి అంజేల్ చక్మాను ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో డిసెంబర్ 28న దారుణంగా హత్య చేయడం దేశాన్ని దిగ్భ్రాంతపరచింది. పైగా అతన్ని సోదరుడితో సహా చైనీయులంటూ ఇష్టానుసారం దూషించి హింసించారు. తర్వాత చక్మా ఆస్పత్రిలో చనిపోయారు. ఇతరుల వివాదం పరిష్కరించేందుకు వెళ్లిన ఆ యువకుడు అన్యాయంగా ప్రాణాలు కోల్పోతే ఎస్.పి అజయ్ సింగ్ ఇందులో జాతి వివాదం లేదని సమర్థించేందుకు పాకులాడటం మరింత దారుణం. నిజానికి అదేమీ నిజం కాదనీ తాము వాస్తవం చెప్పినా వారు వినిపించుకోలేదని బతికి బయటపడిన అతని సోదరుడు ఘోషిస్తున్నాడు. నిందితులను శిక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామీ త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహాకు హామీ ఇవ్వాల్సి వచ్చింది. రెండు చోట్లా బిజెపి ప్రభుత్వాలే వున్నాయి కూడా. ఉత్తరాఖండ్ గతంలో ఉత్తరప్రదేశ్‌లో భాగంగా వుండేదన్నది తెలిసిన విషయమే. మొత్తంగా జాతి మత విద్వేషాలు పెంచిన ఫలితాలు వారికే బెడిసికొడుతున్నాయన్నమాట. ఈశాన్య ప్రాంతంలోని మణిపూర్‌లో రగిలిన జాతి కలహాలకూ రాజకీయంగా ఆజ్యం పోసింది బిజెపినే. ఈశాన్యం ఇప్పుడు తమ పట్టులోకి వచ్చిందని ఆ నాయకులు గొప్పలు పోయారు. కానీ వరుసగా అనేక చోట్ల ఈశాన్య ప్రాంత విద్యార్థులపై గిరిజనులపై చైనీయులనీ బంగ్లాదేశీయులని ఆరోపిస్తూ దాడులు చేస్తున్నారు. బంగ్లా చొరబాటుదారులను తరిమి వేస్తామని అమిత్‌షా అదేపనిగా ప్రకటించ డానికీ ఈ దాడులకూ సంబంధం స్పష్టమే. గాలింపు, తొలగింపు, తరలింపు (డిటెక్ట్, డిలిట్, డిపోర్ట్) అనేది ఆయన మంత్రంలా వినిపిస్తున్నారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, అస్సాం కాంగ్రెస్ నాయకులు కావాలని బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను ప్రోత్స హిస్తున్నారని వారి ఆరోపణ. మమతా అవకాశవాద రాజకీయాలు ఎలాగూ వున్నాయిగానీ బిజెపి నేతలు దీన్ని అంతర్గత వివాదంగా మార్చేశారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ ఈ విషయంలో ఎన్నో తీవ్ర వ్యాఖ్యలతో వరుసగా రెచ్చగొడుతున్నారు. ఈ రెండు చోట్ల బంగ్లాదేశ్ చొరబాటుదారుల తొలగింపు నినాదంతో ఎన్నికలకు వెళ్లాలనేది బిజెపి వ్యూహంగా మారింది. ఆ క్రమంలో ఇలాంటి వరుస ఘటనలు సంభవిస్తున్నాయనేది నిజం. ఈశాన్య రాష్ట్రాల విద్యార్థి సంఘం దీనిపై వివరమైన జాబితానే ప్రకటించింది. తమను దేశంలో భాగంగా చూడటం లేదా అని ప్రశ్నించింది. చదువు, ఉద్యోగాల కోసం వస్తే వెంటాడి చంపడమేమిటని మాజీ బిఎస్ఎఫ్ జవాను, అంజేల్ చక్మా తండ్రి ఆవేదన వెలిబుచ్చారు. అతను నిజానికి ఎంబిఎ చదవడం కోసమే డెహ్రాడూన్ వెళ్లాడు.

వ్యాపారులు, కార్మికులపై దాడులు

మత సామరస్యాన్ని కాపాడుకునే కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో సంఘ పరివార్ దుండగులు రామ్‌నారాయణ్ బెహల్ అనే గిరిజనుడిపై బంగ్లా దేశీయుడంటూ దాడి చేసి ప్రాణాలు తీశారు. నిజానికి కేరళ వాసులు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లడం చాలా ఎక్కువ. కేరళ రాజకీయ చైతన్యం, విద్యా వైద్య స్థాయి కూడా దేశమంతటా పేరుగాంచింది. అలాంటి చోట ఈ ఘటన జరగడం పరిస్థితి దేశంలో ఎంతగా దిగజారిందో చెబుతుంది. కేరళ పోలీసులు, ప్రభుత్వం దీన్ని తీవ్రంగా తీసుకుని కేసు నమోదు చేశారు. ఒరిస్సాలోని సంబాల్పూర్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన వలస కార్మికుడు జ్యూయల్ షేక్‌ను కూడా బంగ్లాదేశీయుడనే పేరుతో బలిగొన్నారు. ఒక టీ దుకాణం దగ్గర ఆగంతకులు అతన్ని గుర్తింపు పత్రాలు చూపించమని ఒత్తిడి పెట్టారు. వాటిని చూపించలేదు గనక అక్రమ వలసదారుడంటూ అక్కడికక్కడే చంపేశారు. ఈ ఘటన బెంగాల్‌ను కుదిపేసింది. ఆ తర్వాత రెండు రోజులకు మరో బెంగాలీ వ్యాపారిపైనా దాడి జరిగింది. తమిళనాడు లోనైతే ఒడిస్సాకు చెందిన వ్యక్తిని రైలులో ప్రయాణిస్తుండగా కత్తులు కటార్లతో కుర్రాళ్లు దాడి చేశారు. అతన్ని కొట్టి వేధించి దాడిని చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టారు.

ఇవొక తరహాకు చెందిన దాడులైతే మరో తరహా మత విద్వేష దాడులు కూడా ఈ కాలంలోనే జరుగుతున్నాయి. కొన్ని చోట్ల మరణాల వరకూ వెళితే మరికొన్ని వేధింపుల పర్వంగా మారాయి. హర్యానా హిమాచల్ ప్రదేశ్‌లో కాశ్మీరీ శాలువాల వ్యాపారులను వెళ్లగొట్టడం అందులో భాగమే. ప్రసిద్ధిగాంచిన కాశ్మీరీ శాలువా వ్యాపారులు దీర్ఘకాలంగా అక్కడక్కడా శిబిరాలు ఏర్పాటు చేసుకుని విక్రయాలు సాగిస్తుంటారు. హర్యానాలోని ఖతారాలో దుండగులు వారిని చుట్టుముట్టి వందేమాతరం పాడాలని నిర్బంధించారు. కొట్టి వేధించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ఫరీదాబాద్‌లోనూ ఇలాంటి ఘటనే జరిగింది. ఫలితంగా అక్కడ ఎప్పటి నుంచో వుంటున్న 18 మందిలో పదహారుగురు ప్రాణభయంతో పారిపోవలసిన పరిస్థితి ఏర్పడింది.

క్రిస్టమస్ కల్లోలం, జిహాద్ కల్పన

మరో వైపున క్రిస్టమస్ రోజున చర్చిలపైనా, వేడుకలపైనా దాడులు దేశమంతటా క్రైస్తవులకు తీవ్ర ఆందోళన కలిగించాయి. భద్రత కోసం మత గురువులు నేరుగా ప్రధాని మోడీకే విజ్ఞప్తి చేశారు. చివరకు ఆయన పరిస్థితిని కప్పిపుచ్చడం కోసం ఢిల్లీలో చర్చి ప్రార్థనకు హాజరై అంతా బావుందన్నట్టు సంకేతం ఇచ్చేందుకు విఫలయత్నం చేశారు. ఢిల్లీ, చత్తీస్‌గఢ్, తమిళనాడు, ఒరిస్సా, అస్సాం, హర్యానా, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ లలో ఇలాంటి అనేక ఘటనలు జరిగాయి. విహెచ్‌పి, బజరంగదళ్ దుండగులు అలంకరణలను ధ్వంసం చేశారు. ప్రార్థనా గీతాలాపనలు అడ్డుకుని ప్రజలను చెదరగొట్టారు. చర్చిలే గాక మిషనరీ పాఠశాలలపైనా దాడికి దిగారు. వీటిపై టైమ్స్ ఆఫ్ ఇండియా సంపాదకీయ వ్యాఖ్య రాస్తూ కేరళలో తప్ప మరెక్కడా పోలీసులు దాడులను ఆపే ప్రయత్నం చేయలేదని విమర్శించింది. మత బృందాల మధ్య విద్వేషం పెంచే భారతీయ న్యాయసంహిత (బిఎన్ఎస్) 196(2), 299 సెక్షన్ల కింద చర్యలు తీసుకుంటే పరిస్థితి మరోలా వుండేదని వ్యాఖ్యానించింది. జబల్‌పూర్‌లో బిజెపి నాయకురాలు క్రైస్తవ ప్రార్థనలపై అవమానకరంగా చేసిన వ్యాఖ్యలపై సంజాయిషీ అడిగామని బిజెపి చెప్పడాన్ని ప్రస్తావిస్తూ ఇదే సరిపోతుందా? అని ఆ పత్రిక ప్రశ్నించింది. ఈ ఏడాదిలో ఇలాంటి 600 దాడులు జరిగినట్టు యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం వెల్లడించింది. వికీపీడియాలో దీనిపై ప్రత్యేకంగా వివరాలు నమోదైనాయి.

ఇక ముస్లింలపై దాడులు ఎప్పుడూ చూస్తున్నవే. ఈ నెలలోనే యు.పి లోని బరేలిలో ఒక హోటల్‌లో పుట్టినరోజు వేడుకలపై విహెచ్‌పి దాడి చేసింది. ఈ వేడుక సందర్భంగా లవ్ జిహాద్ అని ఆరోపిస్తూ అన్నిటినీ ధ్వంసం చేసింది. ఒక విద్యార్థిని పుట్టిన రోజు వేడుకలకు వచ్చిన వారి పేర్లు అడిగి మరీ దాడి చేశారు. హోటల్ యాజమాన్యాన్ని కూడా భయపెట్టారు. ఒకవేళ ఎవరైనా మతాంతర వివాహం చేసుకున్నా ఆపడానికి వీరికి హక్కు ఎవరిచ్చారు? అందుకోసం విధ్వంసం, దాడులు చేయడమా? ఇక్కడ కొసమెరుపు ఏమంటే మొదట పోలీసులు విహెచ్‌పి మాటలు నమ్మి బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేయడం. దీనిపై ఆ అమ్మాయి పోలీసులకు లిఖితపూర్వకమైన ఫిర్యాదు చేశాక ఎట్టకేలకు పది మందిపై కేసు పెట్టారు. అసలు వారు ఆరోపిస్తున్నట్టు అక్కడ లవ్ జిహాద్ ఏమీ లేదని తేల్చేశారు. కానీ ఆ తర్వాత కూడా వారు నమోదు చేసిన కేసులో రిషబ్ ఠాకూర్, దీపక్ పాఠక్ అనే ఇద్దరి పేర్లతో కేసు పెట్టారుగానీ వారిద్దరూ అసలు లేరట. అంటే ఇదంతా కంటితుడుపు వ్యవహారంగా ముగిస్తారన్నమాట.

ఉత్తరప్రదేశ్, బెంగాల్, అస్సాం ఎన్నికల కోసం బిజెపి, ఆరెస్సెస్‌లు ఏదో విధంగా మరోసారి మత రాజకీయాలు రగిలించే ప్రయత్నం తీవ్రం చేశాయని ఈ ఉదంతాలన్నీ కళ్లకు కట్టినట్టు చెబుతున్నాయి. మమతా బెనర్జీ అవకాశవాద రాజకీయాలు ఒకవైపు, బిజెపి మతతత్వం మరోవైపు పరిస్థితిని ఉద్రిక్తం చేస్తున్నాయి. 'గుండెల మీద రాసుకోండి మేమే గెలుస్తున్నామ'ంటూ అమిత్‌షా స్వయంగా బెదిరిస్తున్నారు. కొత్తగా కార్యనిర్వాహక అధ్యక్షుడైన నితిన్ నవీన్ కూడా రంగంలోకి దిగారు. అక్రమ చొరబాటు దారులందరినీ వెళ్లగొట్టేదాకా బిజెపి నిద్రపోదని హెచ్చరికలు చేస్తున్నారు. ఒకవైపు మతం మరోవైపు జాతి గుర్తింపులను రగిలించి రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకోవడం సహించరానిది. ఈ క్రమంలో మరే దారుణమైన కుట్రలు వస్తాయో వాటిపై అవతలివారు ఎలా స్పందిస్తారో ఊహించవలసిందే. చెట్టపట్టాల్ పట్టుకుని దేశస్తులందరూ నడవ వలెనోయ్, అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెనోయ్ అన్న దేశభక్తి భావనకూ ఈ ద్వేషభక్తికీ ఏమైనా సంబంధం వుందా? ఇతరుల మతాన్ని జాతిని ద్వేషించడం ద్వారా దేశభక్తి అనడం ఎంతటి విపరీతం? ఈ విద్వేష వాదనలతో ప్రజలను ముఖ్యంగా యువతను దారితప్పించడమే మతతత్వ రాజకీయాల అసలైన లక్ష్యం. ఈ క్రమంలో ఎందరు అమాయకులు బలైనా ఎందరు వలస కార్మికుల జీవితాలు తలకిందులైనా వారికి పట్టదు. పైగా ఇరుగు పొరుగు దేశాలను ప్రస్తావించడం దౌత్యపరమైన సమస్యలకు కూడా దారితీసినా ఆశ్చర్యం లేదు. ★

చెట్టపట్టాల్ పట్టుకుని దేశస్తులందరూ నడవ వలెనోయ్, అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెనోయ్ అన్న దేశభక్తి భావనకూ ఈ ద్వేషభక్తికీ ఏమైనా సంబంధం వుందా? ఇతరుల మతాన్ని, జాతిని ద్వేషించడం ద్వారా దేశభక్తి అనడం ఎంతటి విపరీతం? ఈ విద్వేష వాదనలతో ప్రజలను ముఖ్యంగా యువతను దారితప్పించడమే మతతత్వ రాజకీయాల అసలైన లక్ష్యం. ఈ క్రమంలో ఎందరు అమాయకులు బలైనా ఎందరు వలస కార్మికుల జీవితాలు తలకిందులైనా వారికి పట్టదు. పైగా ఇరుగు పొరుగు దేశాలను ప్రస్తావించడం దౌత్యపరమైన సమస్యలకు కూడా దారితీసినా ఆశ్చర్యం లేదు.

తరిగిపోతున్న రైతు సహకార సంఘాలు

విమర్శ

టి. గంగరాజు

ఉమ్మడి రాష్ట్రంలో 12 వేల సహకార సంఘాలు, 27 జిల్లా బ్యాంకులు ఉండేవి. 1973లో వయబిలిటీ ప్రోగ్రాం ద్వారా నష్టాల్లో ఉన్న 6000 సంఘాలను రద్దు చేశారు. ఇక 1984లో ఎన్.టి.రామారావు తీసుకొచ్చిన సింగిల్ విండో సిస్టమ్ వల్ల 6000 నుంచి 4610 సంఘాలకు కుదించారు. జిల్లాల సెంట్రల్ బ్యాంకులను 23కు విలీనం చేశారు. అంటే సంఘాలు తరిగిపోయాయి. ఇంకా తరిగిపోతున్నాయి. బ్యాంకులు మాత్రం అదే విధంగా కొనసాగుతున్నాయి. ఇది ఎందుకు జరిగింది?

నాబార్డు అధికారులు ప్రత్యేకంగా కమిటీల ద్వారా ఇచ్చిన సిఫారసులను చూస్తే, అసలు విషయాన్ని దాచిపెట్టి సంఘాలు నష్టాల్లో ఉన్నాయి కనుక రద్దు కాబడుతున్నాయని నమ్మబలుకుతున్నారు. ఇందుకు కారణం కమిటీలలో మెజారిటీ భాగం బ్యాంకు అధికారులే ఉండటం గమనించదగ్గ విషయం. అసలు నష్టాలకు కారణం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ దాన్ని తొక్కిపెట్టి మిగిలిన రాజకీయ కారణాలను తెర మీదకి తీసుకొచ్చారు. మొదటి నుంచి మనం చెబుతున్నది, కనిపిస్తున్నది ఒకటే. అది అకౌంటింగ్ సిస్టమ్. ఇది సరిగా లేనందువల్ల వచ్చిన వడ్డీ అంతా బ్యాంకు వారు తమ అప్పుల ఖాతాకు జమ చేసుకోవడం వలన సంఘాలు ఇన్‌బ్యాలెన్స్‌కి చేరుకుని నష్టాలపాలవుతున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించే ప్రయత్నమే చేయడం లేదు. కాగా సంఘాల్లో సిబ్బంది అధికంగా ఉన్నారని, జీతాలు ఎక్కువ తీసుకుంటున్నారని, ఇవి నాబార్డు నిబంధనలకు లోబడి లేవని కుంటి సాకులు చెబుతూ సహకార ఉద్యమానికి తూట్లు పొడుస్తున్నారు. వైద్యనాథన్ సిఫారసులకు ముందే ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 4,610 సంఘాలను 2795 సంఘాలుగా కుదించారు. దరిమిలా వైద్యనాథన్ ప్యాకేజ్ ద్వారా 1850 కోట్ల రూపాయల నిధులు సహకార సంఘాలు ఇవ్వడం జరిగింది. ఈ మొత్తం అంతా సహకార సంఘాల బాకీలను డిసిసిబిలు జమ చేసుకొని మిగిలిన మొత్తాన్ని ఫ్లెక్సీ డిపాజిట్లుగా బ్యాంకుల్లో మదుపు చేసుకున్నారు. ఆ మొత్తం నుంచి సంఘాలు వ్యాపారం చేసుకోవడానికి ఇమ్మని అడిగితే...మీరు బిజినెస్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లు ఇవ్వండి, మీకు మంజూరు చేస్తాం అని డిసిసిబి నుండి ఆప్కాబు వరకు ఒకే పాట పాడేవారు. కానీ స్టేట్ లెవెల్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (ఎస్.ఎల్.ఐ.సి) వారు మాత్రం ఒక తీర్మానం చేసుకుని ఆ తీర్మానం ద్వారా ఫ్లెక్సీ డిపాజిట్‌లో ఉన్న సొమ్మును బ్యాంకులకు దఫదఫాలుగా మొత్తం జమ చేసుకున్నారు. ఆ మొత్తం సొమ్మును వారి సిబ్బంది జీతాలకే వాడుకున్నారు. గట్టిగా అడిగిన అధ్యక్షులు లేకపోవడం వలన మొత్తం ఫ్లెక్సీ డిపాజిట్లు బ్యాంకుల పరం అయిపోయాయి. రీఫైనాన్సు సదుపాయం లేకుండా పోయిన పరిస్థితి నుండి...వైద్యనాథన్ ప్యాకేజీ 1850 కోట్ల రూపాయల వల్ల 11 సెంట్రల్ బ్యాంకులు మామూలు స్థితికి వచ్చాయి. దరిమలా రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏపీకి 13 జిల్లా బ్యాంకులు 2051 సహకార సంఘాలు ఉన్నాయి. నేటి తాజా పరిస్థితి చూస్తే 2051 సహకార సంఘాలకు కేవలం వందల సంఖ్యలో మాత్రమే సంఘాలు నిలదొక్కుకున్నాయి. మిగిలినవి నష్టాలబాటలో ఉన్నట్టుగా కనిపిస్తున్నాయి. ఇందులో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం విడుదల చేసిన జీవోల ప్రకారం వేతనాలు ఇవ్వడానికి బ్యాంకులు అడ్డంకి చెబుతున్నాయి. జీవో జారీ చేసి 6 సంవత్సరాలు గడిచినప్పటికి బ్యాంకులు డి.ఎల్.ఎస్.ఎఫ్ ను ఈనాటికీ ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలుపరచడానికి ముందుకు రావడం లేదు. ఉద్యోగులు జీవో అమలు కోసం సంవత్సరాల తరబడి ఆందోళన చేస్తూనే ఉన్నారు.

1964 చట్టం ప్రకారం సహకార రంగంలోని మూడంచెలు సెక్షన్116కు లోబడి...సిబ్బంది నియామకాలు, వేతనాలు వగైరా సర్వీసు నిబంధనలు వుంటాయి. బ్యాంకులకు లేని ఆంక్షలను సంఘాలకు పెట్టి నష్టాల ఊబిలోకి ఎందుకు నెడుతున్నారు? ఇప్పటికి 13 జిల్లా బ్యాంకుల్లో మూడు జిల్లా బ్యాంకులు మాత్రమే పరవాలేదనేలా ఉన్నాయి. మిగిలిన 10 జిల్లాల బ్యాంకులు రిజర్వ్ బ్యాంక్ లైసెన్స్ రద్దుకు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ, వాటికి ప్రభుత్వం మద్దతు ఇస్తున్నది. ఇది సరైన విధానం కాదు. బ్యాంకులతో సమానంగా సహకార సంఘాలను కూడా పరిగణించాలి. సహకార సంఘాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలి. అలాగే ఆ సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇచ్చిన జీవోలు అమలుపరిచి 2019, 2024 వేతన సవరణ పూర్తిచేసి, మెరుగైన గ్రాట్యుటీ విధానాన్ని అమలు చేయాలి. సహకార సంఘాలు ప్రభుత్వ పథకాలను రైతులకు నేరుగా చేరవేసే, సేవలందించే సాధనాలు. కనుక సంఘానికి ప్రభుత్వం మెరుగైన ఆర్థిక వసతులు కల్పిస్తే రైతులకు సేవ చేసినట్లు అవుతుంది. ప్రభుత్వం ఈ సున్నితమైన విషయాన్ని గుర్తించి ఆ దిశగా సహకార ఉద్యమాన్ని, వ్యవస్థను కాపాడాల్సిన అవసరం ఎంతైనా వుంది.

/వ్యాసకర్త సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి /

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

కేరళలో మున్సిపల్ చైర్మన్‌గా ఆదివాసీకి పట్టం

స్ఫూర్తి

కాల్‌పెట్టా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన ఆదివాసీ విశ్వనాథన్

మేం అందంగా లేకపోవచ్చు, మేమూ అందరి మాదిరి మనుషులమే...మా శరీరాలు నల్లగా ఉండవచ్చు, మా హృదయాలు స్వచ్ఛం...విత్తనాలు నాటే వారిలో మేమూ ఒకరిమే, వాటికి కాపలాదారులం కూడా....పిడికెడు ధాన్యమే మేం కోరుతున్నాం.

ఈ భావంతో లిపి లేని తమ భాషలో పాటలు పాడుకొంటారు కేరళలోని పనియా గిరిజన తెగవారు. సమాజంలో నిరాదరణకు గురైన ఈ తెగకు చెందిన నాలుగు పదుల వయస్సున్న పి.విశ్వనాథన్ జీవనం కోసం కాపలాదారుగా పని చేస్తున్నాడు. గతేడాది డిసెంబరులో జరిగిన ఎన్నికలలో కేరళ లోని వయనాడ్ జిల్లా కేంద్రమైన కాల్‌పెట్టా మున్సిపల్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించాడు. ఇతర గిరిజన తెగలలో కురిచియా వారే రిజర్వుడు సీట్ల నుంచి ప్రాతినిధ్యం వహించారు తప్ప జనాభా రీత్యా ఎక్కువగా ఉన్నప్పటికీ అత్యంత వెనుకబడిన కారణంగా నోరు లేని పనియా తెగకు చెందిన వారు ఇప్పటి వరకు ఇలాంటి పదవులను చేపట్టలేదు. దళితులు, గిరిజనులకు కేటాయించిన స్థానాల నుంచే ఆ తరగతులకు చెందిన వారు ఎన్నికై పదవులను చేపట్టటం సర్వసాధారణం. అయితే సిపిఐ(ఎం) తన కార్యకర్తగా పని చేస్తున్న విశ్వనాథన్‌ను ఒక జనరల్ వార్డు నుంచి పార్టీ పోటీకి నిలిపింది. పట్టణంలో అత్యధిక మెజారిటీతో కౌన్సిలర్‌గా గెలిపించింది. గిరిజనులకు రిజర్వు చేసిన చైర్మన్ పదవిని చేపట్టారు. మలయాళ పత్రికలతో పాటు అక్కడి నుంచి వెలువడే జాతీయ పత్రికలన్నీ ఈ ఎన్నిక గురించి ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. విశ్వనాథన్‌ను ఒక పత్రిక హీరోగా వర్ణించింది. తమ పొలాల్లో పని చేసేందుకు గతంలో ఈ తెగవారిని భూస్వాములు బానిసలుగా చేసుకున్న చరిత్ర ఉంది.

యువకుడిగా డివైఎఫ్ఐ నేతగా, సిపిఐ(ఎం)లో ఏరియా కమిటీ సభ్యుడిగా, ఆదివాసీ క్షేమ సమితి నేతగా, జానపద గాయకుడిగా విశ్వనాథన్ పని చేస్తున్నారు. గిరిజన తెగల హక్కులు, గౌరవం కోసం జరిగే అన్ని ఉద్యమాల్లో భాగస్వామి. చిన్న తనంలో చదువు సంధ్యలకు నోచుకోని కారణంగా ఈ వయస్సులో పదవ తరగతితో సమానమైన(మెట్రిక్ ఆదివాసీ వంటిది) తుల్యత పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన తరువాత మీడియాతో మాట్లాడుతూ ఎవరికోసమో ఎదురు చూడకుండా తమ సామాజిక తరగతికి చెందిన వారు తమ పరిమితులను అధిగమించి అన్ని ఆటంకాలను తట్టుకొని ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. తన ఎన్నిక తమవారిలో ప్రోత్సాహానికి దోహదం చేస్తుందన్నారు. దరఖాస్తులు రాసుకోవటం కూడా రాని తమవారు ఇతరుల మీద ఆధారపడుతున్నారని చెప్పారు. వయనాడ్ జిల్లాలోని గిరిజనుల్లో పనియా తెగవారు 75 వేల మంది ఉండగా కురుమా, కురిచియా తెగలకు చెందిన వారు 52 వేల మంది చొప్పున ఉన్నారు. ఈ తెగకు చెందిన వారు వయనాడ్, కన్నూరు, మలప్పురం, కోజికోడ్ జిల్లాలో ఉన్నారు. పొరుగునే ఉన్న తమిళనాడు నీలగిరి జిల్లాలో, కర్ణాటకలో పరిమితంగా ఉన్నారు. ఎన్నికైన తరువాత అధికారిక వాహనంలో తన తల్లిదండ్రులను కలుసుకొనేందుకు వెళ్లినపుడు వారిలో ఎలాంటి సంభ్రమాశ్చర్యాలు లేకుండా కొడుకును చూశారని, తన కుమారుడు ఈ పదవికి ఎన్నికైనందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని తల్లి చెప్పినట్లు పిటిఐ తెలిపింది. అతని సామర్థ్యం కారణంగానే జనరల్ సీటు నుంచి గెలిచారని సిపిఐ(ఎం) సీనియర్ నేత వి. హారిస్ చెప్పారు.

- సత్య

వెనిజులాలో అత్యవసర పరిస్థితి

- అంతర్జాతీయ సమాజం విస్మయం

కారకస్ : నెలల తరబడి తమపై ఒత్తిడి తేవడానికి ప్రయత్నాలు సాగించిన ట్రంప్ చివరకు పౌర, సైనిక స్థావరాలపై దాడులకు తెగించారని మదురో ప్రభుత్వం విమర్శించింది. దేశంలో అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు ప్రకటించింది. పెద్ద ఎత్తున సైనిక బలగాలను మోహరించినట్లు తెలిపింది. పదాతి, నావికా, వైమానిక బలగాలను అప్రమత్తం చేసినట్లు తెలిపింది. 'మన గడ్డపై అమెరికా బలగాలు విచక్షణారహితంగా దాడులకు బరితెగించాయి. వారి యుద్ధ విమానాల నుండి క్షిపణులు, రాకెట్లు మన ప్రజల ఆవాసాలపై విరుచుకుపడుతున్నాయి." అని వెనిజులా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో లోపెజ్ సోషల్ మీడియాలో వీడియో ప్రకటన చేశారు. దక్షిణ కారకస్‌లోని అతి పెద్ద మిలటరీ సముదాయంపై, మిరాండా, అరగ్వా, లా గుయిరా, రాష్ట్రాల్లో కూడా దాడులు జరిగాయని లోపెజ్ తెలిపారు. ఈ దాడులతో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలను అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

భద్రతా మండలి అత్యవసర సమావేశానికి వెనిజులా డిమాండ్

తమ మాతృభూమిపై అమెరికా క్రిమినల్ చర్యకు దిగిందని, పైగా అధ్యక్షుడు మదురో ఆచూకీపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో అమెరికా దుందుడుకు చర్యలపై చర్చించేందుకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి శనివారం అత్యవసరంగా సమావేశం కావాలని వెనిజులా డిమాండ్ చేసింది. ఈ మేరకు వెనిజులా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన చేసింది.

రాజధానిలో ఏడు చోట్ల పేలుళ్లు...

శనివారం తెల్లవారుజాము నుండి చాలా వేగంగా చోటు చేసుకున్న ఈ పరిణామాల పట్ల అంతర్జాతీయ సమాజం విస్మయం వ్యక్తం చేసింది. తొలుత రాజధాని నగరంలో ఏడు చోట్ల పేలుళ్లు సంభవించాయి. నగరంలో పలు చోట్ల దట్టమైన పొగ కమ్ముకున్న, ప్రజలు వీధుల్లో పరుగులు పెడుతున్న దృశ్యాలు కనిపించాయి. కారకస్ గగనతలంలో పలు అమెరికా చినూక్ మిలటరీ హెలికాప్టర్లు చక్కర్లు కొడుతున్న వీడియోతో సహా ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో పలు వీడియోలు బయటకు వచ్చాయి. బాంబు దాడుల కారణంగా కారకస్‌లోని మిలటరీ బేస్‌తో సహా పలు ప్రాంతాల్లో అంధకారం అలుముకుంది. తక్కువ ఎత్తులో ఎగురుతున్న విమానాల శబ్దాలు కూడా వినిపించాయని అధికారులు తెలిపారు.

మదురో, ఆయన భార్య ఆచూకీ చెప్పండి : వెనిజులా ఉపాధ్యక్షురాలు

మరోవైపు దేశంలోని పలు ప్రాంతాల్లో సైనిక స్థావరాలు, నివాస సముదాయాలే లక్ష్యంగా దాడులు జరిగాయని వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రొడ్రిగజ్ తెలిపారు. ప్రభుత్వ టివితో టెలిఫోన్‌లో మాట్లాడుతూ ఆమె, తమ అధ్యక్షుడు, ఆయన భార్య జీవించి వున్నారో లేదా చెప్పాలని, ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. అమెరికా ఆర్మీలో అత్యున్నత మిషన్ యూనిట్ అయిన ఎలైట్ డెల్టా ఫోర్స్ సభ్యులు మదురో దంపతులను కస్టడీలోకి తీసుకున్నట్లు మీడియా వార్తలు పేర్కొన్నాయి. కాగా అమెరికా మిలటరీ చర్యను పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. అంతర్జాతీయంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

చమురుపై ఆధిపత్యమే లక్ష్యం

గత కొంతకాలంగా వెనిజులాను అన్ని వైపుల నుండి అణచివేయడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుయుక్తులు పన్నుతున్నారు. కరేబియా సముద్ర జలాల్లో ప్రధానంగా వెనిజులా తీరంలో మిలటరీ బలగాలను గణనీయంగా పెంచుతూ వచ్చారు. పైగా వెనిజులాపై తన చర్యలకు భిన్నమైన వాదనలు చెబుతూ వచ్చారు. డిసెంబరులో ఆమోదించిన అమెరికా జాతీయ భద్రతా వ్యూహంలో కూడా తన వైఖరిని చాలా స్పష్టంగా వెల్లడించారు. మదురో పదవి నుండి వైదొలగితే బాగుంటుందని, లేకపోతే రోజులు లెక్కపెట్టుకోవాల్సిందేనంటూ హెచ్చరికలు కూడా చేశారు. మాదకద్రవ్యాల ముఠాలను కట్టడి చేయడం కోసమే ఇదంతా చేస్తున్నట్లు పైకి సాకులు చెబుతున్నా అమెరికా అసలు ఆంతర్యం వెనిజులా చమురుపై పట్టును సాధించడమేనని అందరికీ తెలిసిన విషయమే.

ఇంట్లో వుంటుండగానే మదురో దంపతుల కిడ్నాప్

మదురో దంపతులు టియానా మిలటరీ కాంప్లెక్స్‌లోని వారి నివాసంలో వున్నప్పుడే వారిని కిడ్నాప్ చేశారని వెనిజులా పాలక పార్టీ నేత నహమ్ ఫెర్నాండెజ్ మీడియాకు తెలిపారు. అక్కడే బాంబు దాడులు కూడా జరిగాయన్నారు.

న్యూయార్క్‌కు మదురో దంపతులు

ఇక వెనిజులాపై నిర్ణయాలన్నీ మావే

మాదకద్రవ్యాలు, ఉగ్రవాద అభియోగాలపై విచారణ

అసోసియేటెడ్ ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్

వాషింగ్టన్ : అత్యంత పటిష్టమైన పహారా గల భవనం నుండి మదురోను తమ ఆధీనంలోకి తీసుకున్నామని ట్రంప్ ప్రకటించారు. మదురోను, ఆయన భార్యను యుద్ధ నౌకలో న్యూయార్క్‌కు తరలిస్తున్నట్లు ట్రంప్ అసోసియేటెడ్ ప్రెస్ అనే వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. వెనిజులాలో తదుపరి చర్య ఏమిటి అనేది అమెరికాయే నిర్ణయిస్తుందన్నారు. అంతకు ముందు ఆయన అధ్యక్ష భవనంలో పత్రికా గోష్టిలో మాట్లాడుతూ ఆపరేషన్ మిడ్‌నైట్ అద్భుతంగా జరిగిందని, ఈ ఆపరేషన్ ద్వారా వెనిజులా సైనిక సామర్థ్యాన్ని నిర్వీర్యం చేసిందని, అమెరికా సైనిక శక్తిని చాటి చెప్పిందని అన్నారు. మదురోపై మాదకద్రవ్యాలు, ఉగ్రవాదానికి సంబంధించిన క్రిమినల్ అభియోగాలపై విచారిస్తామని తెలిపారు.

మదురోను తమ కస్టడీలోకి తీసుకుంటున్న చర్యను తాను 'టెలివిజన్ షో' లా చూశానంటూ ట్రంప్ విపరీతపు వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రత్యేక బలగాల కార్యకలాపాలను ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. మదురో వదిలిపెట్టిన బాధ్యతలను స్వీకరించడానికి ఎవరినీ అనుమతించబోం, ఆ ప్రజల కోసం ఏదైనా చేసే స్వేచ్ఛ మాకు వుంది. ఈ విషయాల్లో మా జోక్యం చాలా ఎక్కువగా వుంటుంది." అని చెప్పారు. పైగా అమెరికాను ఎవరూ తేలికగా తీసుకోలేరని ఈ సాహసోపేతమైన దాడి తెలియజేసిందంటూ ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. వెనిజులాపై సైనిక ఆపరేషన్ సందర్భంగా మరణాలు ఏమీ సంభవించలేదని, కేవలం కొద్దిమంది గాయపడ్డారని ట్రంప్ చెప్పారు. వెనిజులా నేతను తమ స్వాధీనంలోకి తీసుకున్న నేపథ్యంలో ఆ దేశ చమురు పరిశ్రమలో అమెరికా చాలా గట్టిగా జోక్యం చేసుకోబోతోందని ట్రంప్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద, అతి గొప్పవైన చమురు కంపెనీలు మనకు వున్నాయి. ఈ వ్యవహారాల్లో మా ప్రమేయం వుండబోతోందని చెప్పారు.

చమురు కోసమే ఉన్మాదం

- గతంలో అంగీకరించిన ట్రంప్
- వెనిజులా దిగ్బంధనం

కారకస్ : వెనిజులాపై అమెరికా సాయుధ దురాక్రమణ దాడికి మూలం ఆదేశంపై ఆర్థిక, నావికాయాన ఆంక్షలతో ఒక దెబ్బకు రెండు రెండు పిట్టలు అన్నట్లుగా వెనిజులా, క్యూబా రెండింటిని ఈ ఆంక్షలతో దెబ్బతీయాలని చూసింది. ఈ దిగ్బంధనంకు (టోటల్ అండ్ కంప్లీట్ బ్లాకేడ్) అసలు లక్ష్యం చమురేనని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ఇటీవల అంగీకరించారు. తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో ఐదుసార్లు 'చమురు' అనే పదాన్ని ప్రస్తావించడం ద్వారా, వెనిజులాపై యుద్ధానికి డ్రగ్ ట్రాఫికింగ్ కారణమన్న వైట్‌హౌస్ వాదనల డొల్లతనాన్ని ఆయన తన పోస్టుల ద్వారా బహిర్గతం చేశారు. తొలుత చమురు ట్యాంకర్లపై ఆంక్షలు విధించి, తరువాత సైనిక కార్యకలాపాలు నిర్వహించేందుకు సిఐఎకు అనుమతించి శనివారం వెనిజులాపై ప్రత్యక్ష సైనిక చర్యకు ట్రంప్ బరితెగించారు.

కార్పొరేట్ ప్రయోజనాలే లక్ష్యం

వెనిజులా ప్రపంచంలోనే అత్యధికంగా నాణ్యమైన చమురు నిల్వలను కలిగి ఉంది. ఈ చమురును శుద్ధిచేయడానికి ఖర్చు చాలా తక్కువ. అందుకే అమెరికా కన్ను దీనిపై పడింది. ట్రంప్ ఒక సందర్భంలో వెనిజులా "గతంలో తమ నుండి దొంగిలించిన చమురు, భూమి, ఇతర ఆస్తులన్నింటినీ అమెరికాకు తిరిగి ఇవ్వాలని" డిమాండ్ చేశారు.

అయితే దాదాపు 20 సంవత్సరాల క్రితం మాజీ అధ్యక్షుడు హ్యూగో చావెజ్ చమురు పరిశ్రమలను జాతీయం చేశారు. దీని ద్వారా వచ్చిన చమురు ఆదాయాలను గత కొన్ని దశాబ్దాలుగా వెనిజులాలో ఆరోగ్యం, విద్య, గృహనిర్మాణం వంటి సామాజిక కార్యక్రమాలకు ఆ నిధులను ఉపయోగించారు. మరోవైపు జాతీయికరణతో ఎక్సాన్‌మొబిల్, కోనోకోఫిలిప్స్ వంటి అమెరికా భహుళజాతి కంపెనీలకు భారీ నష్టం జరిగింది. వాటికి సహాయం చేయడమే ట్రంప్ లక్ష్యమని పలువురు విశ్లేషిస్తున్నారు.

సామ్రాజ్యవాద లక్ష్యాలు

చమురు స్వాధీనం మాత్రమే కాకుండా, ఈ చర్యతో పశ్చిమార్ధగోళ కూటమిని అమెరికా ఆధిపత్యం వహించాలనే సామ్రాజ్యవాదకాంక్షలు కూడా ఉన్నాయి. చైనా, రష్యా, భారతదేశం వంటి పోటీదా రులను నిరోధించడానికి, మార్కెట్లు, సహజ వనరు లపై నియంత్రణ సాధించడామే అమెరికా లక్ష్యం.



వెనిజులా, క్యూబాపై ప్రభావం

వెనిజులాపై ఆంక్షలు విధించినప్పుడు అధ్యక్షుడు నికోలస్ మదురో ట్రంప్ చర్యను "యుద్ధో న్మాద బెదిరింపు"గా అభివర్ణించారు. "సామ్రాజ్య వాదం, ఫాసిస్ట్ శక్తులు మా మాతృభూమి సంపదను దొంగిలించడానికి వెనిజులాను వలసరాజ్యం చేయాలని చూస్తున్నాయి" అని ఆయన అన్నారు. మరోవైపు వెనిజులా చమురుపై ఆధారపడిన సోషలిస్ట్ దేశం క్యూబాపై కూడా ఈ దిగ్బంధనం ప్రభావం చూపుతుంది.

అమెరికా ఆరు దశాబ్దాలుగా విధించిన ఆర్థిక దిగ్బంధనం కారణంగా ఇప్పటికే క్యూబా ఆర్థిక వ్యవస్థ కుదేలవుతోంది.

అమెరికా కాంగ్రెస్‌లో వ్యతిరేకత

ట్రంప్ ప్రణాళికలను అమెరికా కాంగ్రెస్‌లో పలువురు వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్ సభ్యుడు (డి-టెక్సాస్) జోక్విన్ కాస్ట్రో ఈ దిగ్బంధనాన్ని "ప్రశ్నించలేని యుద్ధ చర్య"గా పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారం ఇవ్వని యుద్ధాన్ని అమెరికన్ ప్రజలు కోరుకోవడం లేదని ఆయన ఇటీవలే అన్నారు. కాంగ్రెస్ అనుమతి లేకుండా ట్రంప్ ప్రత్యక్ష సైనిక చర్య తీసుకోకుండా నిరోధించేందుకు 'వెనిజులా యుద్ధ అధికారాల తీర్మానం'పై ఓటు వేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. కమ్యూనిస్ట్ పార్టీ యూఎస్ఎ (సిపియుఎస్ఎ) కూడా ఈ తీర్మానాలకు మద్దతు తెలిపింది. "చమురు కోసం జరిగే అంతులేని యుద్ధాన్ని 70 శాతం మంది వ్యతిరేకిస్తున్నారు. ఇది యూఎస్‌కు, ప్రపంచానికి ప్రమాదకరం" అని సిపియుఎస్ఎ పేర్కొంది. 2003లో ఇరాక్‌పై దాడికి ముందు జరిగిన పరిణామాలకు, ప్రస్తుత పరిస్థితికి మధ్య సారూప్యతలు ఉన్నాయని, కార్పొరేట్ గుత్తాధిపత్యం, సామ్రాజ్యవాద ఆధిపత్యం కోసం ట్రంప్ ప్రారంభించిన యుద్ధాన్ని నిరోధించడానికి విస్తృత స్థాయిలో ఉద్యమం అవసరమని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇది..అమానుష ధోరణి !

- ట్రంప్ చర్య సమర్థనీయం కాదు
- తీవ్రంగా ఖండించిన పలు దేశాలు
- సంయమనం అవశ్యం
- మదురో ఆచూకీపై వివరణ ఇవ్వాలని డిమాండ్

కారకస్, వాషింగ్టన్ : వెనిజులాపై అమెరికా దాడులను అంతర్జాతీయంగా పలు దేశాలు ఖండించాయి. ఆర్థిక ప్రయోజనాలే పరమావధిగా ట్రంప్ సాగించిన ఈ దుర్మార్గపు చర్యను తీవ్రంగా నిరసించాయి. ఈ దాడులను ఖండించిన దేశాల్లో రష్యా, బ్రెజిల్, మెక్సికో, క్యూబా, యురోపియన్ యూనియన్, బెల్జియం, ఇటలీ, స్పెయిన్, కొలంబియా, దక్షిణ కొరియా సహా పలు దేశాలు వున్నాయి. మదురో ఆచూకీపై తక్షణమే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశాయి.

సహజ వనరులపై పెత్తనం కోసమే : రష్యా

వెనిజులాపై అమెరికా చర్యను 'సాయుధ దురాక్రమణ' గా రష్యా విదేశాంగ శాఖ పేర్కొంది. రష్యా ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. పైగా దౌత్యంపై 'సైద్ధాంతిక శతృత్వం' పై చేయి సాధించిందని వ్యాఖ్యానించింది. మదురో ఆచూకీపై తక్షణమే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. సంయమనం పాటించాలని కోరింది. వెనిజులా సహజ వనరులపై ఆధిపత్యం కోసమే అమెరికా ఇదంతా చేస్తోందని విదేశాంగ మంత్రి యూరి గగారిన్ విమర్శించారు. వెనిజులా ప్రజలకు తమ సంపూర్ణ సంఘీభావం వుంటుందని పునరుద్ఘాటించింది. తక్షణమే భద్రతా మండలి సమావేశం జరపాలని డిమాండ్ చేసింది. విదేశీ జోక్యం లేకుండా తన భవిష్యత్ తామే నిర్ణయించుకునే స్వేచ్ఛ వెనిజులాకు ఇవ్వాలని స్పష్టం చేసింది.

లక్ష్మణ రేఖను అమెరికా దాటింది : బ్రెజిల్

పొరుగు దేశమైన వెనిజులాపై దాడులను బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డిసిల్వా తీవ్రంగా ఖండించారు. అధ్యక్షుడు మదురు దంపతులను తన కస్టడీలోకి తీసుకోవడం ద్వారా ఆమోదయోగ్యం కాని రేఖను దాటారని వ్యాఖ్యానించారు. ఈ చర్యలు వెనిజులా సార్వభౌమాధికారంపై దాడులని అన్నారు. అంతర్జాతీయ సమాజంలో ఇదొక దారుణమైన, ప్రమాదకరమైన ధోరణి అని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్టు పెట్టారు. వెనిజులాలో సాయుధ సైనిక జోక్యం వల్ల మావన విపత్తు సంభవిస్తుందని గతంలో కూడా లూలా హెచ్చరించారు.

ఉగ్రవాద చర్య : క్యూబా నిరసన

వెనిజులా గడ్డపై అమెరికా సాగించిన దాడి ఉగ్రవాద చర్య అని క్యూబా విమర్శించింది. అత్యంత నేరపూరితమైన చర్య అని పేర్కొంది. తక్షణమే అంతర్జాతీయ సమాజం ఈ పరిణామాలపై తీవ్రంగా స్పందించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు క్యూబా అధ్యక్ష భవనం ఒక ప్రకటన విడుదల చేసింది. వెనిజులా ప్రజలపై అమెరికా ఉగ్రవాద చర్యలకు పాల్పడిందని విమర్శించింది. శాంతియుత దేశంపై దారుణంగా దాడి చేసిందని నిరసించింది.

ఉగ్రవాద చర్య !

- దాడులను ఖండించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి

న్యూఢిల్లీ : వెనిజులాపై అమెరికా బాంబు దాడులు, అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన భార్యను కిడ్నాప్ చేయడాన్ని 'ఉగ్రవాద చర్య'గా సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ అభివర్ణించారు. ఇదంతా అంతర్జాతీయ చట్టాన్ని దారుణంగా ఉల్లంఘించడమేనన్నారు. "వెనిజులాపై బాంబు దాడులు అమెరికా నేతృత్వంలో సామ్రాజ్యవాదం సాగించిన అంతర్జాతీయ ఉగ్రవాద చర్య. అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశామని ట్రంప్ స్వయంగా చెబుతున్నారు. అదేగనుక నిజమైతే, అంతర్జాతీయ చట్టాన్ని అత్యంత దారుణంగా ఉల్లంఘించడమే.

శాంతి అధ్యక్షుడినని ట్రంప్ చెప్పుకుంటున్న మాటల్లోని డొల్లతనాన్ని ఇది బయటపెడుతోంది. అత్యంత హేయమైన అమెరికా సైనికోన్మాదపు ముఖాన్ని మొత్తంగా ప్రపంచానికి చూపెట్టింది." అని బేబీ పేర్కొన్నారు. ఈ తరుణంలో "వెనిజులా ప్రజలకు సంఘీభావంగా నిలుస్తామని చెప్పారు. ఈ చర్యలను ఖండిస్తూ నిరసనలు నిర్వహించాల్సిందిగా పార్టీ సభ్యులకు, కార్యర్తలకు సిపిఎం పిలుపునిస్తోందని చెప్పారు. వెనిజులాపై అత్యంత దారుణమైన ఈ దురాక్రమణ చర్యలను నిలువరించేలా అంతర్జాతీయ సమాజం ఒత్తిడిని పెంచాలన్నారు. భద్రతా మండలి తక్షణమే సమావేశమై ఈ చర్యలను ఖండించాలన్నారు.

అధిగమిస్తాం : వెనిజులా హోం మంత్రి

ప్రస్తుతం నెలకొన్న ఈ కల్లోల పరిస్థితుల్లో నాయకత్వంపై నమ్మకముంచాలని వెనిజులా హోంమంత్రి దియోస్‌డయో సెబెల్లో కోరారు. కచ్చితంగా ఈ దాడులను అధిగమిస్తామని ఆయన ప్రజలకు హామీనిచ్చారు. మన ప్రజలపై ఇదేమీ మొదటి యుద్ధం కాదు, అనేక పరిస్థితుల్లో అనేక దాడులను ఎదుర్కొన్నాం, వాటన్నింటినీ మనం సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. ఇప్పుడు దీన్నుండి కూడా బయటపడతామని అన్నారు.

అమెరికా దాడి దుర్మార్గం : పినరయి విజయన్

తిరువనంతపురం : వెనిజులాపై అమెరికా బాంబుదాడులు చేయడం దుర్మార్గమని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. ఇది బహిరంగ సామ్రాజ్యవాద దురాక్రమణ దాడి అని ఖండించారు. దుష్టరాజ్యాధినేత ట్రంప్ చేసిన దుర్మార్గ చర్యగా అభివర్ణించారు.. గ్లోబల్ సౌత్‌లో తన ఆదిపత్యం కొనసాగించడం కోసం, మోసపూరిత వ్యూహాలు అమలు చేయడాని సామ్రాజ్యవాదం తన ముసుగు తీసేసిందన్నారు. దీంతో లాటిన్ అమెరికాలో అశాంతి చెలరేగుతుందని, అమెరికా చేసింది ఉగ్రవాద చర్య అని అన్నారు. లాటిన్ అమెరికా తన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల వారసత్వం కొనసాగిస్తుందన్నారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే సామ్రాజ్యవాద చర్యలను ప్రతిఘటించడానికి ఐక్యం కావాలని విజయన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శనివారం పిలుపునిచ్చారు.

ప్రమాదంలో ప్రాంతీయ సుస్థిరత : మెక్సికో

వెనిజులాపై దాడులను మెక్సికో వామపక్ష ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఏ రూపంలోనైనా సైనికచర్య అనేది ప్రాంతీయ సుస్థిరతను తీవ్రంగా ప్రమాదంలోకి నెడుతుందని హెచ్చరించారు. అమెరికా సాయుధ బలగాలు ఏకపక్షంగా సాగించిన దమనకాండను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

సమర్థనీయం కాదు : ఫ్రాన్స్

మదురోను బంధించేందుకు అమెరికా చేపట్టిన సైనిక చర్య అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని ఫ్రాన్స్ వ్యాఖ్యానించింది. ఒక సార్వభౌమత్వం కలిగిన దేశాధ్యక్షుడిని తొలగించేందుకు బయట నుంచి ఇలా బల ప్రయోగం చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని పేర్కొంది. వెనిజులా భవిష్యత్తును ఆ దేశ ప్రజలే నిర్ణయించుకోవాలి తప్ప బయట నుంచి కాదని ఫ్రాన్స్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

శాంతియుత, ప్రజాస్వామ్య పరిష్కారం : ఇయు

వెనిజులాలో ఉద్రిక్తతలు పెచ్చరిల్లకుండా సంయమనం పాటించాలని యురోపియన్ యూనియన్ కోరింది. ఆ దేశంలో శాంతియుత, ప్రజాస్వామ్య పరిష్కారానికి తాము మద్దతిస్తామని యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటానియో కోస్టా చెప్పారు. ఈ తరుణంలో సంయమనం అత్యంత అవసరమని ఇయు దౌత్యవేత్త ఖాజా కల్లాస్ శనివారం వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితులకు సంబంధించి అంతర్జాతీయ చట్టాన్ని, ఐక్యరాజ్య సమితి నిబంధనావళిని గౌరవించాలని కోరారు.

బ్రిటన్ వామపక్షాల ఖండన

వెనిజులాపై అమెరికా దూకుడును బ్రిటన్‌లోని వామపక్ష భావజాల పార్టీలైన లిబరల్ డెమోక్రాట్లు, గ్రీన్ పార్టీస్ నేతలు ఖండించారు. అమెరికా చర్యలు పూర్తి చట్టవిరుద్ధమైనవని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ చట్టం, నిబంధనలను పూర్తి స్థాయిలో గౌరవించాలని డిమాండ్ చేశారు.

ఏం జరిగిందో తెలుసుకోవాలన్న బ్రిటన్ ప్రధాని

అమెరికా దాడులను బ్రిటన్ ఖండించిందా అని ప్రశ్నించగా తాను ఖండించడానికి ముందుగా అక్కడ అసలు ఏం జరిగిందో తెలుసుకోవాలనుకుంటు న్నానని బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ చెప్పారు.

ఉమర్ ఖలీద్, ఇతరుల బెయిల్‌పై 5న సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ : ఎలాంటి విచారణ లేకుండా ఐదేళ్లుగా జైలులో మగ్గుతున్న జెఎన్‌యు విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్, ఇతరుల బెయిల్ పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ నెల 5న తీర్పు చెప్పనుంది. ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించడంతో ఖలీద్‌తోపాటు పలువురు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్లపై జస్టిస్ అరవింద్ కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం డిసెంబర్‌లో విచారణ జరిపి, తీర్పును రిజర్వ్ చేసింది. పిటిషన్లు దాఖలు చేసిన వారిలో గుల్ఫిషా ఫాతిమా, షార్జిల్ ఇమాన్, మీరాన్ హైదర్, షిఫా ఉర్ రెహమాన్, మొహమ్మద్ సలీమ్‌ఖాన్, షాదాబ్ అహ్మద్ ఉన్నారు. సాక్ష్యాలను తప్పుగా సృష్టించడం ద్వారా దర్యాప్తు సంస్థలు చట్టపరమైన పాలనపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. ఖలీద్ తదితరులకు బెయిల్ మంజూరు చేయాలని, అంతర్జాతీయ చట్ట నిబంధనలకు అనుగుణంగా స్వేచ్ఛగా, సక్రమంగా విచారణ జరిగేలా చూడాలని ఎనిమిదిమంది అమెరికా పార్లమెంట్ సభ్యులు భారత్‌ను కోరుతూ లేఖ రాసిన సంగతి తెలిసిందే.

నేడు మహా ప్రదర్శన, బహిరంగ సభ

(మొదటిపేజి తరువాయి)

హనుమంతువాక, మద్దిలపాలెం, ఆర్‌టిసి కాంప్లెక్స్, ఆశీలుమెట్ట జంక్షన్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలి. లేదా వేపగుంట, గోపాలపట్నం, ఎన్ఎడి, కంచరపాలెం, కాన్వెంట్ జంక్షన్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలి. రైల్వే స్టేషన్ నుంచి వచ్చే ప్రదర్శకులు ఆర్‌టిసి బస్సులోగానీ, ఆటోద్వారాగానీ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలి. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శకులకు దించిన వెంటనే ప్రతి వాహనం డాబాగార్డెన్స్, సరస్వతీ పార్కు, డాల్ఫిన్ హోటల్, రామకృష్ణ జంక్షన్ మీదుగా మున్సిపల్ స్టేడియం పోర్టు రోడ్డుకు చేరుకుని అక్కడ పార్కింగ్ చేయాలి.

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ రక్తపాతం

- రెండు ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మృతి
- సుక్మాలో 12 మంది, బీజాపూర్‌లో ఇద్దరు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్ అడవులు మళ్లీ తుపాకుల మోతతో దద్దరిల్లాయి. సుక్మా, బీజాపూర్ జిల్లాల్లోని పచ్చని అడవులు రక్తమోడాయి. రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశాల నుంచి భారీగా ఆయుధాలు లభించాయి. ఈ ఏడాదిలో జరిగిన మొదటి భారీ మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ ఇదేనని అధికారులు చెప్పారు.

పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బీజాపూర్‌లోని బసగూడ - తర్రెం అటవీ ప్రాంతం, సుక్మాలోని కొంతా - కిష్టారమ్ అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు దాగి ఉన్నారన్న సమాచారం నిఘా వర్గాల ద్వారా అందింది. అనంతరం జిల్లా రిజర్వ్ గార్డు (డిఆర్‌జి) బృందాలు శనివారం ఉదయం వేర్వేరుగా తమ పరిధిలోని ప్రాంతాల్లో సోదాలు జరిపాయి. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో 14 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. సుక్మా ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుంచి 12 మంది మావోయిస్టు మృతదేహాలను, బీజాపూర్ నుంచి ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ ఐజి సుందర్రాయ్ పట్టిలింగం చెప్పారు. ఘటన ప్రదేశాల నుంచి ఒక ఏకే-47, ఇన్సాస్ రైఫిల్, సెల్ఫ్-లోడింగ్ రైఫిల్, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎన్‌కౌంటర్ జరిగిన రెండు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా ఆపరేషన్ వివరాలను మాత్రం వెల్లడించలేదు. పూర్తి వివరాలను ఆపరేషన్ ముగిశాక చెప్తామని వివరించారు. ఇక ఈ ఎన్‌కౌంటర్‌లో భద్రతా సిబ్బందికి ఏమైనా గాయాలయ్యాయా అన్నదానిపై ఎలాంటి సమాచారమూ లేదు. దీని గురించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

256 మంది మావోయిస్టులు మృతి.. 1650 మంది లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో సుక్మా, బీజాపూర్ జిల్లాలు అత్యంత మావోయిస్టు ప్రభావిత జిల్లాలుగా ఉన్నాయి. దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో ఒకప్పుడు వీటిని మావోయిస్టులకు కంచుకోటగా పిలిచేవారు. ఇప్పుడు అవే జిల్లాల్లో ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవడం, మావోయిస్టులు తమ ప్రాణాలను కోల్పోతుండటం గత కొన్ని నెలలుగా జరుగుతున్నది. ముఖ్యంగా 2025లో బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు పెద్దదెబ్బే తగిలిందని అధికారులు అంటున్నారు. ఇక్కడ దాదాపు 256 మంది మావోయిస్టులు మృతిచెందగా, దాదాపు 1650 మంది లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిపోయారని వారు గుర్తు చేస్తున్నారు. దేశంలో మావోయిస్టులను లేకుండా చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని మోడీ సర్కారు నిర్ణయించుకున్నది. ఇందుకోసం ఈ ఏడాది మార్చి 31ని డెడ్‌లైన్‌గా నిర్దేశించుకున్నది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పలు సందర్భాలలో పదేపదే ఇదే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఇందుకోసం ఆపరేషన్ కగార్‌తో అడవులను జల్లెడపడుతూ మావోయిస్టులపై హత్యాకాండకు పాల్పడుతోంది.

గుజరాత్‌లో టైఫాయిడ్ కలకలం

- చిన్నారులతో సహా వందమంది ఆసుపత్రి పాలు

గాంధీనగర్ : బిజెపి పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ప్రభుత్వం సరఫరా చేసిన కలుషిత నీరు తాగి చిన్నారితో సహా 15 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన మరువకముందే ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్ గాంధీనగర్‌లో టైఫాయిడ్ కలకలం రేపింది. చిన్నారులుసహా వందమందికిపైగా అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజులుగా సివిల్ ఆస్పత్రిలోని పీడియాట్రిక్ వార్డులో టైఫాయిడ్ కేసులు పెరుగుతున్నాయి. శనివారం గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పరిస్థితిని అంచనావేయాలని ఆదేశించామన్నారు.

దురాక్రమణ దాడి ఆపండి

(మొదటిపేజి తరువాయి)

ఒక తీర్మానాన్ని ఆమోదించాలని పొలిట్‌బ్యూరో కోరింది. వెనిజులాపై అమెరికా దురాక్రమణను తక్షణమే నిలిపివేసేలా అంతర్జాతీయంగా ఒత్తిడి తీసుకురావాలని కోరింది.

నిరసనలు చేపట్టండి

వెనిజులాపై అమెరికా దాడి, దురాక్రమణ చర్యలను ఖండిస్తూ నిరసనల్లో పాల్గొనాల్సిందిగా దేశ ప్రజలకు సిపిఎం పొలిట్‌బ్యూరో పిలుపునిచ్చింది. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోర్స్‌ల ఆచూకీ గురించి తక్షణమే వెల్లడించాలని డిమాండ్ చేసింది. వారు జీవించే వున్నట్లు ఆధారాలు చూపించాలని, అలాగే ఐక్యరాజ్య సమితి నిబంధనావళికి గట్టిగా కట్టుబడాలని అమెరికాను డిమాండ్ చేస్తూ భారత ప్రభుత్వం గట్టిగా తన వాణిని వినిపించాలని కోరింది.

'విబి జి ఆర్ఎంఎం జి'తో ఉపాధికి హామీ లేదు

(మొదటిపేజి తరువాయి)

రాష్ట్రం భరించాల్సి వస్తుందని తెలిపింది. కొత్త చట్టంతో రాష్ట్రంపై భారం ఇంకా పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. మొత్తం వ్యయంతో కేంద్రం 60 శాతం వాటా భరిస్తుందని చట్టబద్ధమైన హామీ లేదని తెలిపింది.

వేతనదారుల ఆర్థిక పరిస్థితిపై ప్రభావం

'ఉపాధి' చట్టంలో వ్యవసాయ సీజన్‌లో ఉపాధి పనులు కల్పించకూడదనే చట్టపరమైన నిషేధం లేదని, కొత్త చట్టంలో ఈ సీజన్‌లో 60 రోజుల పాటు చట్టబద్ధంగా ఉపాధి పనులను నిలిపివేసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఏడాది పొడవునా ఉపాధి హామీ అనే భావన బలహీనపడుతుందని, మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ పనులు ఒకే సమయంలో వచ్చే అవకాశం లేదని, ప్రాంతాల మధ్య వ్యత్యాసాల వల్ల పంట కాలల్లో తేడాలు ఉంటాయని పేర్కొంది. విబి జి ఆర్ఎంఎం జి చట్టంలో వేతనదారుల గుర్తింపు, హాజరు, పర్యవేక్షణ, వేతనాల చెల్లింపు అన్నింటికీ డిజిటల్ సాంకేతికతను తప్పనిసరి చేసిందని, దీనివల్ల వేతనదారులు ప్రభావం అధికంగా ఉంటుందని పేర్కొంది. రాష్ట్రంలో ఆధార్ ఆధారిత చెల్లింపుల కారణంగా 78 లక్షల కార్మికుల పేర్లు 2022-23 మధ్య తొలగించబడ్డాయని, తాజాగా ఇకెవైసి కారణంగా ఒకే నెలలో 16 లక్షల మందిని తొలగించినట్లు వెల్లడించింది. ఫలితంగా వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, ఆదివాసీలు, అణగారిన వర్గాలు ఎక్కువగా నష్టపోతారని పేర్కొంది.

సిఫార్సులు ఇవి..

విబి జి ఆర్ఎంఎం జితో రాష్ట్రంపై పడే ప్రభావాన్ని అంచనా వేసిన లిబ్ టెక్ సంస్థ ప్రభుత్వాలకు కొన్ని సిఫార్సులు చేసింది. వాటిలో గ్రామ సభల్లో కొత్త చట్టానికి సంబంధించి సమగ్ర సమాచారాన్ని ప్రజలకు పూర్తి స్థాయిలో అందించాలని సూచించింది. గ్రామ సభల్లో చర్చలు అర్థవంతంగా, పారదర్శకంగా, పూర్తి అవగాహనతో జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరింది. విబి జి ఆర్ఎంఎం జితో రాష్ట్రంలో ఉపాధి భద్రతపై కలిగే ప్రభావాలను ప్రభుత్వం తక్షణమే సమీక్షించాలని సూచించింది. ఈ చట్టం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కలిగే ప్రభావాలను సమగ్రంగా పరిశీలించడానికి రాష్ట్ర శాసన సభ ప్రత్యేక చర్చ జరపాలని సూచించింది. సమీక్షల అనంతరం రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించాలని, కొత్త చట్టంలో ఫ్రేమ్ వర్క్‌ను పున్ణపరిశీలించాలని కోరడంతోపాటు, ఎంఎన్‌ఆర్ఇజిఎలో ఉన్న ఉపాధి హామీ, హక్కు ఆధారిత స్వభావాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేయాలని సూచించింది.

తిక్క శంకరయ్య

శంకరయ్యకు తిక్కతో పాటు మతిమరుపు కూడా ఎక్కువ. ఒకసారి పనిమీద పట్టణం వెళ్లాడు. అత్తవారి ఊరు దాటి వెళ్ళాలి. తిరిగి వచ్చేటప్పటికి మధ్యాహ్నం అయింది. అత్తవారింటికి వెళ్ళాడు. అల్లుడు వచ్చినందుకు అత్త చాలా సంతోషపడి అతనికి కుడుములు, నాటుకోడి ఇగురు కూర చేసి పెట్టింది. కుడుములు ఇగురులో ముంచుకొని తింటే చాలా రుచిగా ఉండడంతో శంకరయ్య 10,15 కుడుములు తిన్నాడు. ఇంటికి వెళ్లాక తన భార్యతో కూడా అవి తయారు చేయించాలనుకున్నాడు.

ఇంటికి వెళుతూ వెళుతూ 'అత్తా! నువ్వు ఏ వంట వండావు? ఇవి చాలా రుచిగా ఉన్నాయి. మీ కూతురుతో కూడా చేయించుకుంటాను. చెప్పవా?' అని అడిగాడు. అప్పుడు అత్త 'వీటిని కుడుములు అంటారు' అని చెప్పింది. అయితే శంకరయ్య వాటి పేరు మర్చిపోతానేమో అనుకుని, దారివెంట 'కుడుములు, కుడుములు' అనుకుంటూ నడవసాగాడు. అలా చాలా దూరం నడిచాడు.

కొంతదూరం వెళ్ళాక ఇజ్జిపేట గెడ్డ అడ్డం వచ్చింది. అప్పటిదాకా 'కుడుములు...కుడుములు' అంటున్న శంకరయ్య కాలువ ఇవతలి గట్టు నుండి అవతలి గట్టుకు దూకుతూ 'అద్దిరబన్నా!' అన్నాడు. అంతే అప్పటి నుండి కుడుముల పేరు మరిచిపోయి 'అద్దిరబన్నా, అద్దిరబన్నా' అనుకుంటూ ఇంటికి వెళ్ళాడు.

ఇంటికి వెళ్ళగానే భార్యను పిలిచి 'ఇవాళ మీ అమ్మ నాకు అద్దిరబన్నాలు చేసి పెట్టింది. అవి చాలా బాగున్నాయి. నువ్వు కూడా తయారు చెయ్యి' అన్నాడు. 'అద్దిరబన్నాలు ఏమిటీ? అలాంటి వంటకం గురించి నేనెప్పుడూ వినలేదు. నేను చేయలేను' అంది. దాంతో శంకరయ్యకి కోపం వచ్చింది. భార్య మీద గట్టిగట్టిగా అరవడం మొదలుపెట్టాడు. చుట్టుపక్కల వాళ్ళందరూ ఏం జరిగిందోనని పరుగెత్తుకుంటూ వచ్చారు. వారిలో ఒకావిడ 'నీకేం పోయేకాలం వచ్చిందయ్యా. అమ్మాయి మీద అంతలా అరుస్తున్నావు. ఏడవటం వల్ల తన కళ్లు చూడు కుడుములా ఎలా వాచి పోయాయో' అంది.

ఆ మాటలు వినగానే శంకరయ్య ఆనందంగా 'ఆ అవును అవే! అవే! కుడుములు.. కుడుములు. అవే నేను వండమనేది' అని అరిచాడు. అందరికీ విషయం అర్థమయ్యింది. పెళ్ళాం కళ్ళు తుడుచుకొని 'కుడుములు అంటే చేయనా నీతో ఇన్ని తిట్టులు తింటానా చెప్పు' అంటూ కళ్ళు తుడుచుకొని మినపప్పు నాన బెట్టింది. అంతా శంకరయ్య మతిమరుపుకు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకున్నారు.

– వల్లూరు దాలినాయుడు,
గ్రేడ్ 1 తెలుగు భాషా పండితులు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొగిరి గ్రామం,
రాజాం మండలం, విజయనగరం జిల్లా.

నేను గీసిన బొమ్మ

జి. కళ్యాణ్ రాధాకృష్ణ,
10వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
విరుపాపురం గ్రామం,
హాలహర్వి మండలం,
కర్నూలు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సూక్ష్మ చిత్రకళతో అద్భుత రూపాలు

కుక్కపిల్ల.. సబ్బుబిళ్ల.. కాదేదీ కవితకు అనర్హం అన్న శ్రీశ్రీ మాటలు ఆమె సూక్ష్మకళారూపంలో ప్రతిబింబిస్తాయి. బాదంపప్పుపై భారతదేశం, జీడిపప్పుపై జాతీయజెండా.. విత్తనాలపై విస్మయపర్చే విన్యాసాలు.. వందలాది పదార్థాల ఎంపిక.. ఇలా 250కు పైగా కళాకృతులు సృష్టించారామె. 70 పప్పులపై 70 మంది స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు రాశారు. పుచ్చగింజను త్రివర్ణ పతాకంగా చెక్కారు. మందుబిళ్ల.. జొన్నగింజ, జమ్మి ఆకు కాదేది కళకు అనర్హమంటారామె. ఈ సూక్ష్మచిత్ర అద్భుత చిత్రకారిణి పేరు నడుకుదిటి సుజాత.

తెలంగాణ రాష్ట్రం బోనకల్లు మండలం పాలడుగు గ్రామానికి చెందిన సైకం అంకరాజు, ధనలక్ష్మి దంపతుల కుమార్తె నడుకుదిటి సుజాత. ఆమె భర్త నడకుదురు ఆదిశేషవర్మ రవాణాశాఖలో ఇన్‌స్పెక్టర్. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురులో ప్రస్తుతం నివాసం ఉంటున్నారు. సుజాతకు చిన్నప్పటి నుంచి కళలంటే ఇష్టం. కోలాటం అలవోకగా ఎంతో చక్కగా చేస్తుంటారు. ఏదో సరదాగా చేసిన చిన్నపాటి పెయింట్ ఆ తర్వాత దానిని అభివృద్ధి చేసుకోగా, అద్భుత కళాకారుణిగా నేడు ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందారు. జాతీయజెండాలు, వందమాతరం సందేశాలు, జాతీయ నేతల ఫొటోలను వివిధ పదార్థాలతో ఆమె సూక్ష్మకళతో తీర్చిదిద్దుతున్నారు. అత్యద్భుత కళాకృతులను చిత్రీకరించి అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు.



ఏకాగ్రతతో ఊపిరి బిగబట్టడం

మైక్రోఆర్ట్స్ కళ గురించి తెలుసుకుంటూ తాను కూడా అందులో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని భావించి కృషిని కొనసాగిస్తున్నారు

సుజాత. స్వాతంత్ర్య దినోత్సవం, వివిధ పండుగలు, క్రికెట్ మ్యాచ్‌లు ఇలా సందర్భాన్ని బట్టి కోడిగుడ్లపై బొమ్మలు గీస్తూ వస్తున్నారు. గత పదేళ్లుగా ఆమె ఈ సూక్ష్మకళను కొనసాగిస్తున్నారు. సూక్ష్మవస్తువులపై కళను చిత్రీకరించేటప్పుడు ఊపిరి ఆపుకోవాలి. పీల్చాలనుకున్నప్పుడు కళను ఆపేయటం చేయాలి. ఇది చాలా ఏకాగ్రతతో కూడుకున్న పని. అలాంటిది ఆమె పుచ్చకాయ, కొబ్బరిబోండాం, కొబ్బరికాయ, కురిడీకాయ, కోడిగుడ్లు, బల్లిగుడ్లు, సేమియా, మందుబిళ్ల, అనేక రకాలైన కూరగాయల గింజలు, జొన్నలు, గసగసాలు, సజ్జలు, కొర్రలు, పుట్నాల పప్పు, ఉసిరి, జమ్మి ఆకు వంటిపై పలు రకాల ఆకృతులను తీర్చిదిద్దారు. పుచ్చకాయలో మూడు రంగులను జెండాలాగా చెక్కారు. ఒక్కొక్క పళ్ళు కుట్టుకునే పుల్ల (టూత్‌పిక్)పై వందేమాతరం, జనగణమన, మా తెలుగుతల్లికి మల్లె పూదండ, దాశరథి గారి 'ఆ చల్లని సముద్ర గర్భం' పాటలు రాశారు. 70వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 70 పుట్నాల పప్పులపై 70 మంది స్వాతంత్య సమరయోధుల పేర్లు రాసి 70 ఆకారంగా అతికించారు.

దేశభక్తికి ప్రతిరూపం

స్వయంశక్తితోనే...

సూక్ష్మకళ కోసం నేనేమీ శిక్షణ తీసుకోలేదు. సమాజంలో కొంతమంది ఈ కళలో రాణిస్తున్నారని తెలుసుకున్నా. నేను కూడా ఏదో ఒకటి చేయాలని ప్రయత్నించా. గత పదేళ్లుగా ఇదే కృషిని కొనసాగిస్తున్నా. దేశం కోసం, సమాజం కోసం పనిచేసే ప్రముఖుల ఆకృతులను తీర్చిదిద్దుతున్నా. జాతీయ జెండా, వందేమాతరం గొప్పతనాన్ని సూక్ష్మకళ ద్వారా ప్రపంచానికి తెలియజేస్తున్నా. ఈ కృషిలో నా కుటుంబ సభ్యుల నుంచి మంచి ప్రోత్సాహం, సహకారం ఎంతో ఎంతో ఉంది.

– నడుకుదిటి సుజాత, సూక్ష్మకళాకారిణి, యనమలకుదురు

76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 76 రకాల విత్తనాలను సేకరించి వాటిపై భారతదేశ పటాన్ని చిత్రించారు. పనస, బాదం, జీడిపప్పు. కరక్కాయ వంటి పెద్ద గింజలతో పాటు నువ్వులు, సజ్జలు, రాగులు, గసగసాలు లాంటి చిన్న గింజలతో భారతదేశ పటాన్ని తయారుచేసి సృజనాత్మకతను చాటుకున్నారు. మన జాతీయ జెండాలోని మూడు రంగులను పుచ్చకాయలో ఆవిష్కరించారు. ఏటేటా స్వాతంత్ర్య దినోత్సవం నాడు చార్టులపైనా, చిన్నవస్తువులపైన భారతీయ చిత్రపటాన్ని గీసి దేశ గొప్పతనాన్ని తెలుపుతుంటారు.

అలాగే వివిధ క్రికెట్ పోటీల్లో పాల్గొనే భారత్ జట్టుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తూ కోడిగుడ్డుపై శుభాకాంక్షలు తెలియజేస్తుంటారు. మనదేశానికి చెందిన క్రీడాకారులు ఏ క్రీడలో విజయం సాధించినా ఆమె ఇలాంటి కృషినే కొనసాగిస్తుంటారు.

పాత నాణేల సేకరణ

పాత నాణేలనే సేకరించటం సుజాత మరొక హాబీ. కరెన్సీ నోట్లపై ఉన్న నంబర్లలో బంధువులు, స్నేహితుల పుట్టినరోజు, పెళ్లిరోజులను గుర్తించి వాటిని బహుమతిగా ఇస్తుంటారు. కుటుంబ సభ్యుల సహకారంతో వందలాది దేశ విదేశాలకు చెందిన కరెన్సీనోట్లను సేకరించారు. అంతరించిపోయిన, ప్రస్తుతం వాడుకలో లేని భారత కరెన్సీ నోట్లు ఆమె దగ్గర ఉన్నాయి. రూపాయి నుంచి రెండు వేల రూపాయల నోటు వరకూ ఆమె భద్రపర్చారు. 250 వరకూ అరుదైన నాణేలు ఆమె వద్ద ఉన్నాయి.

ఆమె గీచిన చిత్రాలు, తయారుచేసిన అరుదైన ఆకృతులకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, నోబుల్ వరల్డ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో నోటుదక్కింది. పలు ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు ఆమెను పలు వేదికలపై ఘనంగా సత్కరించాయి.

– యడవల్లి శ్రీనివాసరావు

మా చిరునామా రంగవల్లి
మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com,
వాట్సాప్ : 83329 25496

– ఎం.జయంతిరెడ్డి, శ్రీపురం, వాకాయ, తిరుపతి జిల్లా.

రజనీకాంత్ కొత్త చిత్రం ప్రకటన

రజనీకాంత్ 173వ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ వచ్చింది. కమల్ హాసన్ నిర్మాణ సారథ్యంలో రానున్న ఈ సినిమాని యువ డైరెక్టర్ శిబి చక్రవర్తి తెరకెక్కిస్తున్నారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం ఓ ఫొటోను షేర్ చేసింది. 'ప్రతి హీరోకు ఓ ఫ్యామిలీ ఉంటుంది' అని ఈ ఫొటో కింద రాశారు. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.



9 రోజుల ప్రయాణానికి సిద్ధం

చిరంజీవి నటిస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో చిత్రబృందం వరుసగా ప్రమోషన్స్‌లో పాల్గొంటోంది. జనవరి 04న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ఇటీవలె ప్రకటించింది. తాజాగా ఈ సినిమా విడుదలకు ఇంకా 9 రోజులు ఉందని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో చిరంజీవితో పాటు హర్షవర్ధన్, కేథరిన్, అభినవ్ గోమఠం ఉన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు.



30న మూకీ చిత్రం 'గాంధీ టాక్స్'

విజయ్ సేతుపతి నటించిన మూకీ చిత్రం 'గాంధీ టాక్స్' విడుదలకి సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం టీజర్ విడుదలచేసింది. గాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30న ఈ సినిమాని థియేటర్లలో రిలీజ్ చేస్తున్నారు. విజయ్ సేతుపతి, అదితీ రావు హైదరీ, అరవింద్ స్వామి ఇందులో నటించారు. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు.

కమిటీ కుర్రాళ్లు దర్శకుడి నుంచి మరో చిత్రం

'కమిటీ కుర్రాళ్లు' చిత్రంతో అలరించిన దర్శకుడు యదు వంశీ మరో కథతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ కథను కొత్త నటీనటులతో చేస్తున్నారు. దీనికి సంబంధించి క్యాస్టింగ్ కాల్‌ను టీమ్ ప్రకటించింది.

కొత్త నిర్మాణ సంస్థ ప్రారంభం

తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి మరో కొత్త నిర్మాణ సంస్థ అడుగుపెట్టింది. వినూత్నమైన కథలను, సరికొత్త టాలెంట్‌ను ప్రోత్సహించడమే లక్ష్యంగా నిర్మాత కళ్యాణ్ తాజాగా 'కళ్యాణ్ ఆర్ట్ ప్రొడక్షన్స్' బ్యానర్‌ను ప్రారంభించారు. ప్రస్తుత సినిమా రంగంలో కొత్తవారికి అవకాశాలు రావడం సవాలుగా మారిన తరుణంలో, కేవలం ప్రతిభనే ప్రాతిపదికగా తీసుకుని ఈ సంస్థను స్థాపించినట్లు నిర్మాత తెలిపారు. 'కథే హీరో అనే సిద్ధాంతంతో, సమాజానికి అవసరమైన సమకాలీన అంశాలను, ప్రేక్షకులను అలరించే సరికొత్త కంటెంట్‌ను అందించడమే మా ప్రథమ ప్రాధాన్యత' అని తెలిపారు. 'కొత్త దర్శకులు, నటీనటులు సాంకేతిక నిపుణులకు మా బ్యానర్ సరైన వేదికగా నిలుస్తుంది. ఇప్పటికే కొన్ని ఆసక్తికరమైన కథలు చర్చల దశలో ఉన్నాయి. అన్నీ కుదిరితే సంక్రాంతి పండుగ సందర్భంగా మా మొదటి సినిమా వివరాలను ప్రకటిస్తాం' అని తెలిపారు.

శ్రేయస్, సిరాజ్‌కు పిలుపు

- షమీ, గైక్వాడ్‌లకు నిరాశ..
- న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు జట్టును ప్రకటించిన బిసిసిఐ

ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) సెలెక్షన్ కమిటీ న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు జట్టును ప్రకటించింది. బిసిసిఐ శనివారం ప్రకటించిన మూడు వన్డేల సిరీస్‌లో ఆడే 15మంది ఆటగాళ్ల బృందానికి శుభ్‌మన్ గిల్ సారథ్యం వహించనున్నాడు. రిషబ్ పంత్ స్టాండ్‌బై వికెట్ కీపర్‌గా ఎంపికకాగా.. శ్రేయస్ అయ్యర్ ఫిట్‌నెస్ సాధిస్తే.. జట్టుతో కలవనున్నాడు. దీంతో చాలాకాలం తర్వాత శ్రేయస్ అయ్యర్, మహ్మద్ సిరాజ్‌లకు వన్డేల్లో చోటు దక్కింది. సెలెక్షన్ కమిటీ ప్రకటించిన 15మంది ఆటగాళ్ల జట్టులో వీరిద్దరూ చోటు దక్కించుకోగా.. స్టార్ పేసర్ మహ్మద్ షమీకి మరోసారి నిరాశ తప్పలేదు. శ్రేయస్ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అందుకోవాల్సి ఉండగా.. దీనికి ముందు అతడు విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో బరిలోకి దిగనున్నాడు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లికి చోటు లభించగా.. తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి కూడా వన్డే జట్టులో చోటు సంపాదించాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు విశ్రాంతి తీసుకున్న మహ్మద్ సిరాజ్ తిరిగి జట్టులో చేరాడు. జనవరి 11నుంచి న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. న్యూజిలాండ్‌తో జరిగే ఐదు టి20ల సిరీస్‌కు జట్టును సెలెక్షన్ కమిటీ మరోసారి ప్రకటించనుంది. ఇక యశస్వి జైస్వాల్‌ను బ్యాకప్ ఓపెనర్‌గా చోటు దక్కింది. టి20 ప్రపంచకప్‌లో చోటు దక్కించుకున్న ఇషాన్ కిషన్‌కూ కివీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో చోటు దక్కలేదు. బుమ్రా, ఇషాన్ కిషన్‌లకు కివీస్‌తో జరిగే టి20 సిరీస్‌లో చోటు దక్కే ఛాన్స్ ఉంది. కివీస్‌తో 11న వడోధరలో తొలి వన్డే, 14న రాజ్‌కోట్, 16న ఇండోర్‌లో రెండు, మూడు వన్డేలు జరగనున్నాయి.

షమీకి మళ్లీ నిరాశే...

ఒకప్పుడు భారతజట్టుకు ప్రధాన పేసర్‌గా సేవలందించిన మహ్మద్ షమీకి రోసారి చుక్కెదురైంది. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా వికెట్లు తీస్తూ రాణిస్తున్నా.. కనీసం న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కూ అతడికి చోటు దక్కలేదు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు శనివారం ప్రకటించిన జట్టులో అతడి పేరు లేదు. దీంతో బుమ్రా గైర్హాజరీలో షమీకి చోటు దక్కుతుందని ఆశించిన అభిమానులకు మరోసారి నిరాశే దక్కింది. సెలెక్టర్లు పేసర్ల కోటాలో ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్‌లకు చోటు లభించింది.

వన్డే జట్టు: శుభ్‌మన్ గిల్(కెప్టెన్), శ్రేయస్ అయ్యర్(వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్, సుందర్, జడేజా, సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్, పంత్, నితీశ్ కుమార్, అర్ష్‌దీప్, జైస్వాల్.

పోరాడి ఓడిన ఆంధ్ర

ఛండీగడ్‌పై హైదరాబాద్ గెలుపు • విజయ్ హజారే వన్డే టోర్నీ

బెంగళూరు: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు గుజరాత్‌పై పోరాడి ఓటమిపాలవ్వగా.. హైదరాబాద్ జట్టు 136పరుగుల భారీ తేడాతో ఛండీగడ్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 318పరుగుల భారీస్కోర్‌ను చేసింది. అక్షర్ పటేల్(130), విశాల్ జైస్వాల్(70), రవి బిష్ణోయ్ (31) బ్యాటింగ్‌లో రాణించారు. ఆంధ్ర బౌలర్లు సత్యనారాయణ రాజుకు నాలుగు, ఆంజనేయులు, నితీశ్‌కుమార్ రెడ్డికి రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం ఆంధ్ర బ్యాటర్ జ్ఞానేశ్వర్(102) సెంచరీకి తోడు నాగ వరప్రసాద్(48నాటౌట్), శ్రీకర్ భరత్(39) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. గుజరాత్ బౌలర్లు రవి బిష్ణోయ్‌కు మూడు, అక్షర్ పటేల్, అర్జాన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. దాంతో ఆంధ్ర జట్టు గ్రూప్‌-డిలో వరుసగా మూడో ఓటమిని చవిచూసింది. మంగళవారం జరిగే లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు హర్యానాతో తలపడనుంది.

హైదరాబాద్ భారీ గెలుపు

ఎలైట్ గ్రూప్‌-బిలో హైదరాబాద్ జట్టు 136పరుగుల భారీ తేడాతో ఛండీగడ్‌పై విజయం సాధించింది. తొలుత హైదరాబాద్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 286పరుగుల భారీస్కోర్ నమోదు చేయగా.. ఛేదనలో ఛండీగడ్ 150పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ జట్టులో తిలక్ వర్మ(109) సెంచరీకి తోడు అభిరథ్‌రెడ్డి(71) అర్ధసెంచరీతో రాణించారు. ఇక హైదరాబాద్ బౌలర్లు రక్షన్‌కు మూడు, మిలింద్, నితేశ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తిలక్ వర్మకు లభించింది. మంగళవారం జరిగే లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు బెంగాల్‌తో తలపడనుంది.

ఐపిఎల్ నుంచి ముస్తాఫిజుర్ ఔట్..

- కెకెఆర్ ఫ్రాంచైజీకి ఆదేశాలు జారీచేసిన బిసిసిఐ

ముంబయి: కోల్‌కతా నైట్‌రైడర్(కెకెఆర్) ఫ్రాంచైజీ పేసర్, బంగ్లాదేశ్‌కు చెందిన ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఐపిఎల్ సీజన్‌-2026కు దూరమయ్యాడు. మినీ వేలంలో భారీ ధరకు కెకెఆర్ దక్కించుకున్న ఈ పేసర్‌ను రాబోయే ఐపిఎల్ సీజన్‌కు దూరంగా ఉంచాలని బిసిసిఐ కీలక ఆదేశాలిచ్చింది. బంగ్లాదేశ్‌లో హిందువుల హత్యల నేపథ్యంలో ముస్తాఫిజుర్‌ను సీజన్‌-19 ఐపిఎల్‌లో ఆడించవద్దని కెకెఆర్ ఫ్రాంచైజీకి ఆదేశాలిచ్చింది. ఈ విషయాన్ని బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా.. కెకెఆర్ యజమాని షారుక్ ఖాన్‌కు తెలిపింది. అతని స్థానంలో మరొకరిని తీసుకొనేందుకు అనుమతిస్తున్నట్లు తాజా ప్రకటనలో పేర్కొంది. మినీ వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీ రూ.9.20కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

శశి థరూర్, ప్రియాంక్ ఖర్గే విమర్శలు

క్రీడల్లో మతం రంగు పులుముకుందని, రాబోయే రోజుల్లో హిందూయేతరులకు ఆదరణ ఉన్న క్రీడల్లో చోటు దక్కడం కష్టమేనని కాంగ్రెస్ సీనియర్ నాయకులు శశి థరూర్, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను 2026 ఐపిఎల్‌లో ఆడకుండా అడ్డుకోవడానికి గల కారణాలేమిటో బహిర్గతం చేయాలని శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ముస్తాఫిజుర్ ఒక ముస్లిం అయిన కారణంగానే బిజెపి ప్రభుత్వం బిసిసిఐకి గట్టి ఆదేశాలు జారీ చేసిందన్నారు. అదే ఒక సౌమ్య సర్కార్‌గానీ, లింటన్ దాస్ అయితే ఆ ఫ్రాంచైజీ ఈ నిర్ణయం తీసుకునేదా? అని శశి థరూర్ విమర్శించారు. ఇలాంటి చర్యలు దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తాయని, ఈ వివాదంపై బిసిసిఐ, ఐసిసి కేంద్ర ప్రభుత్వ పాత్రను ప్రశ్నించాలని ఖర్గే ప్రశ్నించారు.

ఫొటో : టి.వి.రమణ

వెనిజులాపై అమెరికా దాడిని ఖండిస్తూ ప్లకార్డులు చూపుతున్న ప్రతినిధులు

ఇది సామ్రాజ్యవాద సైనిక దురాక్రమణే...

• వెనిజులాకు సిఐటియు మహాసభ సంఘీభావం

అనంతవట్టం ఆనందన్ నగర్ నుండి
ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

వెనిజులాపై అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణను సిఐటియు 18వ అఖిల భారత మహాసభ తీవ్రంగా ఖండించింది. వెనిజులాపై అమెరికా బాంబు దాడిని సామ్రాజ్యవాద సైనిక దురాక్రమణగా పేర్కొంది. వెనిజులా ప్రభుత్వం, ప్రజలకు సంఘీభావం తెలుపుతూ మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మేరకు తీర్మానాన్ని సిఐటియు అఖిల భారత కార్యదర్శి సుదీప్ దత్తా సభముందు ప్రతిపాదించగా మీనాక్షి సుందరం బలపర్చారు. అనంతరం ప్రతినిధులు ఏక గ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ప్లకార్డులు చేతబూని తమ స్థానాలలో నిల్చుని వెనిజులాకు సంఘీభావం తెలుపుతూ అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు హోరెత్తించారు. 'వెనిజులా సార్వభౌమత్వంపై అమెరికా దురాక్రమణ అంతర్జాతీయ చట్టం, యుఎన్‌ఓ నిబంధనలు ఉల్లంఘన అని తీర్మానంలో పేర్కొన్నారు. 'వెనిజులా ప్రజలకు స్వయం నిర్ణయాధికారం, ప్రాదేశిక సమగ్రత హక్కు ఉంది. ఏ సామ్రాజ్యవాద శక్తికీ వారి అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి వీలులేదు. 'శాంతి, గౌరవం, సార్వభౌమాధికారం కోసం వెనిజులా ప్రజలు చేస్తున్న పోరాటానికి పూర్తి సంఘీభావం తెలియచేస్తున్నట్లు పేర్కొన్నారు. 'కరేబియన్, అట్లాంటిక్ ప్రాంతాలలో సైనిక ఒత్తిడితో సహా వెనిజులాపై సైనిక దాడులు, బాంబు దాడులను వెంటనే నిలిపివేయాలి. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య పట్టుబడి ఉంటే వారిని వెంటనే విడుదల చేయాలి. వెనిజులా భూ, వాయు, నావికా సరిహద్దుల నుండి అనుమతి లేని అన్ని అమెరికా సైనిక స్థావరాలను బేషరతుగా ఉపసంహరించుకోవాలి.' అని మహాసభ డిమాండ్ చేసింది. 'సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా సూత్రప్రాయమైన వైఖరిని తీసుకోవాలని, అంతర్జాతీయ రంగంలో శాంతియుత సహజీవనం, సార్వభౌమాధికారం, అలీన సూత్రాలను నిలబెట్టాలని మహాసభ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

సుదీప్ దత్తా

పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు క్షీణతపై ఆందోళన

దేశ వ్యాప్తంగా పరిశ్రమలలో ప్రమాదాలు, భద్రత ప్రమాణాలు క్షీణించటం పట్ల సిఐటియు మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు చుక్క రాములు ప్రతిపాదించిన తీర్మానాన్ని పివి అనియన్ బలపర్చారు. మహాసభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది. 'జూన్ 30న తెలంగాణలో సంగారెడ్డిలోని సిగాచి రసాయన కర్మాగారంలో జరిగిన వినాశకర పేలుడు ప్రమాదంలో 50 మందికిపైగా మృతిచెందారు. 8 మంది కార్మికులు గాయాలపాలయ్యారు. మరో 8 మంది ఇప్పటికీ కన్పించకుండా పోయారు. కొందరు గుర్తుపట్టలేనంతగా కాలిపోయారు. ఈ విషాదాన్ని కేవలం ప్రమాదంగా తోసిపుచ్చలేం. నిర్వాహణ నిర్లక్ష్యం, సరైన భద్రతా చర్యలు అమలు చేయడంలో వైఫల్యం కారణంగాఈ సంఘటన జరిగింది.' అని తీర్మానంలో పేర్కొన్నారు. 'పరిశ్రమల్లో సమగ్రమైన భద్రత ఆడిట్లను పారదర్శకతతో నిర్వహించాలి. ప్రమాదాలకు బాధ్యులుగా తేలిన కంపెనీల యజమానులపై విచారణ జరపాలి. బాధితులు, కుటుంబాలకు పరిహారం అ ందజేయాలి. భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలి. ఈ కమిటీలలో కార్మిక సంఘాల ప్రతినిధులకు భాగస్వామ్యం ఉండాలి' అని మహాసభ డిమాండ్ చేసింది.

చుక్కా రాములు

సార్వత్రిక పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి

సీనియర్ సిటిజన్లందరికీ నెలకు రూ.5,000 కంటే తక్కువ లేని సార్వత్రిక పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని సిఐటియు మహాసభ డిమాండ్ చేసింది. ఇపిఎస్-95ను బలోపేతం చేయాలని, ఎన్‌పిఎస్/యుపిఎస్‌లను రద్దు చేయాలని ఒపిఎస్ పునరుద్ధరించాలని, అందరికీ సార్వత్రిక పెన్షన్ అమలు చేయాలనే తీర్మానాన్ని సిఐటియు ఉపాధ్యక్షుడు కరుమలయన్ ప్రతిపాదించగా లలిత్ మిశ్రా బలపర్చారు. అనంతరం మహాసభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది. 'పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి. ప్రభుత్వం ఆర్థిక వృద్ధిని ప్రకటిస్తున్నప్పటికీ, దేశంలోని సీనియర్ సిటిజన్ల జీవన పరిస్థితులు దయనీయంగా ఉనాయి' అని మహాసభ పేర్కొంది. 'జిడిపిలో 50 శాతానికి సమానమైన సంపదను ఉత్పత్తి చేసే అసంఘటిత రంగంలోని లక్షలాది మంది కార్మికులకు పెన్షన్ ప్రయోజనాలు లేవు. మొత్తంమీద, శ్రామిక జనాభాలో చాలా తక్కువ వర్గం మాత్రమే పెన్షన్ పొందుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కేవలం 12 శాతం మంది మాత్రమే వివిధ పెన్షన్ పథకాల పరిధిలోకి వస్తున్నారు. మోడీ ప్రభుత్వం ఇపిఎఫ్ పెన్షన్ పథకాన్ని కూడా నాశనం చేయడానికి ప్రయత్నం చేస్తోంది.' అని తీర్మానం వివరించింది. 'కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారుల నుండి ఎటువంటి సహకారం తీసుకోకుండా రూ.1,000 లేదా అంతకంటే ఎక్కువ వృద్ధాప్య పెన్షన్ అందిస్తున్నాయి. కేరళ ప్రభుత్వం రూ.2000 అందిస్తోంది.' అని పేర్కొన్నారు. రూ.1000 కంటే తక్కువ పెన్షన్లు పొందుతున్న పెన్షనర్లతో సహా సీనియర్ సిటిజన్లు అందరికీ సార్వత్రిక సామాజిక భద్రత కోసం, అందరికీ పెన్షన్ డిమాండ్‌ను సాధించడం కోసం పోరాటాన్ని తీవ్రతరం చేయాలని శ్రామిక ప్రజలకు, పెన్షనర్లకు మహాసభ పిలుపునిచ్చింది.



కరుమలయన్

విద్యుత్ ప్రైవేటీకరణను ప్రతిఘటిస్తాం

విద్యుత్‌ను ప్రైవేటీకరించే దిశలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలను సిఐటియు తీవ్రంగా ఖండించింది. 'విద్యుత్ ప్రైవేటీకరణ, విద్యుత్ బిల్లును వ్యతిరేకిస్తూ దీపా కె. రాజన్ ప్రతిపాదించిన తీర్మానాన్ని శంకర్‌దత్ బలపర్చారు. మహాసభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్పొరేట్ లాభాపేక్షకు విద్యుత్ రంగాన్ని అప్పగించే సవరణ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని మహాసభ డిమాండ్ చేసింది. '1980 నుండి వరుసగా వచ్చిన కేంద్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని క్రమంగా బలపర్చాయి. నయా ఉదారవాద విధానాలను మరింత దూకుడుగా అమలు చేసే క్రమంలో 2003 విద్యుత్ చట్టం మార్కెట్ ఆధారిత సంస్కరణలు, ప్రైవేట్ భాగస్వామ్యం వైపు మార్గాన్ని సుగమం చేసింది. ఆ చట్టం అమల్లోకి వచ్చిన 22 సంవత్సరాల తరువాత విద్యుత్ నష్టాలు 2002లో రూ.1.26 లక్షల కోట్ల నుండి దాదాపు రూ.17 లక్షల కోట్లకు పెరిగాయని ప్రభుత్వం అంగీకరించింది. అయితే ఈ విఫలమైన విధానాలను సమీక్షించే బదులు మోడీ ప్రభుత్వం విద్యుత్ సరవణ బిల్లు -2025తో తన ప్రైవేటీకరణ ఎజెండాను మరింత దూకుడుగా కొనసాగిస్తుంది' అని తీర్మానంలో పేర్కొన్నారు. 'విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడాన్ని వ్యతిరే కించడానికి, ప్రభుత్వ రంగంలో విద్యుత్‌ను పరిరక్షించడానికి జరిగే ఆందోళనలకు సిఐటియు నాయకత్వదం వహిస్తుంది. విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు, కాంట్రాక్టు కార్మికులు, రైతులు, ఇతర వర్గాలను సమీకరించి దేశ వ్యాప్త విద్యుత్ ఉద్యోగల వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేస్తుంది' అని తీర్మానంలో పేర్కొన్నారు.

మత తత్వానికి వ్యతిరేకంగా వర్గ ఐక్యత

మత తత్వానికి వ్యతిరేకంగా వర్గ ఐక్యతను పరిరక్షించాలని మరో తీర్మానంలో సిఐటియు మహాసభ పిలుపునిచ్చింది. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న మతతత్వ దాడి పట్ల మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. ఇది విభజనకరమైన, మతపరమైన ధ్రువీకరణకు దారితీస్తూ కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీస్తోందని పేర్కొంది. దీనిని ఉమేష్ ప్రతిపాదించగా కేలాష్ రోహిత్ బలపర్చారు. అనంతరం మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్పొరేట్లతో కుమ్మక్కైన ఆర్‌ఎస్‌ఎస్, హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా వర్గ ఐక్యతకోసం నిరంతరం పోరాటం చేయాలని ఈ మహాసభ కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది. దేశంలో మైనార్టీలకు వ్యతిరేకంగా 2021-2024ల మధ్య 7,889 దాడులు జరిగాయని, 2014 నుంచి 2025 నవంబరు వరకూ క్రైస్తవులపై హింసకు సంబంధించి 5,048 కేసులు నమోదయ్యాయని పేర్కొంది. ఈ కాలంలో 12 రాష్ట్రాలు మతమార్పిడి నిరోధక చట్టాలను అమలు చేశాయని తీర్మానంలో పేర్కొన్నారు. అన్ని మతతత్వ చర్యలకు వ్యతిరేకంగా వర్గ ఐక్యతతో పోరాటాన్ని తీవ్రతరం చేయాలని, జీవనోపాధి సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చింది. మత తత్వం ఫాసిస్టు హిందూత్వ శక్తులను ఓడించి ఏకాకిని చేయాలని కార్మికులకు సూచించింది.

కేలాష్ రోహిత్

మహిళా కార్మిక సమస్యలపై ముమ్మర కార్యక్రమాలు

మహిళా కార్మిక సమస్యలను సమాజం దృష్టికి తీసుకురావటానికి ప్రచార కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని సిఐటియు నిర్ణయించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కార్మికుల సమస్యలపై రూపొందించిన తీర్మానాన్ని సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి ప్రతిపాదించగా ప్రమోద్ బలపర్చారు. దీనిని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సిఐటియు అన్ని యూనిట్లకు మహాసభ పిలుపునిచ్చింది. మార్చి 1 నుంచి 7 వరకూ వర్కింగ్ ఉమెన్స్ కో ఆర్డినేషన్ కమిటీలతో కలిసి ముఖ్యమైన డిమాండ్లను లేవనెత్తడానికి ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాలని పేర్కొంది. దేశంలో మహిళల పని, జీవన పరిస్థితులపై మహాసభ ఆ ందోళన వ్యక్తం చేసింది. కార్పొరేట్, కమ్యునల్ బంధం నెక్సస్ అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలు మహిళా కార్మికులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇళ్లల్లో, పని ప్రదేశాలలో, సమాజంలో మహిళలపై హింస పెరిగిందని ఆందోళన వ్యక్తం చేసింది. లేబర్ కోడ్లు మహిళా కార్మికులపై చాలా ప్రతికూల ప్రభావాలను చూపుతోందని పేర్కొంది. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రచారం చేస్తున్న మనువాద భావజాలం సమాజంలో మహిళల పాత్ర తగ్గించి హింసను ప్రేరేపిస్తుందని తీర్మాణంలో స్పష్టం చేసింది.



ప్రమోద్

విచారకరం

సిఐటియు 18వ అఖిలభారత మహాసభ సందర్భంగా ప్రజాశక్తి దినపత్రికలో డిసెంబర్ 23వ తేదిన 'సిఐటియు ఆవిర్భావం' శీర్షికతో ఐటమ్‌ను అసందర్భంగా ప్రచురించాము. అందుకు విచారం వ్యక్తం చేస్తున్నాము. చరిత్రకు సంబంధించిన ఈ అంశాన్ని కామ్రేడ్ సుకోమల్ సేన్ రచించిన 'భారత కార్మికోద్యమ చరిత్ర' పుస్తకం నుండి సంగ్రహించడం జరిగింది. దీనికి ప్రజాశక్తి సంపాదక వర్గానిదే బాధ్యత. దీనికి, సిఐటియు నాయకత్వానికి ఎలాంటి సంబంధం లేదు.

- సంపాదకుడు

వెనిజులాపై దాడికి నిరసనగా జరిగిన సభలో మాట్లాడుతున్న తపన్‌సేన్

బహిరంగ సభ సన్నాహాల్లో వాలంటీర్లు, సిద్ధమవుతున్న స్టేడియం

ఉపాధి చట్టం రద్దు
దేశ సమగ్రతకు, ఉపాధికి వినాశకరం

- లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా 19న కార్మిక, కర్షక ఐక్యతన దినం
- ఎఐఎడబ్ల్యుయు అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి వెంకట్, ఎ విజయరాఘవన్
- 5న లక్ష పంచాయతీల్లో ఆందోళనలు : విక్రమ్‌సింగ్

ఆనంతవట్టం ఆనందన్‌నగర్ నుండి
ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

ఉపాధి చట్టం రద్దు దేశ సమగ్రతకు, ఉపాధికి వినాశకరమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి వెంకట్, ఎ విజయరాఘవన్ తెలిపారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ ప్రాంగణంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశ లో వారు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 19న కార్మిక, కర్షక ఐక్యత దినం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా లక్షలాది మంది భాగస్వాములు కానున్నారని చెప్పారు. అదే విధంగా ఫిబ్రవరి 12న జరగబోయే దేశ వ్యాప్త సమ్మెకు వ్యవసాయ కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు చెబుతోందని అన్నారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వందలాది సంఘాలతో ఈ నెల 8న ఢిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిబి ఆర్‌ఎఎం జి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని కేరళ ప్రభుత్వం ఇప్పటికే వ్యతిరేకించిందని, తెలంగాణ ప్రభుత్వం తిరస్కరిస్తూ తీర్మానం చేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరించటం శోచనీయం అన్నారు. రాష్ట్రంపై రూ.30 వేల కోట్లు భారం పడుతుంటే పంచాయతీల్లో సంబరాల నిర్వహణకు సిద్ధపడటం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా వైఖరి మార్చుకోకుంటే ప్రజా ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి విక్రమ సింగ్ మాట్లాడుతూ.. 5న లక్ష పంచాయతీల్లో ఆందోళనలు చేపట్టనున్నామని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మోడీ పాలనలో దళితులు, మహిళలు, రాజ్యాంగ హక్కులపై యథేచ్ఛగా దాడులు జరుగుతున్నాయని, దీనికి వ్యతిరేకంగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎఐఎడబ్ల్యుయు అఖిల భారత ప్రధాన కార్యదర్శి విజయరాఘవన్

స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో
శాశ్వత ఉద్యోగాలకు ఎసరు!

- ఆలిండియా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్

అనంతవట్టం ఆనందన్ నగర్,
గ్రేటర్ విశాఖ బ్యూరో

దశాబ్దాలుగా ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, దీంతో యువత ఏళ్ల తరబడి ప్రభుత్వోద్యోగాలకు నోచుకోవడం లేదని ఆలిండియా రాష్ట్ర ప్రభుత్వ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీకుమార్ (కేరళ) వెల్లడించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థలను తెరపైకి తెచ్చి శాశ్వత ఉద్యోగాలకు పూర్తిగా ఎసరు పెట్టాయని అన్నారు. ప్రభుత్వ రంగాన్ని ప్రభుత్వమే ఎలా నిర్వీర్యం చేస్తుండడంతో సహా అనేక అంశాలపై ఆయన 'ప్రజాశక్తి'తో ముచ్చటించారు. ఆ విశేషాలు..

ప్ర: మీ సంఘం ఎలా ఏర్పడింది? నిర్వహించిన పోరాటాలేమిటి?

జ: ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వివిధ రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఉద్యోగ సంఘాల (ఎన్‌జిఓ)తో కలిసి 1960ల్లో ఏర్పాటైంది. ఆ రోజుల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం (డిఎ) సక్రమంగా వచ్చేది కాదు. ఉద్యోగ నిబంధనలు కూడా దుర్భరంగా ఉండేవి. అటువంటి స్థితిలో 1960 జనవరి 22, 23 తేదీల్లో దేశ వ్యాప్తంగా ఉండే ఎన్‌జిఓలంతా హైదరాబాద్‌లో సమావేశమై ఈ ఫెడరేషన్‌ను స్థాపించడం జరిగింది. 54 రోజుల పాటు అన్ని రాష్ట్రాల్లోని ఎన్‌జిఓలు చేసిన సమ్మె ఫలితంగా పే స్ట్రక్చర్ అమల్లోకి వచ్చింది. ఇది వచ్చాక కూడా అనేక రాష్ట్రాల్లో ముఖ్యంగా తెలంగాణ, ఏపిలో 5ఏళ్లకోసారి వేతన సవరణ జరగ్గా, మిగతా రాష్ట్రాల్లో 10 సంవత్సరాలకు ఒకసారి సవరణ జరిగేది. 2004లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ స్కీం (ఎన్‌పిఎస్)ను పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మినహా అన్ని రాష్ట్రాల్లో అమలు చేయడం జరిగింది. అనేక సంవత్సరాల సుదీర్ఘపోరాటం తర్వాత నూతన పెన్షన్ స్కీం స్థానంలో యుపిఎస్ అంటే యూనిఫైడ్ పెన్షన్ స్కీంను తీసుకొచ్చింది. పేరు మార్పు తప్ప సిపిఎస్‌కు యుపిఎస్‌కు మధ్య పెద్ద తేడా ఏమీ లేదు.

ప్ర: మీ డిమాండ్లు ఏమిటి? ఎలా పరిష్కరించాలని అనుకుంటున్నారు?

జ: యూనిఫైడ్ పెన్షన్ స్కీంను రద్దుచేసి పాత పెన్షన్ స్కీం (ఓపిఎస్)ను పునరుద్ధరించాలన్నది మా ప్రధాన డిమాండ్. రెండో ప్రభుత్వ శాఖల్లోని విద్య, వైద్య విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిన నియామకాలు రద్దుచేసి, పర్మినెంట్ ఉద్యోగులను రిక్రూట్ చేయాలన్నది రెండవ డిమాండ్. ప్రభుత్వ నియామకాలు జరపకుండా స్కిల్ డవలప్‌మెంట్ సంస్థలను ఏర్పాటు చేసి వాటి ద్వారా కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేస్తుండడం వల్ల ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లు నిర్వీర్యం అయిపోయాయి. యువతకు పర్మినెంట్ ఉపాధి కనుచూపుమేరలో కానరావడం లేదు. కేంద్ర ప్రయోజిత పథకాలైనటువంటి ఎస్‌ఎస్‌ఏ (సర్వ శిక్ష అభియాన్) లాంటి వాటిల్లో కూడా శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టడం లేదు. వీటికి వ్యతిరేకంగా మేం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉద్యమాలను తీవ్రతరం చేస్తున్నాం..

ప్ర: కార్మికవర్గంపై లేబర్ కోడ్స్ ఎటువంటి ప్రభావం చూపుతాయి?

జ: ఇప్పటికే సాధించుకున్న హక్కులు కాలరాయబడతాయి. ప్రభుత్వాలు లేదా యాజమాన్యాలతో కార్మికులు బేరసారాలాడే శక్తి తగ్గిపోతుంది. అట్టడుగు వర్గాలకు వచ్చే రిజర్వేషన్ ప్రయోజనాలు కనుమరుగవుతాయి. పని పరిస్థితుల మెరుగుదల కోసం చేసే పోరాటాలపై ప్రభుత్వాలు నిర్బంధం పెంచడానికి ఈ లేబర్ కోడ్‌లను ఉపయోగిస్తాయి. వీటిని తిప్పికొట్టేందుకు ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెకు యావత్ కార్మికవర్గం సన్నద్ధమవుతున్నది.

ఐక్య పోరాటాలతో భూసేకరణపై వెనక్కి

- సిఐటియు కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వరలక్ష్మి

ప్రజాశక్తి -ప్రత్యేక ప్రతినిధి

దేశంలో మొట్టమొదటిసారిగా భూసేకరణపై ప్రభుత్వం వెనక్కి తగ్గిన సంఘటన కర్నాటకలో చోటుచేసుకుంది. దేవనహళ్లి తాలూకా చెన్నారాయపట్నం లో 177 ఎకరాల వ్యవసాయ భూమిని ఎరోస్పేస్ డిఫెన్స్ పరిశ్రమ కోసం గత బిజెపి ప్రభుత్వం భూసేకరణకు పూనుకుంది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాలను కొనసాగించింది. దీనికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు అండగా సిఐటియు నిలిచింది. ఆ ఐక్యపోరాటం విజయం సాధించిన తీరును కర్నాటక రాష్ట్ర సిఐటియు కార్యదర్శి ఎస్ వరలక్ష్మి ప్రజాశక్తికి వివరించారు. ఆ వివరాలు క్లుప్తంగా

ప్ర: ప్రభుత్వ భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాటం ఎలా జరిగింది?

జ: చెన్నరాయపట్నంలో 1777 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించేందుకు అప్పటి బిజెపి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాల వేదికను ఏర్పాటైంది. సుమారు 1200 రోజులు ఆందోళనలు కొనసాగించాం. ఈ ఆందోళనలో సిఐటియుతో పాటు అనేక ట్రేడ్ యూనియన్లు, దళిత సంఘాలు, మహిళా సంఘాలు భాగస్వాములయ్యాయి, పభుత్వం లాఠీఛార్జీలు, అరెస్టులకు సైతం పాల్పడింది. బెంగళూరు ఫ్రీడమ్ పార్క్ వద్ద పది రోజులు పాటు ఆందోళన కొనసాగించగా సినీ ప్రముఖులు, కళాకారులు వివిధ రంగాల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

ప్ర: కార్మికులు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఎలా ఉంది?

జ : భారతదేశంలో అత్యధిక పరిశ్రమలు కలిగిన దేశంగా కర్ణాటక రెండవ స్థానంలో ఉంది. సుమారు ఐదు లక్షల పరిశ్రమలు ఉన్నాయి. స్థానికులతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది కార్మికులకు ఇక్కడ ఉపాధి లభిస్తుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. రెండేళ్లు గడిచినా అనేక హామీలు అమలుకు నేచుకోలేదు. ముఖ్యంగా చెన్నారాయపట్నం భూసేకరణను వెనక్కితీసుకుంటామని చెప్పి ఆచరణలో భిన్నంగా వ్యవహరించింది. పోరాటాల ఫలితంగా తప్పనిసరి పరిస్థితుల్లో వెనక్కి తగ్గింది. కార్మికుల పోరాట ఫలితంగా ఎనిమిది గంటల పని విధానం కొనసాగుతోంది.

ప్ర : కనీస వేతనాలపై ప్రభుత్వ వైఖరి ఏమిటి;?

జ : కనీస వేతనాలపై పాలక ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. గడిచిన ఏడు సంవత్సరాలుగా పాత విధానమే కొనసాగుతుంది. కావున అసంఘటిత రంగంలో కేవలం రూ.12000 నుంచి రూ.18,000 వరకు వేతనాలు పరిమితం అవుతున్నాయి. దాదాపుగా అన్ని పరిశ్రమంలో 50 నుంచి 60 శాతం నాన్ పర్మినెంట్ ఉద్యోగులే ఉన్నారు. కనీస వేతన రూ.30, 000 చేయాలని దశల వారి ఆందోళనలు చేపట్టాము. ఈ సమస్యలపై చర్చల సైతం జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే భవిష్యత్తులో విశాల ఉద్యమాలను చేపట్టనున్నాము.

ప్ర: ఐటీ రంగంలోని ఉద్యోగులకు, గిగ్ వర్కర్ల సమస్యలపై ఎటువంటి పోరాటాలు నిర్వహిస్తున్నారు. డిమాండ్లు ఏమిటి..?

జ : బెంగళూరు ఐటి కంపెనీలకు కేంద్రం. ఆయా సంస్థలలో ఐటి రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం ఏర్పడిన కే2 ఇప్పటికే అనేక ఆందోళన నిర్వహించింది. ఈ ఆందోళనలకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలిపింది. అదేవిధంగా జొమాటో, స్విగ్గి, ఉబర్ వంటి రంగాలలో పనిచేస్తున్న వారికి సామాజిక భద్రత లేదు. కేవలం యాక్సిడెంట్లు, డెత్ బెనిఫిట్స్ మాత్రమే పాలక ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు వర్కర్లందరి కోసం రామ్ రెడ్డి నుంచి వసూలు చేస్తున్న సెస్ ద్వారా కనీస భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నాము.

అమెరికా దాడిపై ఆగ్రహజ్వాల

- విశాఖ ఆర్‌కే బీచ్ రోడ్డులో సిఐటియు ప్రదర్శన
- క్షేత్రస్థాయిలో నిరసనలకు పిలుపు

ప్రజాశక్తి-అనంతవట్టం ఆనందన్ నగర్ నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

వెనిజులాపై అమెరికా చేసిన సామ్రాజ్యవాద దాడిపై సిఐటియు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మహాసభలో చర్చలు జరుగుతున్న సమయంలోనే దాడి విషయం తెలిసింది. దీంతో మహాసభకు హాజరైన ప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. అమెరికా పాశవిక దాడిని ఖండిస్తూ అప్పటికప్పుడు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు పెద్ద ఎత్తున అమెరికా వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌కె బీచ్ రోడ్డులో నిరసన ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శన ముందు భాగాన సిఐటియు జాతీయ నాయకత్వం నడిచింది. అమెరికా దాడులకు వ్యతిరేకంగా ప్రతినిధులు చేసిన నినాదాలతో బీచ్‌రోడ్డు మారుమ్రోగింది. అనంతరం మహాసభ ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రాజకీయాలు ప్రపంచ శాంతిని నాశనం చేస్తున్నాయని అన్నారు. ఇది తీవ్రమైన దాడి అని, సిఐటియు తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. తక్షణమే ప్రపంచ దేశాలు దీనిపై స్పందించి వెనిజులాకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అయితే భారత ప్రభుత్వం స్పందించకపోవడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. సిఐటియు అధ్యక్షులు కె. హేమలత మాట్లాడుతూ అమెరికా దాడులపై దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

బీచ్ రోడ్డులో ప్రదర్శన

సోషలిస్టు చైతన్యం రగిలించేందుకు కృషి

- పోరాటాలకు మరింత పదును
- భావజాల రంగానికి ప్రాధాన్యత
- కార్మిక సంక్షేమంలో కేరళ ఆదర్శం
- ముగిసిన మహాసభ చర్చలు

సామ్రాజ్యవాదం, నయా-ఉదారవాద యుగంలో వేళ్లూనుకుంటున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రత్యామ్నాయాల సాధనకు వ్యూహాత్మక కార్యాచరణ రూపొందించుకొని పోరాడతామని సిఐటియు 18వ అఖిల భారత మహాసభ శనివారంనాటి చర్చల్లో ప్రతినిధులు చెప్పారు. ప్రస్తుతం దేశంలోని పాలక బిజెపి ప్రభుత్వం కార్పొరేట్-మతతత్వ బంధం కలిగి ఉందని, ఇదొక ప్రత్యేక, కార్మిక వ్యతిరేక పంథాతో కూడిన సిద్ధాంతమని అంచనా వేశారు. ఈ తిరోగమన సిద్ధాంతాన్ని కార్మికవర్గం సమర్ధవంతంగా ఎదుర్కొని ఓడించాలంటే బహుముఖంగా పని చేయాలని అభిప్రాయపడ్డారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ పోరాటాలకు మరింత పదును పెట్టాల్సి ఉందన్నారు. సరళీకరణ, మతోన్మాద భావజాలం ఒక పథకం ప్రకారం సమాజంలో విస్తరింపజేస్తున్నారని, కళ, సాహిత్య, మీడియా, సాంస్కృతిక రంగాల్లో కేంద్రీకరించి చేయడం ద్వారా ప్రత్యామ్నాయ సిద్ధాంత భావజాలాన్ని పెంపొందించాలన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుల హక్కుల సంక్షేమానికి ప్రాధాన్యత ఉండదని, శ్రమ దోపిడీనే పరమావధని, ప్రత్యామ్నాయం సోషలిజమేనని, ఆ వైపు కార్మికులను, ప్రజలను నడిపించాలని పిలుపునిచ్చారు. కార్మిక సంక్షేమం విషయంలో రోల్ మోడల్‌గా ఉన్న కేరళ అనుభవాలను అమలు చేస్తామన్నారు.ఉద్యమం బలోపేతానికి ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనపై ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ సభ ముందుంచిన నివేదికపై శనివారం వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు, వివిధ రంగాల్లో పని చేస్తున్న 30 మంది ప్రతినిధులు చర్చల్లో ఉత్తేజంగా మాట్లాడారు. ప్రధాన కార్యదర్శి ప్రవేశపెట్టిన కార్యకలాపాల నివేదికపై గురు, శుక్రవారాల్లో 59 మంది, నిర్మాణ నివేదికపై 52 మంది చర్చల్లో పాల్గొన్నారు. శనివారంతో మహసభ చర్చలు ముగిశాయి.

చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి
అనతలవట్టం ఆనందన్ నగర్ (విశాఖపట్నం)

నివాస ప్రాంతాల్లో కేంద్రీకరణ
ఎ. నాగరాజు, ఆంధ్రప్రదేశ్

కార్మికుల ఆర్థిక డిమాండ్లకు సమాంతరంగా నివాస ప్రాంతాల్లో కేంద్రీకరించి పని చేస్తున్నాం. కార్మికులకు ఆర్థిక తోడ్పాటుకు సహకార సంస్థలు ఉత్తమమైనవి. కేరళలో కోఆపరేటివ్స్ ద్వారా క్షేత్ర స్థాయికి నిత్యావసర వస్తువులను సైతం పంపిణీ చేస్తున్నారు. కేరళలో మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌లోనూ కొన్ని ప్రదేశాల్లో చిన్న ప్రత్నాయాలు చేసి విజయం సాధించాం. విశాఖపట్నంలో సొసైటీలు ఏర్పాటు చేశాం. అధిక వడ్డీలపై అప్పులు తీసుకొని ఆర్థికంగా చితికిపోతున్న కార్మికులకు రూ.లక్ష, రెండు లక్షల వంతున స్వల్ప వడ్డీలకు రుణాలిప్పిస్తున్నాం. ఈ ఆర్థిక తోడ్పాటుతో కార్మికులను ఆకర్షిస్తున్నాం. అంగన్‌వాడీ, విఒఎలకు థ్రిఫ్ట్ ఫండ్ కొనసాగిస్తున్నాం. కొన్ని ప్రాంతాల్లో స్థానికంగా జరిగే పండుగలు, సామూహిక కార్యక్రమాల్లో జోక్యం చేసుకోవడం, పాల్గొనడం చేస్తున్నాం. నిత్యావసరాల వస్తువులను తక్కువ ధరకు కొన్ని చోట్ల అందించే ప్రయత్నాలు జరిగాయి. కరోనా సమయంలో బస్తీలలో, వలస కార్మికులకు నిత్యావసరాలు అందించాం. భూమి సంబంధ ఆందోళనలపై రైతులు, వ్యవసాయ కార్మికులు నిర్వహిస్తున్న పోరాటాల్లో సంఘీభావంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములవుతున్నాం. అరకులో ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూలు నడుపుతున్నాం. ఆ పాఠశాలలో వెయ్యి మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విజ్ఞానకేంద్రాలు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాం. మేడే, సిఐటియు ఆవిర్భావ దినోత్సవం, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాం.

శ్రామిక ప్రజల భాగస్వామ్యం
వి. భూపాల్, తెలంగాణ



ఉదారవాద విధానాల పాలనకు వ్యతిరేకంగా దశాబ్దాలుగా చేస్తున్న ఉద్యమాలు శ్రామిక ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతున్నాయి. అయితే ప్రత్యామ్నాయ నిర్మాణ దిశగా నిర్మాణం పెరగాలని కోరుకుంటున్నాం. పెట్టుబడిదారీ వ్యవస్థను సోషలిస్టు వ్యవస్థగా మార్చేందుకు కార్యక్రమాలు చేయాలని నిర్ణయించాం. పని ప్రదేశాల్లో ఉన్న చైతన్యం నివాస ప్రాంతాల్లో పెరిగేలా కృషి చేస్తున్నాం. ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి మతోన్మాద శక్తులు అనేక కార్యక్రమాలు నిర్వహించి కార్మికుల్లో అనైక్యత తెస్తున్నాయి. ఈ పరిస్థితులను చక్కదిద్దేలా చైతన్య కార్యక్రమాలు తీసుకుంటున్నాం. పెట్టుబడిదారి వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో అనేక సమస్యలు ముందుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాలకుల విధానాలపై విశాల పోరాటాలు నిర్వహిస్తున్నాం.

కార్మిక సంక్షేమానికి లెఫ్ట్ ప్రభుత్వం పూచీ
శశి కుమార్, పికె సంతోష్- కేరళ

కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలతో శ్రామికులను దోపిడీ చేస్తుండగా, కేరళలో వామపక్ష ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలతో కార్మికులకు అండగా నిలిచింది. వాస్తవానికి వామపక్ష ప్రభుత్వాలు ఉన్న సమయంలో పశ్చిమబెంగాల్‌లో, త్రిపురలో, కేరళలో అమలు చేశాయి. కార్మికులు, పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడ్డాయి. కేరళలో లెఫ్ట్ హయాంలో వలస కార్మికులను ఆదుకునే అనేక చర్యలు తీసుకోవడం జరిగింది. సామాజిక పింఛన్లు సహా అనేక పథకాలు పేదలకు, కార్మికులకు అమలవుతున్నాయి. 35-60 సంవత్సరాల మధ్య మహిళలకు పింఛన్లు అందుతున్నాయి. పేదరికం లేని రాష్ట్రంగా తయారు చేయడానికి ప్రయత్నిస్తోంది. మోడీ ప్రభుత్వం తెచ్చిన లేబర్‌కోడ్స్‌ను అమలు చేయబోమని తొలుత ప్రకటించింది కేరళనే. కేంద్రం కోఆపరేటివ్స్‌ను ప్రత్యేక చట్టాలతో నిర్వీర్యం చేస్తుండగా, కేరళ ప్రభుత్వం కోఆపరేటివ్స్‌ను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాలకు సైతం సేవలు విస్తరిస్తోంది. నిత్యావసర వస్తువులను చౌక ధరలకు పంపిణీ చేస్తోంది. సహకార వ్యవస్థకు రోల్‌మోడల్‌గా నిలిచింది. రైల్వే వంటి రంగాల్లోకి సిఐటియు విస్తరించింది. నివాస ప్రాంతాల్లోకి, గ్రామాల స్థాయికి కార్యక్రమాలను విస్తరిస్తోంది. యువకులు, మహిళల సమస్యలపై పని చేస్తోంది. సాంస్కృతిక రంగంలో విస్తృతంగా పని చేస్తోంది. సోషలిజంపై ప్రచారం చేస్తున్నాం.

మమత, బిజెపి మధ్య రాజకీయ కెమిస్ట్రి
భూమర్ చక్రవర్తి, లక్రా

రాష్ట్రంలో మమత బెనర్జీ ప్రభుత్వం, బిజెపికి మధ్య రాజకీయంగా అనుబంధం, అవగాహన పరోక్షంగా ఉన్నాయి. వారిద్దరి అప్రజాస్వామిక వైఖరి వలన ప్రజలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నాయి. ఇరువురి విధానాలూ కార్పొరేట్, మతతత్వానికి అనుకూలంగా ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా క్షేత్ర స్థాయిలో ప్రణాళికాబద్ధంగా పని చేయాలనుకుంటున్నాం. జూట్, రైల్వే, స్టీల్ రంగాల్లో సంఘ కార్యకలాపాలు నిర్వహిస్తాం. మహిళలకు సమాన పనికి సమాన వేతనం లేదు. పని గంటలకు పరిమితి లేదు. లైంగిక, సామాజిక వివక్షకు గురవుతున్నారు.

వామపక్షాలపై వ్యతిరేక ప్రచారం
నిరంజన్ రాయ్- త్రిపుర

వామపక్షాలు, వారి భావజాలం అభివృద్ధికి వ్యతిరేకమని బిజెపి, ఇతర పాలకవర్గ పార్టీలు త్రిపురలో వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయి. సిఐటియు, వామపక్షాలు ప్రజల నిజమైన అభివృద్ధికి వ్యతిరేకం కాదు. కార్పొరేట్ అభివృద్ధికే వ్యతిరేకం. ఈ వాస్తవాన్ని విస్తృతంగా కార్మికుల్లో ప్రజల్లో ప్రచారం నిర్వహించి చైతన్యపర్చాల్సి ఉంది. అందుకు కృషి చేస్తున్నాం. కోఆపరేటివ్స్‌ను బలోపేతం చేసి ప్రత్యామ్నాయం చూపిస్తాం.

సెక్యులర్ సెలబ్రేషన్స్
ప్రతాప్ సిన్హా- కర్ణాటక

మతతత్వ సిద్ధాంతం రాజ్యమేలుతున్న తరుణంలో ప్రత్యామ్నాయంగా కార్మికవర్గం లౌకిక వాదాన్ని పెంపొందించే వివిధ ఉత్సవాలను ప్రత్యేకంగా నిర్వహించాలి. వీటిని క్షేత్ర స్థాయికి విస్తరించాలి. యువతను సోషలిజం వైపు మళ్లించేందుకు కృషి చేయాలి. గ్రామ స్థాయిలో ఉమ్మడి కార్యక్రమాలు చేపట్టాలి.

రోటీ, కపడా, మకాన్ కోసం ఆందోళనలు
అమర్‌నాథ్- పంజాబ్

సరళీకరణ విధానాల కాలంలో ప్రజలకు రోటీ, కపడా, మకాన్ (కూడు, గుడ్డ, గూడు) దక్కడం గగనమైంది. వాటి కోసం ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేయాల్సి ఉంది. కనీస వేతనాల్లేక కాంట్రాక్టు కార్మికులు దోపిడీకి గురవుతున్నారు. వారి సమస్యలపై కేంద్రీకరించి పని చేస్తున్నాం.

గుజరాత్ తరహా పాలన
కౌశల్ పాండే, శ్రీకాంత్ - మహారాష్ట్ర

గుజరాత్ తరహా మతతత్వ పాలనను మహారాష్ట్రలో బిజెపి అమలు చేస్తోంది. దీన్నే మంచి పాలన అని ప్రచారం చేసుకుంటోంది. మోడీ ఇదే విషయాన్ని మన్‌కే బాత్‌లో సైతం చెప్పుకుంటున్నారు. ఇటువంటి ప్రచారాన్ని తిప్పికొట్టడానికి చిన్న మీటింగ్‌లు పెట్టి కార్మికులకు, ప్రజలకు అర్థమయ్యేటట్లు వివరించాలి. కనీస వేతన బోర్డు పని చేయట్లేదు. మహారాష్ట్ర బిజెపి ప్రభుత్వం కార్మికుల కోసం పోరాడే వారిని అర్బన్ నక్సల్స్‌గా పేర్కొంటోంది. పలువురిని కఠినాతికఠినమైన చట్టాలను ప్రయోగించి జైళ్లల్లో కుక్కుతోంది. అక్రమ అరెస్టులతో తీవ్ర నిర్బంధం అమలు చేస్తోంది.

మిత్రులను కలుపుకోవాలి
సుమిత్రా చోప్రా- రాజస్థాన్

బిజెపి తన కార్పొరేట్-మతతత్వ పాలనకు తన చేతిలో ఉన్న భారీ వనరులతో అనుకూల ప్రచారం చేసుకుంటోంది. కార్మిక హక్కుల రక్షణ, సంక్షేమం కోసం కలిసొచ్చే మిత్రులను కలుపుకొని ఆందోళన, ప్రచార కార్యక్రమాలు రూపొందించుకోవాలి.

దళితులపై దాడులు
లేక్‌రాజు- ఉత్తరాఖండ్

బిజెపి ప్రభుత్వంలో దళితులపై దాడులు జరుగుతున్నాయి. దళిత వ్యతిరేక ప్రచారం సాగుతోంది. దళితులను సమీకరించి ఆందోళనలు రూపొందిస్తున్నాం. రాష్ట్రంలో రహదారుల నిర్మాణం పేరిట పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సైతం చెప్పింది. పర్యావరణ పరిరక్షణతో పాటు రోడ్ల నిర్మాణంలో ఇళ్లు, బస్తీలు కోల్పోతున్న పేదలు, కార్మికులకు అండగా పోరాడుతున్నాం.

కటక్‌లో సహకార సంఘం
పుష్పదాస్- ఒరిస్సా

కేరళ మోడల్‌లో కటక్ జిల్లాలో సిఐటియు జిల్లా సెక్రటరీ కోఆపరేటివ్ సొసైటీని నడుపుతున్నారు. కార్మికులకు సాయపడేందుకు సదరు సొసైటీ పని చేస్తోంది. మైనింగ్ ఏరియాలో, ఎరువుల ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై, విద్యుత్ ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఇంకా ఢిల్లీ నుంచి మధుబాల, పప్పుయాదవ్ (బీహార్), బిజున్‌దాస్ (అస్సాం), ఆసిష్ కుమార్ (హిమాచల్‌ప్రదేశ్) ప్రత్యామ్నాయ కార్యాచరణపై చర్చల్లో పాల్పంచుకున్నారు.

ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకు...

- భవిష్యత్ పోరాటాలకు దేశవ్యాప్తంగా 'చార్టర్ ఆఫ్ డిమాండ్స్'
- విలేకరుల సమావేశంలో సిహెచ్.నరసింగరావు

కా.అనతలవట్టం ఆనందన్ నగర్
ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కార్పొరేట్ అనుకూల విధానాలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజానీకంపై దాడి చేస్తోందని సిఐటియు అఖిల భారత కార్యవర్గ సభ్యులు సిహెచ్‌నరసింగరావు, రాష్ట్ర అధ్యక్షులు ఎవినాగేశ్వరరావు అన్నారు. శనివారం మధ్యాహ్నం మహాసభ ప్రాంగణంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ ఆధ్వర్యాన జరిగిన విలేకరుల సమావేశంలో నరసింగరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను దూరం చేస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ విధానాలపై మహాసభలో చర్చించినట్లు చెప్పారు. కార్మిక సమస్యలపై 55 మంది 9 గంటల పాటు, రెండో భాగంలో ప్రత్యామ్నాయం విధానంపై 52 మంది 9గంటల పాటు చర్చల్లో పాల్గొన్నట్లు వివరించారు. కేరళ రాష్ట్రంలో పేపర్ మిల్లును కేంద్రం ప్రైవేటీకరించాలని నిర్ణయిస్తే, కార్మికవర్గం నష్టపోకుండా కేరళ రాష్ట్ర ప్రభుత్వమే దానిని నిర్వహించాలని నిర్ణయించిందని, ఎయిర్‌పోర్టును ప్రైవేటు పరం చేయాలని చూడగా కోర్టులో కేసు వేసి వామపక్ష ప్రభుత్వం అడ్డుకుందని చెప్పారు. అన్ని రంగాల్లోనూ ఈ తరహా ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనపై మహాసభలో చర్చలు జరిగినట్లు చెప్పారు. ఇదే అజెండాగా రాబోయే కాలంలో ప్రతి రంగానికి సంబంధించిన 'చార్టర్ ఆఫ్ డిమాండ్స్' రూపొందిస్తున్నట్లు తెలిపారు.

సిఐటియుకు విప్లవ శుభాకాంక్షలు

- ఎఐఇఎ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా సౌహార్ద సందేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి
అనతలవట్టం ఆనందన్ నగర్ (విశాఖపట్నం)

కార్మిక వర్గ సమస్యలపై సమరశీలంగా పోరాడుతున్న సిఐటియుకు ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐఇఎ) సంఘీభావంగా నిలుస్తుందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమించేందుకు సిఐటియు మహాసభ కార్యాచరణ రూపొందించాలని కోరారు. 18వ మహాసభ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సిఐటియు నాయకత్వానికి, ప్రతినిధులకు విప్లవ శుభాకాంక్షలు తెలిపారు. శనివారంనాడు మిశ్రా మహాసభకు వచ్చి సౌహార్ద సందేశం ఇచ్చారు... మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుకు అప్పగించడానికి ప్రయత్నాలు చేస్తోంది. బీమా రంగంలో ప్రస్తుత 74 శాతం నుంచి వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్‌డిఐ) అనుమతిస్తూ బిజెపి ప్రభుత్వం పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిల్లు తెచ్చింది. బీమాలో ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ నియంత్రణలను కుదించింది. దీనికి వ్యతిరేకంగా తమ సంఘం దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేసింది. మా ఆందోళనలకు సిఐటియు సంపూర్ణ మద్దతిచ్చింది. లైఫ్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్, బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ రంగాలే కాదు మొత్తం ప్రభుత్వ రంగాన్ని అమ్మేందుకు, తాకట్టు పెట్టేందుకు చూస్తోంది. ప్రభుత్వ విధానాలను ఉద్యోగులు, ప్రజలు ప్రతిఘటించాలి. మోడీ ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా తమ సంఘం నిరసన ప్రదర్శనలు చేసింది. కార్మికుల ఆందోళనలకు మద్దతిచ్చింది. ఎఐఇఎ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు జరుగుతున్నాయి.... అని మిశ్రా పేర్కొన్నారు.

ఐక్య ఉద్యమాలతో విద్యుత్ సంస్కరణలకు చెక్!

- యుపి ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ప్రేమ్‌నాథ్‌రాయ్

కా.అనంతవట్టం ఆనందన్ నగర్
రాజమహేంద్రవరం- ప్రతినిధి

ముక్కలు ముక్కలుగా చేసి విద్యుత్ సంస్థను కార్పొరేట్లకు అమ్మడానికి బిజెపి నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను సుదీర్ఘపోరాటాలతో తిప్పికొట్టినట్టు ఆ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ప్రేమ్‌నాథ్‌రాయ్ చెప్పారు. సిఐటియు మహాసభకు వచ్చిన ఆయన ఉత్తరప్రదేశ్ విద్యుత్ రంగంలో కార్మికులు చేసిన పోరాటాలను వివరించారు. ఆ వివరాలు క్లుప్తంగా:

ప్ర:మీరు చేసిన పోరాటాల గురించి చెప్పండి ?

జ : విద్యుత్ సంస్కరణలపై పోరాటంలో భాగంగా 2023లో అతిపెద్ద ఆందోళన రాష్ట్రంలో సాగించాం. 175 మంది పర్మినెంట్ ఉద్యోగులను 4వేలమంది కాంట్రాక్టు కార్మికులను ఒకే కలం పోటుతో తొలగించడం జరిగింది. జైళ్లలో కొంతమంది ఉద్యోగులను యోగి ప్రభుత్వం నెట్టింది. పర్మినెంట్ కార్మికులను విధుల్లోకి తిరిగి తీసుకున్నా కాంట్రాక్టు కార్మికులను 4 వేలమందిని నేటివరకూ తీసుకోలేదు. మా సంఘం దీనిపై పోరాడుతూనే ఉంది.ప్రజలను, విద్యుత్ వినియోగదారులను చైతన్య పరచడానికి లక్నో, ఆగ్రా, బనారస్, కాన్పూర్, మీరట్ బరేలి నగరాల్లో భారీ సదస్సులు, కన్వెన్షన్‌లు నిర్వహించడం జరిగింది. అలాగే లక్నో, వారణాసిల్లో భారీ ర్యాలీలను నిర్వహించాం. దీంట్లో రైతులు, విద్యుత్ వినియోగదారులను సమీకరించి పోరాడడంతో ఒక్కో ప్రాంతంలో వేల సంఖ్యలో పాల్గొన్నారు.

ఈనెల 1న నల్లబ్యాడ్జీలతో రాష్ట్రంలో నిరసన తెలిపాం. 12న జరుగనున్న అఖిల భారత సమ్మెలో వీరంతా పాల్గొనేందుకు సిద్ధం అవుతున్నారు.

ప్ర: మీ పోరాటం సాధించిన విజయాలేమిటి?

జ: 2018లో మేం చేసిన ఉద్యమం వల్ల యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం సంయుక్త సంఘర్ష్ సమితిని సంప్రదించకుండా మేం విద్యుత్ సంస్కరణలపై ముందుకు వెళ్లం అని అసెంబ్లీలో ఆదిత్యనాథ్ ప్రకటించడం ఒక విజయం. 2024లో రెండు విద్యుత్ సంస్థలు (పూర్వాంచల్, ధక్షిణాంచల్)ను ప్రైవేటీకరణకు పెట్టాలని భావించినప్పుడు విద్యుత్ శాఖా మంత్రి ఎకె శర్మ అసెంబ్లీలో ప్రైవేటీకరణ జరపమని, నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68